Follow: @ANNTELUGU

21-07-2025

# మహా పత్రిక

సోమవారం, హైదరాబాద్ సంపుటి- 22 సంచిక- 227 పేజీలు-08

PUBLISHED FROM HYDERABAD | TIRUPATI REGISTERED NUMBER: APTEL/2003/09316







## లాల్ దర్వాజ సంబురం
# బోనమెత్తిన భాగ్యనగరం

**సల్లంగసూడమ్మా.. అంటూ తరలిన భక్తజనం**
**మంత్రులు, సెలబ్రిటీల బోనాలు**

**హైదరాబాద్ సిటీ, మహా :** భాగ్యనగరం బోనమెత్తింది. అమ్మల కన్నా మాయమ్మ సల్లంగా సూడమ్మ అంటూ భక్తులు లాల్ దర్వాజ సింహవాహిని అమ్మవారిని దర్శించుకుంటున్నారు. వర్షాలు కురవాలని పిల్లాపాపలు, పాడి, పంటలు బాగుండాలని వేడుకుంటున్నారు. బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకుంటున్నారు.

మిగతా 2లో



## నేటి నుంచే పార్లమెంట్ సెషన్స్

- 21 రోజుల పాటు జరగనున్న సమావేశాలు
- పహల్గాం ఉగ్రదాడి, ఆపరేషన్ సిందూర్ తర్వాత మొదటిసారి
- కేంద్రాన్ని నిలదీసేందుకు ఇండియా కూటమి నిర్ణయం.. వాడివేడిగా చర్చలు జరిగే చాన్స్
- సమావేశాల్లో పలు బిల్లులను కూడా ప్రవేశ పెట్టాలని కేంద్రం సిద్ధం

వివరాలు 2లో

## ముఖ్యమంత్రి రేవంత్ వ్యూహంపై
# సర్వత్రా చర్చ



### ఆర్డినెన్స్ హిట్టవుతుందా?

పదేళ్లలో ఏడు రాష్ట్రాల విఫలయత్నం

కేంద్రం ఆమోదిస్తేనే 42శాతం కోటా

సీఎం ధీమాపై రాజకీయవర్గాల ఆసక్తి

ట్రిపుల్ టీ నే పరిష్కారమా?

మధ్యప్రదేశ్ మోడల్ పై సీఎంకు నివేదికలు

లోకల్ వార్ పై సర్వత్రా ఉత్కంఠ

స్థానికానికి ఇదే సరైన సమయమంటున్న కాంగ్రెస్ వర్గాలు

*తెలంగాణలో స్థానికసంస్థలు ఎన్నికలు ఇపుడు జరుగుతాయా? 42శాతం బీసీ రిజర్వేషన్లపై రాష్ట్ర ప్రభుత్వ ఆర్డినెన్స్ కు గవర్నర్ ఆమోదం పలుకుతారా? ఉత్కంఠగా మారింది. ఆర్డినెన్స్‌కు గవర్నర్ ఆమోదం తెలిపితేనే స్థానిక ఎన్నికల్లో బీసీలకు 42% రిజర్వేషన్లు దక్కే అవకాశం ఉంటుంది. ఒకవేళ గవర్నర్ తిరస్కరించడమో లేక అభ్యంతరాలు వ్యక్తం చేస్తే రిజర్వేషన్ల పెంపు నిలిచిపోయే ప్రమాదం ఉంది. మరి ఈ ఆర్డినెన్స్‌పై గవర్నర్ సంతకం పెడతారా...? లేక న్యాయ, రాజ్యాంగ పరిశీలనకు పంపుతారా...? అన్నది ఆసక్తికరంగా మారింది. గవర్నర్ ఇప్పటికే న్యాయసలహాలు కోరారు. ఒకవేళ రాజ్యాంగ పరిశీలనకు పంపిస్తే మాత్రం నిర్ణయం తీసుకునేందుకు ఆలస్యమయ్యే అవకాశం ఉంది. గవర్నర్ ఆర్డినెన్స్‌ను తిరస్కరిస్తే పరిస్థితి ఏమిటీ, ప్రభుత్వం ఏ విధంగా ముందుకు వెళ్తుందనే అంశంపై కూడా ఉత్కంఠ నెలకొంది. రిజర్వేషన్ల ప్రక్రియను నెలాఖరుకల్లా ముగించాలని సర్కారు భావించినా జాప్యమయ్యే సూచనలు స్పష్టంగా కనబడుతున్నాయి. ముస్లింలను బీసీ జాబితాలో చేర్చడాన్ని, తాము ఒప్పుకోబోమని, ఆ బిల్లును రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి పంపిస్తే తిరస్కరిస్తామని తెలంగాణ బీజేపీ చెబుతోంది.*

**- మహా, హైదరాబాద్**

వివరాలు 2లో

## పల్లా మనసంతా
# జనగామే

### గాయమున్నా.. ప్రజాసమస్యల
### పరిష్కారంపైనే తపన

నీటి సమస్య, స్థానిక సమస్యలపై అధికారులకు ఫోన్లు

కదలలేకున్నా.. ప్రజలకు అండగా నిలుస్తూ కదిలిస్తున్న నేత

పల్లా రాజేశ్వరరెడ్డి స్ఫూర్తిదాయక పనితీరుపై ప్రజల్లో హర్షం

**(మహా ప్రత్యేకం)**



ఆయనను రాజకీయాలకు అతీతంగా అందరూ అభిమానిస్తారు. అప్పగించిన పని నూరుశాతం నెరవేర్చే హండ్రెడ్ పర్సంట్ ప్రజా నాయకుడు ఆయన. భవిష్యత్తును దర్శించే మార్గదర్శి. అధిష్టానం మనసెరిగి కార్యక్షేత్రంలో పార్టీ ప్రయోజనాలు రక్షించే యోధుడు. క్షేత్రం ఏదైనా పల్లా అడుగు పెడితే విజయమే. ఆయన పోటీచేసినా.. బాధ్యత తీసుకున్నా పల్లా మనసుపెడితే విజయం దాసోహమే. జనగామ ఎమ్మెల్యేగా, ఉమ్మడి వరంగల్ జిల్లాలో బీఆర్ఎస్ పార్టీ ఏకైక ఎమ్మెల్యేగా ఉన్న పల్లా రాజేశ్వరరెడ్డి గులాబీ దళపతి కేసీఆర్ అత్యంత సన్నిహితుల్లో ఒకరు. ఇటీవల కేసీఆర్ ఫామ్ హౌజ్ లో పల్లా అనూహ్యంగా గాయపడగా, భారీ ఆపరేషన్ తర్వాత క్రమంగా కోలుకుంటున్నారు. తుంటి ఆపరేషన్లతో కదల లేని స్థితిలో ఉన్నా.. తన మనసు మాత్రం తన నియోజకవర్గం

మిగతా 3లో

## కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీ గణేశ్‌పై దాడికి యత్నం

హైదరాబాద్ లో కలకలం.. కారు ధ్వంసం.. దాడిని అడ్డుకున్న గన్ మెన్లు



హైదరాబాద్, మహా: సికింద్రాబాద్.. కంటోన్మెంట్ శాసనసభ్యుడు శ్రీ గణేష్ పై గుర్తు తెలియని దుండగులు దాడికి యత్నించారు. మానికేశ్వర్ నగర్ లో ఫలహారం బండి ఊరేగింపు కార్యక్రమానికి వెళుతున్న క్రమంలో 30 మంది గుర్తుతెలియని దుండగులు వెబడించి వాహనంపై దాడికి యత్నించగా, ఉస్మానియా యూనివర్సిటీ పోలీస్ స్టేషన్లో ఎమ్మెల్యే శ్రీ గణేష్ ఫిర్యాదుచేశారు. ఎమ్మెల్యేపై దాడికి యత్నించగా, గన్‌మెన్లు అడ్డుకున్నారు. ఈ దాడిలో ఆయన కారు ధ్వంసం అయింది. వెపన్లు కూడా లాక్కోవడానికి ప్రయత్నించారు. దీనిపై ఓయు పోలీస్ స్టేషన్‌లో ఎమ్మెల్యే శ్రీ గణేశ్ కంప్లైంట్ చేశారు. హైదరాబాద్ లో ఈ సంఘటన సంచలనంగా మారింది.

## ఈరోజు చికెన్ ధరలు

1 కేజీ రిటైల్ ధర

| చికెన్ | స్కిన్ లెస్ | బోన్ లెస్ |
|---|---|---|
| 190 | 230 | 250 |

హోల్ సేల్ ధర

| చికెన్ | స్కిన్ లెస్ | బోన్ లెస్ |
|---|---|---|
| 170 | 210 | 220 |

## బంగారం ధరలు

| | |
|---|---|
| 24 క్యారెట్ | 1,00,040 |
| 22 క్యారెట్ | 91,500 |
| సిల్వర్ (కేజీ) | 1,16,500 |

## స్టాక్ మార్కెట్

| | |
|---|---|
| సెన్సెక్స్ | 81,757.73 |
| నిఫ్టీ | 24,968.40 |

## ఈరోజు గుడ్డు ధరలు

| | 1 పీస్ | ట్రే |
|---|---|---|
| ఎన్ఈసీసీ గుడ్డు ధర | 5.1 | 153 |
| హోల్ సేల్ గుడ్డు ధర | 5.1 | 153 |
| రిటైల్ గుడ్డు ధర | 5.41 | 162.18 |



## ఆదిలాబాద్ అభివృద్ధికి బీఆర్ఎస్, బీజేపీ చేసింది గుండు సున్నా

**ఎమ్మెల్యే పాయల్ శంకర్ మాజీ మంత్రి జోగురామన్నలపై కంది శ్రీనివాస రెడ్డి ఫైర్**

సాత్నాల మండలం సయిద్ పూర్ లో భారీ చేరికలు.. బీఆర్ఎస్ బీజేపీల నుండి కాంగ్రెస్ పార్టీలోకి చేరికలు

డప్పులతో ఘనస్వాగతం.. చేరికల కార్యక్రమంలో చైర్మన్ తిరుపతి, టీపీసీసీ ఉపాధ్యక్షులు ఆత్రం సుగుణ

**సాత్నాల (ఆదిలాబాద్):** ఆదిలాబాద్ నియోజక వర్గ అభివృద్ధికి రాష్ట్రంలో గత పదేళ్లు పాలించిన బీఆర్ఎస్, కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ చేసిందేమీ లేదని జీసీసీ చైర్మన్ కొట్నాక తిరుపతి, టీపీసీసీ వైస్ ప్రెసిడెంట్ ఆత్రంసుగుణ కాంగ్రెస్ పార్టీ ఆదిలాబాద్ అసెంబ్లీ ఇంఛార్జి కంది శ్రీనివాస రెడ్డి విమర్శించారు. ఆదివారం సాత్నాల మండలం సయిద్ పూర్ లో తుమ్రం చంద్ర షావ్ ఆధ్వర్యంలో జరిగిన చేరికల కార్యక్రమానికి వారు హాజరయ్యారు.

మిగతా 3లో

## బండి ట్రాప్‌లో ఈటల



**లైన్ దాటేలా వ్యూహాత్మకంగా వ్యవహరించారన్న చర్చ**

తిరుగుబాటు ఫలితంగా పార్టీలో ఇబ్బందులు తప్పవన్న చర్చ

అప్పుడు బీఆర్ఎస్.. ఇప్పుడు బీజేపీపై ఈటల తిరుగుబాటేనా

సహనం కోల్పోతే నష్టమే తప్ప లాభం లేదంటున్న రాజకీయ విశ్లేషకులు

రాజాసింగ్ తర్వాత రాజేందరేనంటూ సోషల్ మీడియాలో ప్రచారం

**హైదరాబాద్, మహా :** ఒకప్పుడు "కట్టప్ప బాహుబలిని ఎందుకు చంపాడు" అనే ప్రశ్న కంటే "బండి సంజయ్ ని అధ్యక్ష పీఠం నుంచి ఎందుకు తప్పించారు" అనే ప్రశ్న తెలంగాణ రాజకీయాల్లో హాట్ టాపిక్ అయింది.

మిగతా 2లో

## హిందీ జాతీయ భాష కాదు

**జాతీయ భాష అవసరం లేదు**

హిందీ భాషా రగడపై కేటీఆర్ ఆసక్తికర వ్యాఖ్యలు

హిందీని బలవంతంగా రుద్దుతామంటే కుదరదని స్పష్టీకరణ

వివరాలు 2లో

## మరోసారి విదేశీ పర్యటనకు మోదీ

- రేపటి నుంచి 26 వరకు బ్రిటన్, మాల్దీవుల్లో పర్యటన
- ద్వైపాక్షిక సంబంధాల బలోపేతమే లక్ష్యంగా
- జులై 23 నుంచి 24 వరకు బ్రిటన్.. 25, 26 తేదీల్లో మాల్దీవుల విజిట్

02

## ముఖ్యమంత్రి రేవంత్ వ్యూహంపై

# సర్వత్రా చర్చ



**హైదరాబాద్, మహా:** తెలంగాణలో స్థానికసంస్థలు ఎన్నికలు ఇపుడు జరుగుతాయా? 42శాతం బీసీ రిజర్వేషన్లపై రాష్ట్ర ప్రభుత్వ ఆర్డినెన్స్ కు గవర్నర్ ఆమోదం పలుకుతారా? ఉత్కంఠగా మారింది. ఆర్డినెన్స్‌కు గవర్నర్ ఆమోదం తెలిపితేనే స్థానిక ఎన్నికల్లో బీసీలకు 42% రిజర్వేషన్లు దక్కే అవకాశం ఉంటుంది. ఒకవేళ గవర్నర్ తిరస్కరించడమో లేక అభ్యంతరాలు వ్యక్తం చేస్తే రిజర్వేషన్ల పెంపు నిలిచిపోయే ప్రమాదం ఉంది. మరి ఈ ఆర్డినెన్స్‌పై గవర్నర్ సంతకం పెడతారా...? లేక న్యాయ, రాజ్యాంగ పరిశీలనకు పంపుతారా...? అన్నది ఆసక్తికరంగా మారింది. గవర్నర్ ఇప్పటికే న్యాయసలహాలు కోరారు. ఒకవేళ రాజ్యాంగ పరిశీలనకు పంపిస్తే మాత్రం నిర్ణయం తీసుకునేందుకు ఆలస్యమయ్యే అవకాశం ఉంది. గవర్నర్ ఆర్డినెన్స్‌ను తిరస్కరిస్తే పరిస్థితి ఏమిటీ, ప్రభుత్వం ఏ విధంగా ముందుకు వెళ్తుందనే అంశంపై కూడా ఉత్కంఠ నెలకొంది. రిజర్వేషన్ల ప్రక్రియను నెలాఖరుకల్లా ముగించాలని సర్కారు భావించినా జాప్యమయ్యే సూచనలు స్పష్టంగా కనబడుతున్నాయి. ముస్లింలను బీసీ జాబితాలో చేర్చడాన్ని తాము ఒప్పుకోబోమని, ఆ బిల్లును రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి పంపిస్తే తిరస్కరిస్తామని తెలంగాణ బీజేపీ చెబుతోంది. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల అమలు పేరుతో ముస్లింలకు 10% రిజర్వేషన్లు అమలు చేయడం దుర్మార్గమని మండిపడుతున్నారు. ముస్లింలను బీసీ రిజర్వేషన్ల జాబితా నుంచి తొలగించకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమిస్తామని తెలంగాణ బీజేపీ నేతలు హెచ్చరిస్తున్నారు. స్థానికసంస్థల ఎన్నికలు త్వరగా నిర్వహించాలన్న పట్టుదలతో ప్రభుత్వం ఉంది. గత ఏడాదిన్నర కాలంగా దీనిపై కసరత్తు చేసి కులగణన, బీసీ డెడికేటెడ్ కమిషన్ లను నియమించింది. న్యాయపరంగా చిక్కులు రాకుండా పకడ్బందీగా ముందుకు సాగుతున్నా, కేంద్రం సహకారముంటేనే ఇది పూర్తిస్థాయిలో ఫలించే అవకాశాలున్నాయని నిపుణులు అంటున్నారు. అయితే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పట్టుదల చూసి.. ఏదో అనూహ్య ఎత్తుగడ అవలంభిస్తారన్న ఆసక్తి రాజకీయవర్గాల్లో ఉంది.

**ప్రభుత్వపరంగా దూకుడు**

స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం బీసీ రిజర్వేషన్ల పెంపు అంశాన్ని సీరియస్‌గా తీసుకున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆర్డినెన్స్ , జీవోలపై ఎవరూ కోర్టులకు వెళ్ళకుండా అడ్డుకోవాల్సిన బాధ్యత బీసీ నాయకత్వానిదేనని చెప్పారు. సంబంధిత మంత్రి, సీఎం సంతకాలు చేసి గవర్నర్ జిష్ణుదేవ్ శర్మకు ఆర్డినెన్స్ ఫైల్‌ను పంపారు. 285(A) సెక్షన్‌లో సవరణ చేస్తూ... ఎటువంటి లీగల్ చిక్కులు రాకండా ముసాయిదా డ్రాఫ్ట్‌ను గవర్నర్‌కు పంపారు. గవర్నర్ నుంచి ఆమోదం రాగానే ఆర్డినెన్స్ నోటిఫికేషన్ తో పాటు ఎన్నికల షెడ్యూల్ కూడా రావొచ్చని తెలుస్తోంది. అయితే ఆర్డినెన్స్ ను అడ్డుకునేందుకు ఇప్పటికే అనేక మంది రెడీగా ఉన్నారు.

**పదేళ్లలో ఏడురాష్ట్రాలు ఫెయిల్**

గడచిన పదేళ్ళలో ఏడురాష్ట్రాలలో 50శాతం కోటా మించి రిజర్వేషన్ల పెంపుకు చేసిన ప్రయత్నాలు విఫలమయ్యాయి. సుప్రీంకోర్టు మార్గదర్శకాలను అనుసరించి గుజరాత్, ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్ రాష్ట్రలు ప్రధానంగా ఓటరు జాబి తా ఆధారంగా బీసీల రిజర్వేషన్లను స్థిరీకరించాయి. మహారాష్ట్ర సైతం అదేబాటలో కొనసాగుతున్నది. ఇక బీహార్, కర్ణాటక రాష్ట్రలు మాత్రం సమగ్ర కులసర్వేలను నిర్వహించాయి. వాటి ఆధారంగా బీసీ రిజర్వేషన్లను స్థిరీకరించేందుకు కసరత్తు చేస్తున్నాయి. ఒడిశా ప్రభు త్వం మాత్రం కమిషన్ ఏర్పాటు చేయకుండా, బీసీ రిజర్వేషన్లను మొత్తంగా రద్దు చేసి, వాటన్నింటినీ జనరల్ స్థానాలుగా మార్చింది. బీసీలకు పార్టీ పరంగా 50 శాతం టిక్కెట్లు కేటాయించింది. గుజరాత్, మహారాష్ట్ర, స్థానిక సంస్థల ఎన్నికలను కూడా దేశ అత్యున్నత న్యాయస్థానం రద్దు చేసింది. సిఫారసులు లేకుంటే బీసీ రిజర్వేషన్ స్థానాలన్నింటినీ జనరల్ స్థానాలుగానే మార్చాలని కూడా వెల్లడించింది. గత పదేళ్ళలో ఏడురాష్ట్రాలు రిజర్వేషన్ల పెంపుకు సంబంధించి జారీచేసిన ఆర్డినెన్స్‌లను కోర్టులు కొట్టివేశాయి. ఏవైనా 50శాతం లోపే ఉండాలని తేల్చిచెబుతున్నాయి.

**ట్రిపుల్ టీ మోడల్ బెస్ట్**

మధ్యప్రదేశ్ లో మాత్రం యూనిట్ వారీగా రిజర్వేషన్ల మథనం చేసి.. స్థానిక పరిస్థితులకు అనుగుణంగా రిజర్వేషన్ల సర్దుబాటు చేశారని, ఫలితంగా అర్బన్ ప్రాంతంలో 14శాతం నుండి 30శాతానికి రిజర్వేషన్లు పెరిగాయన్న చర్చ ఉంది. 42శాతం సాధ్యం కాకుంటే.. మధ్యప్రదేశ్ తరహా మోడల్ ను తాత్కాలిక ఉపశమనంగా అమలుచేయవచ్చని, పూర్తిస్థాయి రిజర్వేషన్ల కోసం కేంద్రంపై కొట్లాడాల్సిందేనని పలువురు ఉన్నతాధికారులు ప్రభుత్వానికి నివేదికలు అందించినట్లు తెలిసింది. ఏజెన్సీప్రాంతంలో ఎస్టీలు అధికంగా ఉన్న దగ్గర ఎస్టీలకు, ఎస్సీలు అధికంగా ఉన్న దగ్గర ఎస్సీలకు అధిక స్థానాలు కేటాయిస్తే.. యూనిట్ వారీగా రిజర్వేషన్లు తగ్గుతాయని, కొన్ని చోట్ల ఎస్టీ ఓటర్లు ఒక్కరు ఉన్నా ఆయా ప్రాంతాలు ఎస్టీలకు రిజర్వ్ అవుతుంటాయని, ఇలా కాకుండా యూనిట్ వారీగా కసరత్తు చేస్తే బీసీలు అధికంగా ఉన్న ప్రాంతాల్లో ఆయా వర్గాలకు ప్రాతినిధ్యం పెరిగేలా , తక్కువగా ఉన్నచోట ఇతర వర్గాలకు ప్రాధాన్యముండేలా మార్పులు చేసి.. సుప్రీంకోర్టును ఆశ్రయించవచ్చని నిపుణులు సూచిస్తున్నారు.

### మధ్యప్రదేశ్‌లో అమలు.. తెలంగాణలో పరిశీలన

**స్థానిక సంస్థల ఎన్నికల్లో జనాభా దామా షా ప్రకారం ఎస్సీ, ఎస్టీలకు రిజర్వేషన్లను రాజ్యాంగబద్ధంగా కల్పిస్తున్నారు. బీసీలకు మాత్రం నామమాత్రంగా ఆయా రాష్ట్ర ప్రభుత్వాలే రిజర్వేషన్లు కల్పిస్తూ వస్తున్నాయి. ప్రతిసారీ వాటిపై న్యాయ వివాదాలు తలెత్తడం సాధారణంగా మారింది. ఈ నేపథ్యంలోనే ఓబీసీలకు అమలు చేస్తున్న రిజర్వేషన్లపై కర్ణాటకకు చెందిన కే కృష్ణమూర్తి, మహారాష్ట్రకు చెందిన వికాస్‌రావు గవాళి కేసు లో సుప్రీంకోర్టు స్పష్టమైన ఆదేశాలను జారీ చేసింది.**

**ట్రిపుల్ టీ పేరిట మార్గదర్శకాలు ఇచ్చింది.**

1. **మొదటిది ప్రతి స్థానిక సంస్థల్లో ఓబీసీ రిజర్వేషన్ల అమలు, ఫలితాలపై అధ్యయనం చేసేందుకు పూర్తిస్థాయి రాజ్యాంగబద్ధమైన, డెడికేటెడ్ కమిషన్‌ను ఏర్పాటు చేయా లి.**
2. **జనాభా నిష్పత్తికి అనుగుణంగా రిజర్వేషన్లను స్థిరీకరించాలి.**
3. **రిజర్వేషన్లు కూడా ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ కలిపి మొత్తంగా 50 శాతం మేరకు మించకూడదు. వా టినే ట్రిపుల్ టీ అంటారు. ఆ మార్గదర్శకాలు పాటించని ఏ రాష్ట్రంలో కూడా స్థానిక సంస్థల ఎన్నికల్లో ఓబీసీ రిజర్వేషన్లు అమలు చేయకూడదని సుప్రీంకోర్టు స్పష్టంగా తేల్చిచెప్పింది. మధ్యప్రదేశ్ లో ఈ మధ్యేమార్గ మోడల్ అమలుచేయగా, 42 శాతం కు ఏవైనా అనుకోని అవాంతరాలొస్తే ఇది కూడా పరిశీలించాలని ఓ నివేదిక అందినట్లు తెలిసింది. అసలు ఈ రిజర్వేషన్ల చిక్కుముడులు ఎప్పుడు వీడుతాయి. ఎన్నికలు ఎపుడు జరుగుతాయి? అన్న ప్రశ్నలకు సమాధానం ఎపుడు దొరుకుతుందో చూడాలి.**

# నేటి నుంచే పార్లమెంట్ సెషన్స్

## 21 రోజుల పాటు జరగనున్న సమావేశాలు

పహల్గాం ఉగ్రదాడి, ఆపరేషన్ సిందూర్ తర్వాత మొదటిసారి
కేంద్రాన్ని నిలదీసేందుకు ఇండియా కూటమి నిర్ణయం.. వాడివేడిగా చర్చలు జరిగే చాన్స్
సమావేశాల్లో పలు బిల్లులను కూడా ప్రవేశ పెట్టాలని కేంద్రం సిద్ధం



**ఢిల్లీ, మహా:** నేటి నుంచి వర్షాకాల సమావేశాలు వాడివేడిగా ప్రారంభం కాబోతున్నాయి. జూలై 21 నుంచి ఆగస్టు 21 వరకు సమావేశాలు జరుగనున్నాయి. పహల్గాం ఉగ్రదాడి, ఆపరేషన్ సిందూర్ తర్వాత మొదటిసారిగా ఉభయ సభలు సమావేశమవుతున్నాయి. 21 రోజుల పాటు జరుగనున్న ఈ సమావేశాలు వాడీ వేడిగా కొనసాగే అవకాశాలు ఉన్నాయి. సోమవారం నుంచి ప్రారంభమయ్యే పార్లమెంట్ సమావేశాల్లో అనుసరించాల్సిన వ్యూహంపై చర్చించేందుకు ఇండి కూటమి నేతల కీలక సమావేశం జరిగింది. ఈ సమావేశానికి 10 పార్టీల నేతలు హాజరయ్యారు. ఆపరేషన్ సింధూర్‌పై కేంద్రాన్ని పార్లమెంట్ సమావేశాల్లో నిలదీయాలని ఇండి కూటమి నేతలు నిర్ణయించారు. ఆపరేషన్ సింధూర్‌పై కేంద్రం ఇప్పటికి కూడా వాస్తవాలు వెల్లడించడం లేదని కాంగ్రెస్ నేతలు ఆరోపిస్తున్నారు.

**వాడివేడిగా చర్చలు జరిగే..**

బిహార్‌లో ఓటర్ల జాబితా సవరణపై కూడా ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తామని విపక్ష నేతలు వెల్లడించారు. విదేశాంగ విధానంపై ప్రశ్నిస్తామని స్పష్టం చేశారు.మరోవైపు ఆపరేషన్ సింధూర్‌పై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ చేసిన వ్యాఖ్యలపై రాజకీయ రచ్చ రాజుకుంది. చాలా యుద్ధాలను తాను ఆపినట్టు ట్రంప్ ప్రకటించుకున్నారు. లేదంటే రెండు దేశాల మధ్య న్యూక్లియర్ వార్ జరిగేదన్నారు. అంతేకాకుండా యుద్ధంలో ఐదు ఫైటర్ జెట్స్‌ను కూల్చేశారని అన్నారు ట్రంప్. అమెరికా అధ్యక్షుడి వ్యాఖ్యలపై బీజేపీ ప్రభుత్వాన్ని కాంగ్రెస్ నేతలు నిలదీస్తున్నారు.

**సమావేశాల్లో పలు కొత్త బిల్లులు..**

పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో 8 బిల్లులను కేంద్రం ప్రవేశపెట్టబోతోంది. ఈ సందర్భంగా ఏడు పెండింగ్ బిల్లులతోపాటు 8 కొత్త బిల్లులను ప్రవేశపెట్టడానికి కేంద్ర ప్రభుత్వం సిద్ధమైంది. నేషనల్ స్పోర్ట్స్ గవర్నెన్స్ బిల్లు, జియోహెరిటేజ్ సైట్స్, జియో రెలిక్స్ (సంరక్షణ, నిర్వహణ) బిల్లు, మైన్స్ అండ్ మినరల్స్ (అభివృద్ధి, నియంత్రణ) సవరణ బిల్లు, నేషనల్ యాంటీ డోపింగ్ (సవరణ) బిల్లు, మణిపూర్ వస్తు సేవల పన్ను (సవరణ) బిల్లు వంటివి ఇందులో ఉన్నాయి. వీటితో పాటు ఇన్‌కం ట్యాక్స్2025 బిల్లును కూడా కేంద్రం ప్రవేశపెట్టే అవకాశాలు ఉన్నాయి. విపక్షం లేవనెత్తే ప్రతి ప్రశ్నకు సమాధానం ఇస్తామని కేంద్ర మంత్రులు స్పష్టం చేస్తున్నారు.

# హిందీ జాతీయ భాష కాదు

## జాతీయ భాష అవసరం లేదు

హిందీ భాషా రగడపై కేటీఆర్ ఆసక్తికర వ్యాఖ్యలు
హిందీని బలవంతంగా రుద్దుతామంటే కుదరదని స్పష్టీకరణ



**జైపూర్, మహా :** భారతదేశానికి జాతీయ భాష అవసరం లేదని, హిందీని తమపై రుద్ద కూడదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రసిడెంట్ కేటీఆర్ సంచలన వ్యాఖ్యలు చేశారు. దేశవ్యాప్తంగా హాట్‌టాపిక్‌గా మారిన హిందీ భాషా అంశంపై ఆయన మాట్లాడారు. జైపూర్‌లో జరిగిన టాక్ జర్నలిజం 2025లో భాగంగా జరిగిన చర్చలో భాష విషయంలో ఈ వ్యాఖ్యలు చేశారు. ఈ సమావేశంలో విద్యార్థులు అడిగిన ప్రశ్నలకు కేటీఆర్ సమాధానమిచ్చారు. ఈ సందర్భంగా ఓ విద్యార్థి జాతీయ భాష గురించి అడగగా హిందీ జాతీయ భాష కాదని, భారతదేశంలో అనేక అధికారిక భాషలు ఉన్నాయని కేటీఆర్ అన్నారు. "ఏ భాష అయినా భావవ్యక్తీకరణకు ఓ సాధనం మాత్రమే. అది ఒక సాంస్కృతిక చిహ్నం. భారత్ లో 20 అధికారిక భాషలు, 300 అనధికార భాషలు ఉన్నాయి. హిందీ మాట్లాడేవారు ఎక్కువ ఉన్నారని హిందీ భాషను మా మీద రుద్దుతామంటే కుదరదు. తెలుగు భాషను జాతీయ భాషగా చేయాలని ప్రతిపాదిస్తే మిగతా ప్రాంతాల వారు ఒప్పుకుంటారా? 7080 ఏళ్ళు దేశం బాగుంటే, మళ్లీ జాతీయ భాష ఎందుకు?" అని ప్రశ్నించారు. హిందీ భాషకు బడ్జెట్‌లో రూ. 50 కోట్లు కేటాయించి, తెలుగు, బెంగాలీ భాషలకు ఎందుకు నిధులు ఇవ్వలేదని కేటీఆర్ ప్రశ్నించారు. ఇతర రాష్ట్రాల ప్రజలపై తెలుగును రుద్దనప్పుడు హిందీని తమపై ఎందుకు రుద్దుతున్నారని ఆయన నిలదీశారు. దేశంలో అత్యధికంగా మాట్లాడే భాష హిందీ అయినప్పటికీ, హిందీ నేర్చుకోవాలా వద్దా అనేది ప్రజలకే వదిలేయాలని, దానిని వారిపై బలవంతంగా రుద్దకూడదని ఆయన అన్నారు.

# మరోసారి విదేశీ పర్యటనకు మోదీ

- **రేపటి నుంచి 26 వరకు బ్రిటన్, మాల్దీవుల్లో పర్యటన**
- **ద్వైపాక్షిక సంబంధాల బలోపేతమే లక్ష్యంగా**
- **జులై 23 నుంచి 24 వరకు బ్రిటన్.. 25, 26 తేదీల్లో మాల్దీవుల విజిట్**



**ఢిల్లీ, మహా:** భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జులై 23 నుంచి (రేపటి నుంచి) వరకు బ్రిటన్, మాల్దీవుల్లో నాలుగు రోజుల అధికారిక పర్యటనకు వెళ్లనున్నారు. ఈ పర్యటన ద్వైపాక్షిక సంబంధాలను బలోపేతం చేయడం, వాణిజ్యం, భద్రత మరియు ప్రాంతీయ సహకారాన్ని పెంపొందించడం లక్ష్యంగా కొనసాగనుంది. బ్రిటన్ ప్రధానమంత్రి కీర్ స్టార్మర్ ఆహ్వానం మేరకు మోదీ జులై 2324 తేదీల్లో యూకేను సందర్శిస్తారు. మోదీ యూకేలో పర్యటించడం ఇది నాలుగోసారి.

**భారత్-యూకే పురోగతిని..**

ఈ సందర్శనలో భారత్‌యూకే సమగ్ర వ్యూహాత్మక భాగస్వామ్యం (సీఎస్‌పీ) పురోగతిని సమీక్షించడంతో పాటు వాణిజ్యం, ఆర్థికం, సాంకేతికత, ఆవిష్కరణలు, రక్షణ, భద్రత, వాతావరణం, ఆరోగ్యం, విద్య మరియు ప్రజల మధ్య సంబంధాలపై చర్చలు జరుగనున్నాయి. జులై 25 26తేదీల్లో మాల్దీవుల అధ్యక్షుడు మొహమ్మద్ ముయిజ్జు ఆహ్వానం మేరకు మోదీ ఆ దేశాన్ని సందర్శిస్తారు. మోదీ మాల్దీవుల్లో పర్యటించడం ఇది మూడోసారి. అంతేకాదు, ముయిజ్జు అధ్యక్షుడిగా ఉన్న సమయంలో ఏ దేశాధినేత లేదా ఏ దేశ ప్రధాని మాల్దీవుల్లో పర్యటించడం ఇదే మొదటిసారి. ఈ పర్యటనలో మోదీ, మాల్దీవుల 60వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో 'గౌరవ అతిథి'గా పాల్గొననున్నారు. 2024 అక్టోబరులో ముయిజ్జు భారత్ పర్యటనలో ఆమోదించిన 'భారత్‌మాల్దీవ్స్ సమగ్ర ఆర్థిక మరియు సముద్ర భద్రతా భాగస్వామ్యం' అమలు పురోగతిని ఇరు నాయకులు సమీక్షించనున్నారు.

# లాల్ దర్వాజ సంబురం.. బోనమెత్తిన భాగ్యనగరం

## సల్లంగసూడమ్మా అంటూ తరలిన భక్తజనం.. మంత్రులు, సెలబ్రిటీల బోనాలు

**(మొదటిపేజీ తరువాయి)**

తెల్లవారుజామున కుమ్మరిబోనం సమర్పించడంతో ప్రారంభమైన బోనాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. భక్తుల బోనాలు, శివసత్తుల ఆటలు, పోతరాజుల విన్యాసాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

**ప్రభుత్వం తరపున అమ్మవారికి పట్టువస్త్రాలు**

ప్రభుత్వం తరపున ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి పొన్నం ప్రభాకర్, వాకిటి శ్రీహరి ముదిరాజ్ అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించారు. పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, ఎమ్మెల్సీ విజయశాంతి సహా కాంగ్రెస్ పార్టీ పలువురు ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు సహా పలువురు నేతలు అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ అభివృద్ధికి కావాల్సిన నిధులు అందిస్తామని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క భరోసా ఇచ్చారు. రాష్ట్రాన్ని అగ్రపథాన నిలపాలని అమ్మవారిని కోరుకున్నట్లు తెలిపారు. కళాకారులు ఉదయభాను, మధుప్రియతో పాటు ఎంతో మంది పండుగ సంబరాల్లో ఆకర్షణగా నిలిచారు.



**లాల్ దర్వాజలో కవిత.. వనస్థలిపురంలో సీతక్క**

లాల్ దర్వాజలో ఎమ్మెల్సీ కవిత బోనమెత్తి ప్రత్యేక పూజలు నిర్వహించగా, వనస్థలిపురంలో మంత్రి సీతక్క బోనమెత్తారు. అమ్మవారికి పూజలు చేశారు.

**దత్తన్న బోనం**

నాలుగో ఆదివారమైన ఈ వేడుకల్లో అమ్మవారికి హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ బంగారు బోనం సమర్పించారు. కేంద్రమంత్రి బండిసంజయ్, బీజేపీ ఎంపీ లక్ష్మణ్, మాధవీ లత మహంకాళిని దర్శించుకున్నారు. టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు, హైదరాబాద్ కలెక్టర్ హరిచందన అమ్మవారికి బోనం సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. రాష్ట్ర ప్రజలంతా సుఖశాంతులతో తులతూగాలని, ఆయురారోగ్యాలు చేకూర్చాలని వేడుకున్నామన్నారు. అమ్మవారి దర్శనం కోసం భక్తులకు 3 ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేశారు. 12 వందల మంది పోలీసులతో పటిష్ఠ భద్రతా ఏర్పాట్లు చేశారు. 300 సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి జాయింట్ కమాండ్ కంట్రోల్ రూం ద్వారా ప్రత్యేకంగా పర్యవేక్షిస్తున్నారు. ఆషాడ బోనాల పండగ వేళ జంటనగరాల్లో పండగవాతావరణం నెలకొంది. హైదరాబాద్ చార్మినార్ భాగ్యలక్ష్మీ అమ్మవారికి మంత్రి కోమటిరెడ్డితో కలిసి పొన్నం ప్రభాకర్ పట్టువస్త్రాలు సమర్పించారు. బోరబండలో పోచమ్మ ఆలయాన్ని మంత్రి తుమ్మల దర్శించుకున్నారు. అంబర్‌పేట, నారాయణగూడ విఠల్‌వాడీ ఆలయాల్లో కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి పూజలు చేశారు. అంబర్‌పేట మహంకాళి అమ్మవారికి ప్రభుత్వం తరపున నగర మేయర్ గద్వాల విజయలక్ష్మీ, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్ బోనం సమర్పించారు.కార్వాన్ దర్బార్ మైసమ్మకు బోనమెత్తి బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత ప్రత్యేక పూజలు చేశారు. ప్రజలంతా సుభిక్షంగా ఉండాలని కాంక్షించారు.

# బీజేపీ హైకమాండ్ ఆదేశిస్తే.. ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తా



**హైదరాబాద్, మహా :** తాను ఏ పార్టీలో చేరే అంశంపై ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ అన్నారు. తన ఎమ్మెల్యే పదవిపైన బీజేపీ నాయకత్వానిదే తుది నిర్ణయమని తేల్చి చెప్పారు. ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయమని బీజేపీ సూచిస్తే.. తాను సిద్దంగా ఉన్నానని స్పష్టం చేసారు. తాను చివరి శ్వాస వరకు హిందూత్వం కోసం పోరాటం చేస్తానని తేల్చి చెప్పారు. బీజేపీ అధినాయకత్వంపైన తనకు ఎలాంటి వ్యతిరేక భావం లేదని స్పష్టం చేశారు. సింహవాహిని మహంకాళి అమ్మవారి బోనాల ఉత్సవాల్లో రాజాసింగ్ అమ్మవారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలుగు వారందరికీ బోనాల శుభాకాంక్షలు తెలిపారు. వేలాదిమంది సింహవాహిని అమ్మవారి దర్శనం కోసం వస్తున్నారని చెప్పుకొచ్చారు. యావత్ భారతదేశంలో ఉండే హిందువులందరిపై సింహవాహిని అమ్మవారి ఆశీస్సులు ఉండాలని కోరుకున్నానని అన్నారు. దర్శనం అనంతరం ఓ మంత్రి తనతో మాట్లాడారని తెలిపారు. ఏ పార్టీలో ఉన్నా అందరి లక్ష్యం ఒకటేనని, మోడల్ గోశాల కట్టడానికి తన సహకారం కావాలని ఆ మంత్రి తనను కోరారని చెప్పుకొచ్చారు. సింహవాహిని మహంకాళి అమ్మవారి ఆలయాన్ని వైభవం గా కడతామని గత ప్రభుత్వాలు గుడిపై రాజకీయం చేశారని రాజాసింగ్ విమర్శించారు.

# పల్లా మనసంతా జనగామే

## గాయమున్నా.. ప్రజాసమస్యల పరిష్కారంపైనే తపన

### నీటి సమస్య, స్థానిక సమస్యలపై అధికారులకు ఫోన్లు

### కదలలేకున్నా.. ప్రజలకు అండగా నిలుస్తూ కదిలిస్తున్న నేత

### పల్లా రాజేశ్వరరెడ్డి స్ఫూర్తిదాయక పనితీరుపై ప్రజల్లో హర్షం



(మొదటిపేజీ తరువాయి)

జనగామ ప్రజల చుట్టూ, జనగామ సమస్యల పరిష్కారం చుట్టూ తిరుగుతోంది. గత నెలరోజులుగా పల్లా కాలు కదప లేని అనివార్య పరిస్థితిలో ఉన్నా.. ప్రతిరోజూ ఫోన్ ద్వారా తన దృష్టికి వచ్చిన సమస్యలు, తనను కలిసి నాయకులు దృష్టికి తెచ్చిన సమస్యలపై వెంటనే స్పందిస్తున్నారు. ఇపుడు వద్దు.. మీరు సల్లగుండాలి. ఆరోగ్యం బాగయినాక మా గురించి పట్టించుకుందురు గానీ అని ప్రజలు చెబుతున్నా, పల్లా మాత్రం నేను రెండురోజులు ఆలస్యమైనా కోలుకుంటా గానీ నేను చేసే సాయం.. మీకు ఎంత పెద్ద ఊరటనిస్తుందో తెలుసు అంటూ ఎవరు వారించినా తన పెద్దమనసు చాటుకుంటూనే ఉన్నారు.

**ప్రజల కోసమే తపన**

ఓవైపు కాలిగాయం బాధపెడుతున్నా ఆ బాధను ఏమాత్రం లెక్కచేయకుండా ప్రజాసేవే ముఖ్యమని చాటిచెబుతున్నారు ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి. ఇంటికే పరిమితమై విశ్రాంతి తీసుకుంటున్నా.. ఆయన ఆలోచనంతా జనగామ నియోజకవర్గం గురించే. అనుక్షణం నియోజకవర్గ ప్రగతి గురించే మదనపడుతున్నారు. వర్షాకాలం నేపథ్యంలో తన నియోజకవర్గ రైతులు ఏమాత్రం ఇబ్బందిపడకుండా అధికార యంత్రాగాన్ని అప్రమత్తం చేస్తున్నారు. అన్ని రిజర్వాయర్లను నింపి రైతులను ఆదుకోవాలని సూచించారు. రెస్ట్ లో ఉన్నా ప్రజా శ్రేయస్సు కోసం పాటుడుతున్న పల్లాపై ప్రశంసల వర్షం కురుస్తోంది. రాజకీయాల్లో నిరంతరం పనిచేసే నేతలు అరుదు కాగా, ఆరోగ్యాన్ని సైతం పణంగా పెట్టి ప్రజల కోసం పనిచేసే పల్లా లాంటి నేతలు ఇంకా తక్కువ. ప్రతిపక్షంలో ఉన్నప్పటికీ ప్రజాసంక్షేమమే పరమావధిగా పనిచేయడంలో ఆయన ముందువరుసలో నిలుస్తున్నారు. ప్రతిపక్ష పార్టీ అని కోపంతో ఊగిపోయే నేతలు కూడా పల్లా విషయానికి వచ్చేసరికి మాత్రం అంశాలపైనే మాట్లాడుతారు. తనపై కొండంత నమ్మకంతో ఓటేసి గెలిపించిన జనం కోసమే ఆయన తపన. అందుకే పల్లాను ప్రజా నాయకుడిగా చెబుతారు. రెండుసార్లు ఎమ్మెల్సీగా పనిచేసినా.. ప్రస్తుతం ఎమ్మెల్యేగా ఉన్నా ప్రజాసేవలో ఆయన చిత్తశుద్ధి వేరే లెవెల్.

**అన్నదాతకు అండగా..**

వర్షాకాలం వచ్చేసినప్పటికీ జనగామ నియోజకవర్గంలో ఈసారి వర్షాలు సరిగా లేవు. దీంతో నియోజకవర్గ రైతులు సాగునీటి కోసం నానా అవస్థలు పడుతున్నారు. ఈ నేపథ్యంలో అన్నదాతల గోస పడకుండా ఆయన అలర్ట్ అయ్యారు. తాజాగా నీటిపారుదల శాఖ అధికారులతో ఆయన మాట్లాడారు. జనగామ నియోజకవర్గ పరిధిలోని అన్ని రిజర్వాయర్లను వెంటనే నింపి పంటలను కాపాడాలని నీటి పారుదల శాఖలోని ఉన్నత స్థాయి అధికారులకు సూచించారు. సాగునీటి విడుదల విషయంలో అజాగ్రత్త తగదన్నారు. ఏదేమైనా రైతుల శ్రేయస్సే తనకు ముఖ్యమని స్పష్టం చేశారు. నియోజకవర్గంలో వ్యవసాయ పరిస్థితులను, రైతుల అవసరాలను ఆందోళనను ప్రతిరోజూ పల్లా తెలుసుకుంటారు. రైతుబంధు సమితి అధ్యక్షుడిగా పనిచేసిన పల్లా.. కేసీఆర్ స్ఫూర్తితో ప్రజల కోసం మరింతగా పనిచేస్తానని చెబుతారు. నీటి,విద్యుత్ సమస్యపై సంబంధింత మంత్రికి అధికారులతో మాట్లాడి లేఖ రాస్తానని, గత సంవత్సరం బకాయిల కారణంగా పంటలు ఎండిపోయాయని చెప్పిన పల్లా నీళ్ళు తెప్పించి రైతుల మోముల్లో సంతోషం నింపారు.

**ప్రజలకు దగ్గర**

పల్లా రాజేశ్వర్ రెడ్డి ప్లేసులో ఎవరైనా ప్రతిపక్ష ఎమ్మెల్యే ఉంటే.. దొరికిందే ఛాన్స్ అంటూ రెస్ట్ లో ఉండేవారని.. నియోజకవర్గానికి మొహం చాటేసేవారని, కానీ తమ నాయకుడు పల్లా అలా కాదని నియోజకవర్గ ప్రజలు గర్వంగా చెబుతారు. రాజకీయాల్లో ఉంటే పల్లా రాజేశ్వర్ రెడ్డిలా కష్టపడాలి. ఆయనలా పేరు తెచ్చుకోవాలి అనుకునే రాజకీయ నేతలు ఎంతమందో. అందుకే పల్లా రాజేశ్వర్ రెడ్డి లాంటిని పార్టీలకతీతంగా నేతలంతా అభిమానిస్తారు. ఆయన కాలికి గాయమైందని తెలియగానే అధికార పార్టీ నాయకులు సైతం ఆయనను బాగోగులను అడిగి తెలుసుకున్నారు. ఒక్క అధికార పార్టీనే కాదు ప్రతిపార్టీలోనూ ఆయన మంచిని కోరుకునే నాయకులున్నారు. అది పల్లా రాజేశ్వర్ రెడ్డి ఘనత. ఆయన త్వరగా కోలుకుని ప్రజల్లోకి రావాలని జనగామ కోరుకుంటోంది.

# బండి ట్రాప్‌లో ఈటల

(మొదటిపేజీ తరువాయి)

ఆ తర్వాత దాని తాలూకు ప్రకంపనలు.. ప్రతీ సందర్భంలోనూ చర్చకు వస్తున్నాయి. ఆ ఫలితాల ప్రభావం ఇప్పటికీ సంచలనాలకు కారణమవుతున్నాయి. తెలంగాణ బీజేపీలో కొనసాగుతున్న ఆధిపత్య పోరు పరాకాష్టకు చేరింది. ఈటల రాజేందర్, బండి సంజయ్ మధ్య నెలకొన్న ఈ అంతర్గత విభేదాలు పార్టీ భవిష్యత్తుపై తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. అప్పట్లో టీఆర్ఎస్ నాయకత్వంపై తిరుగుబాటు చేసి పార్టీ నుంచి వైదొలగి బీజేపీలో చేరిన ఈటల హుజూరాబాద్ ఉపఎన్నికలో బీజేపీ తరపున గెలిచి, కేసీఆర్ వ్యతిరేక ఓటును ఏకం చేయడంలో కీలక పాత్ర పోషించారు. ఈ విజయంతో ఆయనకు రాష్ట్ర అధ్యక్ష పదవి లభిస్తుందని చాలామంది ఆశించారు. స్వయంగా ఈటల కూడా ఈ పదవిని ఆశించారు. ఆయన రాజకీయ ప్రొఫైల్ ఏడుసార్లు ఎమ్మెల్యే, రెండుసార్లు ఎంపీ, రెండుసార్లు మంత్రి, ఆర్థిక మంత్రిగా అనుభవం, తెలంగాణ ఉద్యమ నేపథ్యం ఉంది. పార్టీ నూతన అధ్యక్షుడిగా నియమితులైన రామచంద్రరావు కంటే రాజకీయాలలో కానీ, సామాజిక అంశాలలో కానీ రాష్ట్ర పరిస్థితులపై అవగాహన కానీ చాలా ఎక్కువ. బీజేపీ అధిష్టానం కూడా మొదట ఈటల పేరును పరిశీలించింది. కానీ అనూహ్యంగా రామచంద్రరావును రాష్ట్ర అధ్యక్షుడిగా నియమించడం ఈటల వర్గాన్ని తీవ్ర నిరాశకు గురిచేసింది.

### బండి సంజయ్ వ్యూహాలు

బండి సంజయ్ రాష్ట్ర అధ్యక్షుడిగా ఉన్నప్పుడు, ఆయన ప్రజా సంగ్రామ యాత్ర పార్టీకి మంచి ఊపునిచ్చింది. హిందుత్వవాదులు, బీజేపీ ఆరెస్సెస్ కార్యకర్తలు, సానుభూతిపరులు, బీజేపీ ఓటర్లలో ఆయనకు బలమైన పట్టు ఉంది. కేసీఆర్ వ్యతిరేక పోరాటంలో ఆయన ముందున్నారు. అయితే, ఈటల రాజేందర్ ప్రచారం, బీజేపీ అధిష్టానం వ్యూహంలో భాగంగా బండి సంజయ్ రాష్ట్ర అధ్యక్ష పదవిని కోల్పోయారు.ఒక్క మాటలో చెప్పాలంటే సంజయ్ పదవి కోల్పోవడానికి ఈటల అధిష్టానం చెవిలో గూడుకట్టుకుని పోరు సలవడం వల్లే. ఈ మార్పు కాంగ్రెస్ పార్టీకి లాభించిందని, బీజేపీకి నష్టం భారీ నష్టం చేకూర్చింది. "కట్టప్ప బాహుబలిని ఎందుకు చంపాడు" అనే ప్రశ్న కంటే "బండి సంజయ్ ని అధ్యక్ష పీఠం నుంచి ఎందుకు తప్పించారు" అనే ప్రశ్న తెలంగాణ రాజకీయాల్లో హాట్ టాపిక్ అయింది.

### ప్రస్తుత ఘర్షణ

రామచంద్రరావుకు రాష్ట్ర అధ్యక్ష పదవి లభించడంలో బండి సంజయ్ చక్రం తిప్పారు. తనను అధ్యక్ష పదవి నుంచి తప్పించేందుకు ఈటల చేసిన పోరాటాన్ని గుర్తు పెట్టుకున్న బండి సంజయ్ ఎట్టి పరిస్థితులలో ఆయనకు పార్టీ అధ్యక్ష పదవి దక్కకూడదన్న లక్ష్యంతో పని చేసి పాసయ్యారు. దీంతో ఈటలకు అధ్యక్ష పదవి దక్కకుండా పోయింది. ఇది ఈటలకు పదవి గండంగా మారింది. దీంతో కరీంనగర్ జిల్లాలోని అగ్రనేతలిద్దరి మధ్య విబేధాలు తీవ్ర స్థాయికి చేరాయి. ఈ నేపథ్యంలోనే హుజురాబాద్ నియోజకవర్గ రాజకీయాలు తీవ్ర స్థాయిలో వేడెక్కాయి. తమను కొంత మంది బీజేపీ నేతలు వేధిస్తున్నారని, పార్టీలో తగిన గుర్తింపు లేకుండా పోతుందంటూ కొంత మంది కార్యకర్తలు షామీర్ పేటలోని ఈటల నివాసానికి వచ్చారు. ఈ సందర్భంగా ఈటల చేసిన ప్రసంగం బండి సంజయ్‌ను లక్ష్యంగా చేసుకుని చేసినవే అని స్పష్టమవుతుంది. "వాడు ఎవడు వాడు సైకోనా సాడిస్టా, వాడు మనిషా పశువా" వంటి వ్యాఖ్యలు ఈటల ఆగ్రహాన్ని తెలియజేస్తున్నాయి. ఈటల వర్గానికి చెందిన హుజూరాబాద్ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ గౌతం రెడ్డి రాజీనామా లేఖలో "ఈటల వర్గాన్ని అణచివేస్తున్నారు, అవమానిస్తున్నారు" అని పేర్కొనడం బీజేపీలో అంతర్గత పోరును బహిర్గతం చేసింది. దీనికి భిన్నంగా, బీజేపీలో గ్రూపులు ఉండవని, మోదీ గ్రూప్ మాత్రమే ఉంటుందని బండి సంజయ్ తన వీడియోలో స్పష్టం చేశారు. ఈటల వర్గం తన వ్యక్తిగత ఆధిపత్యాన్ని నిరూపించుకోవడానికి ప్రయత్నిస్తోందని, పార్టీ క్రమశిక్షణను ఉల్లంఘిస్తోందని బండి సంజయ్ పరోక్షంగా విమర్శించారు. బండి సంజయ్ కరీంనగర్‌లో సైకిళ్ల పంపిణీ కార్యక్రమానికి పోటీగా ఈటల షామీర్‌పేటలో తన మద్దతుదారులతో సమావేశం నిర్వహించడం, ఈటల మద్దతుదారులు "మాకు మోడీ కాదు, ఈటలే ముఖ్యం" అని బహిరంగంగా నినాదాలు చేయడం పరిస్థితి తీవ్రతను సూచిస్తుంది.

### బీజేపీలో ఓపిక, లాయల్టీ

బీజేపీలో ఓపికగా, పార్టీ పట్ల లాయల్‌గా ఉన్న నాయకులకు పదవులు లభిస్తాయని అనేక ఉదాహరణలున్నాయి.

**ఇంద్రసేనా రెడ్డి:** చాలా కాలం ఏ పదవి లేకపోయినా ఓపికతో పార్టీకి కట్టుబడి పని చేశారు. దీంతో ఆయన త్రిపుర గవర్నర్‌గా అయ్యారు.

**బండారు దత్తాత్రేయ:** కేంద్ర మంత్రివర్గం నుంచి తొలగించినా పార్టీకి విధేయుడిగా పని చేశారు. ఫలితంగా , హర్యానా గవర్నర్‌గా పని చేసే అవకాశం లభించింది.

**డాక్టర్ లక్ష్మణ్:** రాష్ట్ర అధ్యక్ష పదవి అయిపోయాక పార్టీకి లాయల్‌గా పనిచేసి ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు, సెంట్రల్ పార్లమెంటరీ బోర్డు సభ్యుడు ఏకంగా మూడు పదవులను పొందారు. మల్కాజ్‌గిరి సీటును ఈటలకు త్యాగం చేసి, ఏ అభ్యంతరం చెప్పకుండా పార్టీ కోసం పని చేసిన రామచంద్ర రావు రాష్ట్ర అధ్యక్షుడు అయ్యారు. ఉన్న ఫలంగా రాష్ట్ర అధ్యక్ష పదవి నుంచి తప్పించినా పార్టీ లైన్ లోనే పని చేయడం వల్లే బండి సంజయ్ జాతీయ ప్రధాన కార్యదర్శి అయ్యారు. తర్వాత ఎన్నికల్లో గెలవడంతో కేంద్ర మంత్రి పదవి కూడా వరించింది. ఈ ఉదాహరణలను పరిశీలిస్తే బీజేపీ అంతర్గత క్రమశిక్షణను, అధిష్టానం నిర్ణయాలను గౌరవించే వారికి ప్రాధాన్యత ఇస్తుందని తెలుస్తుంది. ఈటల రాజేందర్ ఓపిక ప్రదర్శించలేక, బహిరంగ తిరుగుబాటుకు దిగడం పార్టీకి ఆమోదయోగ్యం కాదన్న చర్చ కూడా రాజకీయ విశ్లేషకులలో మొదలైంది.

### భవిష్యత్ పరిణామాలు

ఈటల రాజేందర్ బహిరంగ తిరుగుబాటు బీజేపీకి తలవంచే అవకాశం లేదు. అలా చేస్తే పార్టీ క్రమశిక్షణ దెబ్బతింటుంది. ఈటల తన ప్రచారం ద్వారా బండి సంజయ్‌ను రాష్ట్ర అధ్యక్ష పదవి నుంచి తొలగించగలిగినా, తాను అధ్యక్షుడు కాలేకపోయారు. ఈ పరిణామాలు ఈటల రాజేందర్ బీజేపీ నుంచి నిష్క్రమణకు దారితీసే అవకాశం ఉందని, ఇది బండి సంజయ్‌కు పూర్తి విజయంగా మారవచ్చు. ఒక విధంగా చెప్పాలంటే బండి సంజయ్ రాజకీయ వ్యూహంలో ఈటల బలవుతారా అన్న అనుమానాలు కూడా వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికే బీఆర్ఎస్ నాయకత్వంపై తిరుగుబాటు చేసి బీజేపీలో చేరి క్రియాశీల నేతగా స్థానం సంపాదించుకున్న ఈటల మరోసారి బీజేపీ నాయకత్వంపై తిరుగుబాటు చేస్తే రాజకీయాలలో ఆయన గురించి మరోరకమైన చర్చ జరిగే అవకాశాలున్నాయి.

### రాజాసింగ్ పరిణామాలను గుర్తిస్తే బాగుండేది

తాజాగా గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్విషయంలో అధిష్టానం అనుసరించిన విధానాన్ని ఈటల రాజేందర్ పరిశీలించి కాస్త సంయమనం పాటించి పార్టీ అంతర్గత సమావేశాలలో కరీంనగర్ జిల్లాలో జరుగుతున్న రాజకీయ పరిణామాలు, కార్యకర్తల అభిప్రాయాలపై చర్చకు తీసుకు వస్తే పరిణామాలు మరో రకంగా ఉండేవన్న అభిప్రాయాన్ని కూడా రాజకీయ విశ్లేషకులు వ్యక్తం చేస్తున్నారు. సీనియర్ నేతగా, కాషాయ పార్టీకి లాయలిస్టుగా ఈటల ఉండి ఉంటే కేంద్ర మంత్రి పదవి వరించి ఉండేదన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.



# ఆదిలాబాద్ అభివృద్ధికి బీఆర్ఎస్, బీజేపీ చేసింది గుండు సున్నా

(మొదటిపేజీ తరువాయి)

గ్రామస్తులు కాంగ్రెస్ పార్టీ శ్రేణులు వారికి డప్పుచప్పుళ్లతో ఘన స్వాగతం పలికారు. ముందుగా గ్రామంలోని కొమురం భీం విగ్రహానికి పూల మాలలు వేసి నివాళ్లు అర్పించారు.అనంతరం పార్టీలో చేరేందుకు వచ్చిన దాదాపు వంద మందికి కండువాలు కప్పి సాదరంగా కాంగ్రెస్ పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం కంది శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ ప్రస్తుత ఎమ్మెల్యే పాయల్ శంకర్ మాజీ మంత్రి జోగు రామన్న పై తీవ్ర విమర్శలు గుప్పించారు. గత ఎన్నికల్లో ఓటమితో రాజకీయంగా మాజీ మంత్రి జోగు రామన్న పని అయిపోయిందని చెప్పారు. పదిహేనేళ్లు ఎమ్మెల్యేగా ఉన్న రామన్న ఒక్క ఇల్లన్నా ఇచ్చిండా అని ప్రశ్నించారు. పాయల్ శంకర్ సెటిల్ మెంట్లు, భూ కబ్జాలు చేస్తారనే పేరు ఉందని ఆరోపించారు. ఇప్పటివరకు కొన్ని కోట్ల విలువ గల భూములు కబ్జా చేసిరట్టు ఆరోపణలున్నాయన్నారు. జోగు రామన్న, పాయల్ శంకర్ లు వారి కుటుంబం గురించి ఆలోచిస్తారు తప్పితే ప్రజలకు చేసిందేమీలేదని తెలిపారు. అభివృద్ధి అంటే కాంగ్రెస్ ప్రభుత్వం చేసి చూపిస్తోందని తెలిపారు. మొదటి విడతలో నియోజకవర్గానికి 3500 ఇందిరమ్మ ఇండ్లు ఇచ్చిందని అన్నారు. ఇందిరమ్మ ఇండ్లు రాని వారు బాధపడకూడదని రెండో జాబితాలో అర్హులైన అందరికి వస్తాయని భరోసా ఇచ్చారు. రాష్ట్ర వ్యాప్తంగా కొత్త రేషన్ కార్డులు అందించే ప్రక్రియకు శ్రీకారం చుట్టిందని పేర్కొన్నారు. రేవంత్ రెడ్డి కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో సన్న బియ్యం, యువతకు ఉద్యోగాలు, రుణమాఫీ, తొమ్మిది రోజుల్లో రూ.9వేల కోట్ల రైతు భరోసా నిధులను రైతుల ఖాతాల్లో జమ చేసిందని గుర్తు చేశారు. మహిళలకు ఉచిత బస్సు సౌకర్యంతో పాటు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్తు సౌకర్యం కల్పిస్తోందని తెలిపారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అమలుకు ప్రత్యేక ఆర్డినెన్స్ తెచ్చి గవర్నర్ ఆమోదం కోసం పంపించిందని తెలిపారు. అన్ని వర్గాల సంక్షేమం కోసం ఆలోచించేది కేవలం కాంగ్రెస్ ప్రభుత్వమేనని తెలిపారు. కాంగ్రెస్ ఇందిరమ్మ ఇండ్లు ఇచ్చిందని మీరేమి ఇచ్చారని ప్రశ్నిస్తున్నారని చెప్పారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపు కోసం అందరం కలిసికట్టుగా కృషి చేయాలని పిలుపునిచ్చారు.



# యుద్ధాలిక మనకొద్దు

కసిలేని యుద్ధం
కసిని పెంచుతున్న యుద్ధం
పసలేని యుద్ధం
ప్రపంచాన్ని
రెచ్చగొడుతున్న యుద్ధం
రంగులేని యుద్ధం
రంగులరాట్నంలో
గిరగిరా తిరుగుతున్న యుద్ధం
రాకాసి యుద్ధం
ఆకాశంలో అవకాశాల యుద్ధం
రంకు బొంకుల యుద్ధం
రాజ్యాలను
రాసి రంపాన పెడుతున్న యుద్ధం
ట్రంపు కంపు యుద్ధం
ట్రంకు పెట్టెలో
కట్టి పెట్టాల్సిన యుద్ధం
ఆధిపత్య యుద్ధం
పైశాచికత్వానికి పరాకాష్ట యుద్ధం

అహంకారాల మెడలో వేలాడుతున్న
దురహంకారుల దుర్మార్గుల యుద్ధాలు
పుండుపై కారం చల్లుతున్న యుద్ధాలు
పుండును కాకులు పొడుస్తున్న యుద్ధాలు
కోడి పిల్లలను గద్దలు తన్నుకెళ్తున్న యుద్ధాలు
అనాధ పసికందులను
కుక్కలు పీక్కు తింటున్న యుద్ధాలు
నాశనం వినాశనం సర్వనాశనం
అహంకారం ఆధిపత్యం ప్రపంచాదిపత్యం
ఏం కావాలి మీకు?
మీరేం కోరుకుంటున్నారు?
రెండు ప్రపంచ యుద్ధాలలో
ఏకాకులుగా మిగిలిన
వికారమైన ఆకారాలు మనవి
వికారమైన యుద్ధాలిక మనకొద్దని

- కట్టెకోల చిన నరసయ్య,
ఫ్రీలాన్స్ జర్నలిస్ట్, 9951260316

# ఎచటికీ పయనం

గాజాలో ఉన్నానా ?
కాదు, నగరంలో !
ఏమిటీ బాంబుల మోత?
దీపావళి వేడుకలు !
చీకటికండ్ల గుడిసెలు అంటుకోవా ?
ఉచితాల తంతు జలాలు జల్లరూ !

మరి ఆ కాంతు లెచటివి ?
సరయు తటమున కోటి దీపోత్సవం !
చెంచడు వంట నూనె కరువైన చోట
దీపాలు ఏమిటి ?
నిజ లేమి నిశిని
దీప దారిన దారి మళ్ళించ !

ఎచటికీ పయనం
విధ్వంస అభివృద్ధుల్లోకి
వినిమయ మత్తుల్లోకి
శుష్క శతాబ్దుల్లోకి
శూన్య శకాల్లోకి
శోక లోకాల్లోకి
ఎచటికీ పయనం

రాసింది చాలదని
పచ్చదనాల వెలుగులీను
తూర్పు వాకిలి తలుపు తెరువ

- పిన్నంశెట్టి కిషన్
9700230310

## పుష్కర సంచిక ఆవిష్కరణ

తెలంగాణ ఏర్పడి పుష్కర కాలమవుతున్న సందర్భంగా పాలపిట్ట తెలంగాణ ప్రత్యేక సంచిక వెలువడుతుంది. ఈ సంచిక ఆవిష్కరణ సభ 26 జూలై 2025 శనివారం సాయంత్రం ఆరు గంటలకు రవీంద్ర భారతి సమావేశ మందిరంలో జరుగుతుంది. సభకు డాక్టర్ రూప్ కుమార్ డబ్బీకార్ అధ్యక్షత వహిస్తారు. డాక్టర్ ఏనుగు నరసింహారెడ్డి ఆవిష్కరిస్తారు. సభలో ఒద్దిరాజు ప్రవీణ్ కుమార్, నామోజు బాలాచారి, మామిడి హరికృష్ణ, పొట్లపల్లి శ్రీనివాసరావు, ఎం. నారాయణశర్మ, గుడిపాటి ప్రసంగిస్తారు. - పాలపిట్ట బుక్స్

## రచనలకు ఆహ్వానం

సాహిత్య పేజీ కోసం కవులు, రచయితల నుండి
కథలు, కవిత్వం, సాహిత్య వ్యాసాలు,
పుస్తక సమీక్షలు మొదలైనవి..
మీ రచనలు పంపాల్సిన చిరునామా:
mahaapatrika@gmail.com
whatsapp 9247580946

## పుస్తక సమీక్షల కోసం...

తమ కొత్త పుస్తకాలను రెండు ప్రతులను ఈ దిగువ చిరునామాకు పంపించగలరు.
43/A, MLA Colony, Road No. 12,
Banjara Hills, Hyderabad. Telangana- 500034.

# సామాజిక రుగ్మతలపై రేడియమ్ చెణుకులు

తెలుగు కవితాలోకంలో ఇప్పుడు ఒకవైపు దీర్ఘకవిత, మరోవైపు హ్రస్వ కవితాప్రక్రియలు సమాంతరంగా సాగుతున్నాయి. వస్తువిస్తృతి దృష్ట్యా, సుదీర్ఘ కవితాభివ్యక్తీకరణ సౌలభ్యం కోసం కొందరు కవులు దీర్ఘకవితను చేపడితే, అనల్పమైన విషయాన్ని భూతద్దంలో చూపినట్టు నిగూఢార్థాలతో అల్పమైన అక్షరీకరణతో చెప్పేందుకు వీలుగా మరికొందరు కవులు హ్రస్వకవితాప్రక్రియను చేపడుతున్నారు. అయితే కవి దీర్ఘకవిత్వంలో చేయనవసరంలేని కసరత్తుల్ని హ్రస్యకవితాప్రక్రియలో చేయవలసివుంది. అప్పుడే ఆ ప్రక్రియ రక్తికడుతుంది. తెలుగులో మూడు దశాబ్దాల క్రితం మినీకవితతో ప్రారంభమైన హ్రస్వకవిత ఆ తరువాత జపాన్ నుంచి దిగుమతి అయిన నిగూడార్థాలతో కూడిన హైకూలు, ఆ తరువాత నానీలు, రెక్కలు, చుక్కలు, కిరణాలు, మొగ్గలు, సప్తపదులు, కైతికాలు... ఇలా పలురూపాల్లో చోటుచేసుకుంది. అనుదినం తన చుట్టూ జరిగే సమకాలీన సంఘటనలకూ, సందర్భాలకూ స్పందిస్తూ గత కొన్నేళ్లుగా హ్రస్వకవితల్ని వెలువరిస్తున్నారు వర్తమాన కవి రేడియమ్(జె. కొండన్న). ఎన్నెన్నో సామాజిక రుగ్మతలు తనలో కలిగించే సంఘర్షణలోంచి పెల్లుబికే భావాలతో 2019 నుంచి ఈ కవి నేటినిజం(దినపత్రిక)లో ధారావాహికంగా వెలువరించిన, ఇంకా వెలువరిస్తున్న హ్రస్వకవితలతో కూడిన తాజా కవితాసంపుటి 'నమ్మలేని నిజాలు'.

చిన్నతనం నుంచి సమరశీలభావాలను పుణికిపుట్టుకున్న ఈ కవి సమసమాజ నిర్మాణానికి సంకల్పిస్తూ కవిత్వరచన చేపట్టారు. విస్తృత జీవితానుభవం, పఠనానుభవం ఆయన చేత సమాజంలోని ఎన్నో పార్శ్వాలను దర్శింపజేసింది. ఆ పార్శ్వాలలోని ఎన్నో కోణాలు హ్రస్వకవితలుగా చోటుచేసుకున్నాయి. మానవ జీవితంలోని పలు అంశాలతో బాటు ఆరు దశాబ్దాల కాలంలో దేశంలో సంభవించిన అనేక సామాజిక, చారిత్రక, రాజకీయ మార్పుల్లోని పలు అంశాలను ఈ కవి కలం పుక్కిటపట్టుకుంది. పీడితజనం పక్షాన నిలిచింది. దోపిడీవర్గపు ధౌష్ట్యాన్ని తూర్పారబట్టింది. హైకూ లక్షణాలను పూర్తిగా పుణికిపుచ్చుకొకపోయినా మూడుపాదాలతో, ఐదు ఆవృతాలతో కూడిన హైకూల్లాంటి హ్రస్వకవితల్ని ఈ కవి తన కళ్లముందు కనిపించే ఆనేక సామాజిక రుగ్మతలపై చెణుకుల్లా సంధించారు. నిత్యజీవితంలో కనిపించే ఎన్నెన్నో సంఘటనలు, సందర్భాలు ఈ అల్పాక్షరాల హ్రస్వ కవితలయ్యాయి. ఎన్నో లొసుగుల్లోని డొల్లతనాన్ని బట్టబయలు చేశాయి. శ్రమసౌందర్యం, పదవీవ్యామోహం, ప్రపంచీకరణ మాయలో గల్లంతయ్యే గ్రామాలు, మాయమయ్యే చెరువులు, మాఫియాలో కొట్టుకుపోయే మట్టి, గాలానికి చిక్కని సొరచేపలు, మనిషిని మాయం చేసేస్తున్న మరమనిషి, పేదల కోరికల్లాంటి ఎండమావులు, అడవిగోసకు కారణమయ్యే యురేనియం మైనింగ్, చేతికి మట్టిని మాత్రమే అందించే కుమ్మరిచక్రం, కరెన్సీ కారణంగా తూర్పపడమరలైపోయే రక్తబంధాలు, ప్రజలకు కాపలా



- డాక్టర్ కొత్వాలు అమరేంద్ర,
సెల్ : 9177732414

పేరుతో వారి ఆస్తుల్ని కాజేసే భస్మాసుర హస్తాలు, తరతరాల వాదంగానే నిలిచిపోతున్న వెనుకబాటు, గతితప్పిన ప్రభుత్వ ప్రణాళికలు, ప్రపంచీకరణ ఎన్నటికీ రుచి తగ్గని జ్ఞాపకాల ఫలాలను అందించే స్నేహం... ఇవన్నీ ఈ కవితలకు వస్తువులయ్యాయి.




ఈ హ్రస్వ కవితల్లోని మూడు పాదాల్లోని చివరి పాదం చెప్పదలచుకున్న విషయాన్ని శక్తివంతం చేస్తుంది. ఈ కవి పలుచోట్ల అల్పాక్షరాలతో చేసిన పదప్రయాగాలు ఈ కవితల్ని సుసంపన్నం చేశాయి. ఉదాహరణకు 'రాచబాటలు/పదవుల తండ్లాట/మండని పొయ్యి' అంటూ నేటి రాజకీయవ్యవస్థను తూర్పారబట్టే కవిత సాగుతుంది. ఈ కవితను మంటలు, తండ్లాట, మండని పొయ్యి అనే పదప్రయోగాలు శక్తివంతం చేశాయి. రాజకీయనేతలు పదవుల కోసం కొట్లాడుకుంటూ పాలనను విస్మరిస్తే తమ ఇళ్లలో పొయ్యిలు మండించలేని దీన స్థితికి పేదలు చేరుకుంటారని ఈ కవిత వివరిస్తుంది. 'ముఖ్యంగా మూడు/పనివిద్యచికిత్స/ఎక్కడో చూడు' అంటూ మరో కవితలో జనానికి ముఖ్యంగా కావలసిన ఉద్యోగవ్యవస్థ, విద్యావ్యవస్థ, వైద్యవ్యవస్థల పటిష్టతను కోరుకుంటుంది కవికలం. 'పగలు రేయి/కలువ కమలాలు/పుష్పవిలాసం' అంటూ ప్రకృతి వైవిధ్యాన్ని వర్ణిస్తుంది. 'అప్పులనది/పడవ నడవాలి/ముందుంది సుడి' అంటూ అప్పులపాలైన దేశ ఆర్థికస్థితిని వర్ణిస్తూ ఆ నది అలాగే కొనసాగితే ముందుండే ప్రమాదం గురించి హెచ్చరిస్తుంది. 'మాఫీ తిప్పలు/కొత్త చెప్పులు కొనాలి/పాపం రైతులు' అంటూ రుణమాఫీ కోసం చెప్పులరిగేలా అధికారుల చుట్టూ తిరిగే రైతుల అవస్థల్ని వర్ణిస్తుంది. 'శరద్రుతువు/నేతల ప్రసంగాలు/చలిమంటలు' అంటూ శరద్రుతువు వంటి ఎన్నికల సమయంలో రాజకీయ నేతల ప్రసంగాలు తాత్కాలిక ఉపశమనాన్ని మాత్రమే కలిగిస్తాయని చెబుతూ నేటి రాజకీయ వ్యవస్థలోని డొల్లతనాన్ని బయట పడుతుంది. 'చెరువు మాయం/కొత్తకాలనీ ఖాయం/ప్రస్తుత న్యాయం' అంటూ ప్రపంచీకరణ మాటున కార్పొరేటర్ మాయాజాలంలో పల్లె తన అందాల్ని కోల్పోతూ కాంక్రీటు గోడల్ని నింపుకునే వైనాన్ని వర్ణిస్తుంది. ఇక్కడ ప్రస్తుత న్యాయం అనే పదప్రయోగం అధికార దర్పాన్ని ధ్వనింపజేస్తూ ఈ కవితను శక్తివంతం చేసింది. 'బడిగంటలు/రుసుముల మంటలు/విద్యావిఫణి' అంటూ ఈ కవికలం ఫీజుల భారంతో పిల్లల తల్లిదండ్రుల్ని వేధిస్తూ విద్యను మార్కెట్ లో వస్తువులో మార్చివేసిన అస్తవ్యస్త విద్యావ్యవస్థను దునుమాడుతుంది. 'చీమలదండు/కొండను తొలుస్తుంది/అహం పతనం' అంటూ దోపిడీవర్గంపై ధ్వజమెత్తే చీమలదండు లాంటి శ్రామికవర్గాన్ని కీర్తిస్తుంది. 'కులవృత్తులు/వరిచేలో పరిగె/మిగిలేదంతే' అంటూ ప్రపంచీకరణ మాటున కులవృత్తులు ఎలా పనికి రాకుండా మూలన పడిపోయి పురావృత్తులు అయిపోతున్నాయో చెబుతుంది. 'బంధాలు మునక/సెల్ ఫోన్ లో మునక/ జేబులో మిత్తి' అంటూ డిజిటల్ మాయాజాలంలో మనిషితనాన్ని కోల్పోతూ మానవ సంబంధాలు ఎలా మృగ్యమైపోతున్నాయో వర్ణిస్తుంది.

అస్తవ్యస్త సమాజంలోని అనేక లోపాల్ని ఎత్తిచూపుతుంది రేడియమ్ కవిత్వం. సరికొత్త సామాజిక మార్పులకు దిశానిర్దేశమూ చేస్తుంది. ప్రకృతి ఖైదు, కోపశలభం, కాసుసైగలు, కీర్తికి చీడ, విశ్వాసశ్వాస, రాజకీయశిశిరం వంటి పదప్రయోగాలతో అలరిస్తూ తన వొంపులతో, సొంపులతో మనల్ని మురిపిస్తుంది.

**నమ్మలేని నిజాలు(కవితాసంపుటి)**
**రచన: రేడియమ్**
**పేజీలు: 146, వెల: రూ.150**
**ప్రతులకు.. కవి మొబైల్: 9291527757**

# నాణ్యమైన నానీలు

గగనం నుంచి రవి తన కాంతుల్ని భూమిపైకి ప్రసరిస్తున్నాడు. నేలపైన రవికాంతుడు ''నానీ కిరణాలు'' ప్రసరిస్తున్నాడు. కంచనపల్లి రవికాంత్ చేసేది ఉపాధ్యాయ వృత్తి. కవిత్వం ఆయన ప్రవృత్తి. బడిపిల్లల నవ్వుల్లో ఇంద్ర ధనసులు చూస్తాడు. బడులు తెరిస్తే అతనికి వానాకాలంలో వసంతం వచ్చినట్లుంటుంది. బడి నుండి బయటకు వచ్చినా అతని మనసు బడిపిల్లల చుట్టే తిరుగుతుంది. అతనికి రోజూ దసరా పండుగే. నడక దారిలో పాలపిట్ట కనిపిస్తుంది. నెమళ్ల గుంపులు కనిపిస్తే మనసు పురివిప్పి ఆడుతుంది. ఆకాశం మొగులయినప్పుడు జ్ఞాపకాల ముసురులో తడుస్తాడు.

ఇతని కవిత్వంలో మబ్బుల తడికెల మాటున సిగ్గుల మొగ్గల సూరీడుంటాడు. ఋతుపవనాలు వస్తున్నప్పుడు తన్మయత్వంతో చెట్లు నాట్యం చేస్తాయి. వాన మొదలు కాగానే మట్టి పరిమళం వస్తుంది. చినుకుల తాళం ఉరుముల రాగం మాన్ సూన్ జుగల్ బందీ. వాన చినుకు ముత్యంలా మెరుస్తుంది. విత్తనం గుండెలో ప్రేమ మొలకెత్తుతుంది. అడివమ్మ కొండల గుండెలపైన మంచురైక తొడుక్కుంటుంది. మండు వేసవిలో చిరు జల్లులు కురిసినా కూడా ఈ కవికి బట్టలకన్నా ముందే మనసు తడుస్తుంది.

ఈ కవి బంధాలకు ప్రాధాన్యమిస్తాడు. 'మనాది వద్దు మనవరాలి గజ్జెల చప్పుడే దానికి మందు' అంటాడు. కొన్నిచోట్ల మనవలు, మనవరాళ్ళే వృద్ధులకు షష్ఠి పూర్తిలు, పెళ్లిరోజులు, పుట్టినరోజులు జరుపుతుంటే ఆనందపడతాడు. కొందరు వృద్ధాప్యంలో చేజారిన బాల్యాన్ని వెతుక్కుంటారని, మరికొందరికి ఏడుపదుల వయసులో అనుభవాల దొంతరలు సప్తవర్ణాలౌతాయని చెబుతాడు. బాల్యమిత్రులతో పది నిమిషాలు గడిపితే బిపి, షుగర్ నార్మల్ అంటాడు. చిన్నపిల్లలు ప్యాంట్లలో, పెద్దలు నిక్కర్లలో ఉంటే చోద్యమంటే ఇదే నంటాడు. జిగ్రీ దోస్తులతో సరదా జర్నీ చేస్తడు. ''కళ్లజోడు లేకుంటే / కళ్లు మసక / ఇల్లాలు లేకుంటే / జీవితమే మసక'' అని ఇల్లాలి ప్రాధాన్యాన్ని వివరిస్తడు.

ఊరెళ్లినా సాహితీ పరిమళాలనే ఆస్వాదిస్తడు. కవులు కలలో కూడా కవితలనే కలువరిస్తారని, వారి దిండు కింద కూడా పద్యాల పుస్తకాలే ఉంటాయని, పొలిటీషియన్ ఇంట్లో కరెన్సీ కట్టలుంటే కవుల ఇంట్లో కవిత్వం కట్టలుంటాయని, కరెన్సీ కూడా ఔట్ డేటెడ్ అవుతుంది




కాని పుస్తకాలకు కాలపరిమితి లేదని పేర్కొంటడు. మాయమైపోతున్న మనిషితనం గురించి ఈ కవి బాధపడుతాడు. ఇంటింటా ప్లాస్టిక్ తోరణాల్లాగా మనుషుల్లో కృత్రిమ నవ్వులు విరబూస్తున్నాయి. నదులు కలుషితమౌతున్నవి మనుషుల మనసుల్లో కల్మషం వల్లనే కదా! ముక్కలు చేసి ప్లాట్లుగా అమ్ముకుంటే నేలతల్లి మనసు రోదించదా? జగతి నిండా మానవత్వం పరచుకోవాలని ఇతని ఆకాంక్ష. డబ్బు చేయలేని ఎన్నో పనులు మానవత్వం చేస్తుందని, మానవత్వానికి పరాకాష్ట రక్తదానం అవయవ దానాలని చాటుతాడు.

బడిపిల్లలకు పాఠాలు చెప్పి ప్రశ్నలు అడిగినట్లుగానే రవికాంత్ సమాజానికి నానీలు అందించి ప్రశ్నలు సంధిస్తున్నాడు. పాత ఇనుప సామాన్లను వదిలించుకుంటామే! బూజు పట్టిన భావాలను వదిలించు కోలేమా? మనుషులంతా సమానమే అయినప్పుడు కులాల వారీగా గురుకులాలు ఏర్పడడం సమంజసమేనా? ఆన్లైన్లో ఆహారం దొరికినట్లు ఆనందం పొందగలరా? నెట్టింట్లో ఆహార విహారాలున్నట్లు మరి నట్టింట్లో అనురాగ ఆప్యాయతలున్నాయా? ఇంటికి వీధిపోటు కీడా? మనిషికి వెన్నుపోటు కంటేనా? తలను శుభ్రం చేసుకోవడానికి తలస్నానాలు చేస్తారే! మరి తలపులను శుభ్రం చేసుకోరా? 'కరోనా' సైన్స్ టీచర్ గా పరిశుభ్రత గురించి పాఠాలు నేర్పిందిగా! మనం వాటిని మరచిపోతే ఎలా? ఆహారాన్ని మాత్రమే భుజించాల్సిన మనం ఇప్పుడు ఔషధాలు కూడ మింగుతున్నాం. ఈ పరిస్థితికి కారణం మనం కాదా? సెల్ ఫోన్ మన జీవితంలో భాగమైతే పరవాలేదు, బానిసలం కాకూడదు కదా! స్మార్ట్ ఫోన్ లో మన జీవిత కాలమూ చేజారుతుందని గమనిస్తున్నామా? రచయిత వేసే ఈ ప్రశ్నలకు సమాధానాలు చెప్పవలసి ఉంది. అందుకోసం మన ప్రవర్తనను మార్చుకోవలసి వుంది.

'రాయిలో కప్ప / మంచుకింద ముత్యం / భళారే భగవంతుని లీల''. ''జీవితం / అర్థం కాని పుస్తకం / మరి అనుభవమే / గొప్ప గైడ్'' అంటూ రవికాంత్ చిన్న నానీలలో గొప్ప భావాన్ని ఇమిడిస్తడు. ''ఎదురింటి అమ్మాయి / ముగ్గు వేస్తోంది / తెలియకుండానే / ముగ్గులోకి దిగా''. ''ఆమె / పూలు ఏరుకుంటుంది / ఆమె నవ్వులు / ఏరుకుంటూ నేను'' అంటూ ప్రేమ కవితలు రాస్తడు. ''చీమల బారు/ ఎటు పోతుంది / బారు షాపు వైపు / కాదు కదా''. ''మూడు ముళ్ళు / ఆమెకేనా? / అతని మనసుకూ /పగ్గం వేసిందామె''. ''ఆన్ లైన్లో /ఆట పాటలే ఉన్నాయి / ఇంకా నయం / కాపురాల్లేవు'' వంటి చమత్కార బాణాలు విసరుతడు. నగరంలో వాన కురిస్తే ఆకలితో నోళ్లు తెరిచే మ్యాన్ హోళ్ల గురించి, రంగుల మయమైన సిటీ జీవితం మాటున ఉన్న కన్నీటి చారికల గురించి అబలల కన్నీటి కాలువల గురించీ రాస్తడు.

నానీలు రాసే వాళ్లు ఎందరో ఉంటారు. కాని నాణ్యమైన నానీలు రాసేవాళ్లు కొందరే ఉంటారు. ఆ కొందరిలో కంచనపల్లి రవికాంత్ ఒకడు. చిన్న పిల్లలకు ముద్దు ముద్దుగా మంచి మాటలు చెప్పినట్లుగా, ఈ నానీల ద్వారా రవికాంత్ సమాజానికి మంచిని బోధిస్తున్నాడు.



- ఎ. గజేందర్ రెడ్డి
9848894086, ప్రతులకు : 9490122753

# ఉషోదయ సంగీతం



ఈ అమరమైన క్షణాలే కదా
అత్యంత అపూర్వమైనవి
కళ్ళు తెరిస్తేనే కదా
ఊపిరి ఆగిపోలేదని తెలిసేది
నిన్నటికి వీడ్కోలు చెప్తేనే కదా
వర్తమానం అలుముకునేది..!

గడిచిపోయిన కాలాన్ని గూర్చి
వున్నదివున్నట్లుగా చెప్పలేకపోవచ్చు
కొన్ని దుఃఖమయమైన విషాదాలు
కొన్ని ఎడతెగని సంతోషాలు
కొన్ని తడియారని పరిమళాలు
అవిశ్రాంతంగా పరుగెత్తిస్తున్నాయి..!

రాలిన నవ్వుల పువ్వులన్నీ
సీసీ కెమెరాల్లో ఉంటాయేమో
మరొకసారి క్షుణ్ణంగా వెతకనివ్వండి
మనసు పొరల్లో ఇరుక్కుపోయిన
బాధలన్నింటిని తొలగించడానికి
వేకువ రాగాల్ని హత్తుకోనివ్వండి..!

గుండె నిండా దిగులు మేఘాలే
పెరుగుతున్న శత్రు సైన్యం
నిలువనీయని ప్రతి పక్షపు శిబిరాలు
భవిష్యత్తు చిత్రాల కొండల ఆందోళనలు
అనుకుంటావు ప్రతిదీ ముఖ్యమైనదేనని
వాస్తవాల్ని అంగీకరించడమే కావాలి..!

వినసొంపైన మాటల ప్రవచనాలు
విరివిరిగా జడివానలా కురుస్తున్నాయి
ఒంటరి యుద్ధంలో గెలుపోటములు లేవు
అనేక సమర స్వప్నాల అనంతరం
ప్రకృతి ఆలపిస్తున్న ఉషోదయ సంగీతాన్ని
ఒకానొక అతిథిలా ఆస్వాదిస్తున్నాను..!

- గోపగాని రవీందర్
9440979882

# ఏడవ సాలభంజిక చెప్పిన కథ



అర్థరాత్రి
ఓ కల తలుపు తడుతుంది

నిశ్శబ్దాన్ని కొరికీ కొరికీ
వదిలేసిన కీచురాయి
ఆవులిస్తూ కనిపిస్తుంది

దీపం పురుగులు
ఆత్మల్ని రెక్కల కింద దాచుకుని
స్వర్గానికి ఎగురుతూ కనిపిస్తాయి

వీధి లోని చెట్లు
ఇంటి ముందుకు వచ్చి
ధింసా నృత్యం చేస్తూ
నవ్వుతుంటాయి

చనిపోయిన కుక్క పిల్ల తిరిగి వచ్చి
గుమ్మం పక్కన కొత్త చెప్పుతో
ఆడుకుంటూ ఉంటుంది

ఎదురింటి అరుగు మీద
శ్రీనాధుడు కూర్చుని
'ఎవరికి వర్తిస్తే వారికి '
ప్రసేన్ భావ వ్యాకరణాన్ని
తిరగేస్తూ ఉంటాడు

అపుడెపుడో పుష్కర కాలం కిందట
సగంలో వదిలేసిన నవల ఎదుటకు వచ్చి
చదవమని ఒకటే గోల పెడుతుంది

ఈలోగా తొలి కోడి కూసి
స్వప్న భంగం కలిగిస్తుంది

తిరిగి రేపు ఇస్తామని
కాకులు కలల ముక్కల్ని
ఎత్తుకెడతాయి.

- తెలుగు వెంకటేష్
9985325362

# 25న మెగా ఉద్యోగ మేళా

## సద్వినియోగం చేసుకోవాలని కాంగ్రెస్ నేతల పిలుపు




**ఆదిలాబాద్, మహా**

నిరుద్యోగులకు ఉపాధి కల్పించాలనే ఉద్దేశంతో ఈ నెల 25వ తేదీన ఉట్నూర్ లో మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు టీపీసీసీ ఉపాధ్యక్షురాలు ఆత్రం సుగుణ, జీసిసి చైర్మన్ కొట్నాక్ తిరుపతి, కాంగ్రెస్ పార్టీ ఆదిలాబాద్ అసెంబ్లీ ఇంచార్జి కంది శ్రీనివాస రెడ్డి తెలిపారు. ఈ మేరకు ఆదివారం కంది శ్రీనివాస రెడ్డి క్యాంపు కార్యాలయం ప్రజాసేవా భవన్ లో కరపత్రాలు విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలోని నిరుద్యోగులకు వివిధ సంస్థల్లో ఉద్యోగాలు కల్పించేందుకు ఈ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. ఈ జాబ్ మేళాలో జాతీయ, అంతర్జాతీయ సంస్థలు పాల్గొంటాయని తెలిపారు. ఉట్నూర్ లోని జెసిఎన్ ఫంక్షన్ హాల్లో ఉదయం 10గంటలకు ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. గత ప్రభుత్వం ఇంటికో ఉద్యోగం పేరు చెప్పి నిరుద్యోగులను మోసం చేసిందని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే 50వేల ఉద్యోగాలు కల్పించిందని గుర్తు చేశారు. తెలంగాణ లో నిరుద్యోగులు ఉండకూడదని సీఎం రేవంత్ రెడ్డి లక్ష్యంగా పెట్టుకున్నారని పేర్కొన్నారు. తాజాగా నిర్వహించే జాబ్ మేళాలో అంతర్జాతీయ సంస్థలు కూడా పాల్గొనడం తొలిసారని గుర్తు చేశారు. నిరుద్యోగులు భారీగా తరలి వచ్చి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. కాంగ్రెస్ శ్రేణులు అధిక సంఖ్యలో హాజరై నిరుద్యోగులకు సదుపాయాలు కల్పించాలని కోరారు. డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లెపూల నర్సయ్య, సెడ్మకె ఆనంద రావు, భూపల్లి శ్రీధర్ , గుడిపల్లి నగేష్, గిమ్మసంతోష్ ,సామ రూపేష్ రెడ్డి, కలాల శ్రీనివాస్, మునిగెల విఠల్, ఎంఏ షకీల్, రామ్ కుమార్, ఫైజుల్లా ఖాన్, రాందాసం నాక్లే, దాసరి ఆశన్న, శ్రీలేఖ తదితరులు హాజరయ్యారు.

# స్థానికంపై హస్తం నజర్..

- ఉమ్మడి జిల్లా ఇంఛార్జీలను నియమించిన పార్టీ
- జడ్పీ, ఎంపీపీలను చేజిక్కించుకోవాలని ప్రయత్నాలు
- పరిషత్ లో సత్తాచాటేందుకు శ్రేణులకు దిశానిర్దేశం
- చేరికలు..విస్తత కార్యక్రమాలతో నాయకులు బిజీబిజీ
- ఎన్నికల సమరానికి కాంగ్రెస్ పార్టీ సమాయత్తం
- గులాబీ, కమలం కోటలో పాగా వేసేందుకు తాపత్రయం



**ఆదిలాబాద్, మహా:** స్థానిక సంస్థల ఎన్నికలకు హస్తం పార్టీ సమాయత్తమవుతోంది. పరిషత్ లో సత్తాచాటి పార్టీని మరింత బలోపేతం చేసే దిశగా అడుగులు వేస్తోంది. సార్వత్రిక ఎన్నికల్లో సత్తాచాటి రాష్ట్రంలో అధికారం చేజిక్కించుకున్న కాంగ్రెస్ పార్టీ..తాజాగా జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ సత్తాచాటాలని ఉవ్విళ్లూరుతోంది. ఉమ్మడి జిల్లాలో నాలుగు జడ్పీ పీఠాలతో పాటు అత్యధిక ఎంపీపీ స్థానాలను కైవసం చేసుకోవాలని భావిస్తోంది. ఇందులో భాగంగా ఇటీవల పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేసేందుకు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు ఇద్దరు ఇంఛార్జీలను నియమించడం ప్రాధాన్యం సంతరించుకుంది. ఇటీవల ఉమ్మడి జిల్లా ఇంఛార్జీ మంత్రిగా జూపల్లి కృష్ణారావును నియమించింది. ఈయనతో పాటు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా పార్టీ ఇంఛార్జీగా రాజ్యసభ సభ్యుడు అనిల్ కుమార్ యాదవ్ ను నియమించగా.. పార్లమెంటు ఇంఛార్జీగా నల్గొండ ఎంపీ రఘువీర్ రెడ్డిని నియమించింది. ఇప్పటికే జిల్లాకు వచ్చిన వీరు పార్టీ బలోపేతంతో పాటు రానున్న స్థానిక సంస్థల ఎన్నికలపై పార్టీ శ్రేణులకు దిశా నిర్దేశం చేశారు.

**జడ్పీ, ఎంపీపీ పీఠాల కోసం..**

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో 579 ఎంపీటీసీ స్థానాలు ఉండగా.. 69 జడ్పీటీసీ స్థానాలు ఉన్నాయి. నాలుగు జిల్లా పరిషత్ లతో పాటు 69 మండల పరిషత్ లు ఉన్నాయి. వీటిని చేజిక్కించుకునేందుకు అధికార కాంగ్రెస్ పార్టీ ఇప్పటి నుంచి దృష్టి సారించింది. నాలుగు జిల్లా పరిషత్ లను కైవసం చేసుకోవడంతో పాటు అన్ని ఎంపీపీ స్థానాలను తమ ఖాతాలో వేసుకునేలా పావులు కదుపుతున్నారు. రాష్ట్రంలో అధికారంలో ఉండటంతో స్థానిక సంస్థల్లోనూ పార్టీ విజయం సాధిస్తే మరింత బలోపేతంతో పాటు ప్రజాప్రతినిధులుగా ఆ పార్టీకి చెందిన వారే ఉంటారని భావిస్తోంది. దీంతో ఆ పార్టీ అధిష్టానం దృష్టి అంతా త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికలపైనే కేంద్రకృతమవుతోంది. ఇప్పటికే కొత్తగా ఉమ్మడి జిల్లా ఇంఛార్జీగా జూపల్లి కృష్ణారావును నియమించిన అధిష్టానం.. పార్టీ ఉమ్మడి జిల్లా ఇంఛార్జీగా ఎంపీ అనిల్ కుమార్ యాదవ్, ఆదిలాబాద్ పార్లమెంట్ ఇంఛార్జీగా రఘువీర్ రెడ్డిని నియమించింది. ఇది వరకే ఉమ్మడి జిల్లాలో పర్యటించిన మంత్రి జూపల్లి రానున్న ఎన్నికల్లో సత్తాచాటుదామని పార్టీ శ్రేణులకు దిశా నిర్దేశం చేశారు. జిల్లాలో ప్రభుత్వ పథకాలను సమర్థవంతంగా అమలు చేస్తూనే పార్టీని బలోపేతం చేయడంపైనా దృష్టి సారిస్తున్నట్లు తెలుస్తోంది. మరోపక్క ఇటీవల ఆదిలాబాద్ జిల్లాకు వచ్చిన అనిల్ కుమార్ యాదవ్ సైతం స్థానిక ఎన్నికలకు సంసిద్ధంగా ఉండాలని పార్టీ శ్రేణులకు పిలుపునివ్వడం ప్రాధాన్యం సంతరించుకుంది.ఇక ఆదిలాబాద్ నియోజకవర్గంలో అసెంబ్లీ ఇంచార్జి కంది శ్రీనివాస రెడ్డి నాయకత్వంలో పార్టీలో చేరికలు పెరుగుతున్నాయి. వివిధ ప్రాంతాల నుంచి ఇతర పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు ఆయన నాయకత్వంలో కాంగ్రెస్ లో చేరుతున్నారు. తాజాగా బేల మండలంలో ఒక్కరోజే సుమారు వెయ్యి మంది వివిధ పార్టీలకు చెందిన వారు కాంగ్రెస్ కండువా కప్పుకోవడం ప్రాధాన్యం సంతరించుకుంది. ఐక్యంగా ఉంటూ స్థానిక ఎన్నికల్లో సత్తాచాటుదామని శ్రేణులకు పిలుపునిస్తున్నారు.

**ఆ స్థానాల్లో పాగా వేయాలని..**

కాంగ్రెస్ పార్టీ గత పదేళ్లుగా ప్రతిపక్షానికే పరిమితమైంది. గత సార్వత్రిక ఎన్నికల వరకు ఆ పార్టీకి ఒక్క ఎమ్మెల్యే కూడా లేరు. అక్కడక్కడ జడ్పీటీసీలు, ఎంపీటీసీలు మాత్రమే ఉండేవారు. ఎక్కువగా బీఆర్ఎస్ కు చెందిన వారు ఉండగా.. పశ్చిమ జిల్లాలో కొందరు బీజేపీకి చెందిన వారు ఉన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలో ఉండటంతో గులాబీ, కమల పార్టీల కోటాల్లో పాగా వేయాలని భావిస్తోంది. అత్యధికంగా జడ్పీటీసీ, ఎంపీటీసీలను గెలుచుకొని నాలుగు జిల్లా పరిషత్ లతో పాటు ఎంపీపీ పీఠాలను కైవసం చేసుకోవాలని తాపత్రయ పడుతోంది. ఇప్పటికే వివిధ సంక్షేమ పథకాలు అమలు చేయడంతో పాటు పలు అభివృద్ధి పనులు ప్రారంభించిన నేపథ్యంలో పార్టీకి ప్రయోజనం చేకూరుస్తాయని ఆ పార్టీ నేతలు భావిస్తున్నారు. ఎన్నికల నోటిఫికేషన్ కోసం ఆత్రుతగా ఎదురు చూస్తున్నారు.

# నిరుపేదల పెన్నిధి సీఆర్ఆర్- కంది శ్రీనివాస రెడ్డి

ప్రజా సేవాభవన్ లో ఘనంగా వర్ధంతి కార్యక్రమం..

పెద్ద సంఖ్యలో హాజరైన కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు.. సీఆర్ఆర్ సేవలను కొనియాడిన నేతలు




**ఆదిలాబాద్, మహా :** మాజీ మంత్రి వర్యులు స్వర్గీయ చిలుకూరి రామచంద్రారెడ్డి నిరుపేదల పాలిట పెన్నిధి అని ఆదిలాబాద్ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇంచార్జి కంది శ్రీనివాస రెడ్డి ఆయన సేవలను స్మరించుకున్నారు. ఆదివారం కంది శ్రీనివాస రెడ్డి క్యాంపు కార్యాలయం ప్రజాసేవా భవన్ లో సీఆర్ఆర్ వర్ధంతి వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న కంది శ్రీనివాస రెడ్డి సీఆర్ఆర్ చిత్ర పటానికి నివాళులు అర్పించారు. అనంతరం కంది శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతం కోసం జీవితాంతం శ్రమించిన గొప్ప నాయకుడు సిఆర్ ఆర్ అని కొనియాడా. గరీబోళ్ల నాయకుడిగా గుర్తింపు పొందారని తెలిపారు. అయన ఆశయ సాధన కోసం పనిచేద్దామని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో జీసీసీ చైర్మన్ కొట్నాక తిరుపతి, డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లెపూల నర్సయ్య,టీపీసీసీ వైస్ ప్రెసిడెంట్ ఆత్రం సుగుణ,సెడ్మకె ఆనంద రావు, భూపల్లి శ్రీధర్ , గుడిపల్లి నగేష్, గిమ్మసంతోష్ ,సామ రూపేష్ రెడ్డి, కలాల శ్రీనివాస్, మునిగెల విఠల్, ఎంఏ షకీల్, రామ్ కుమార్, ఫైజుల్లా ఖాన్, రాందాసం నాక్లే, దాసరి ఆశన్న, శ్రీలేఖ తదితరులు హాజరయ్యారు.

# ఐక్యతతోనే అధికారం సాధ్యం




**హన్మకొండ మహా;** జన అధికార సమితి, ది వీవర్స్ వెల్ఫేర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆదివారం ఐఏఎస్ అధికారి పరికిపండ్ల నరహరి రాసిన ఓబీసీ ల పోరుబాట పుస్తక సమీక్ష కార్యక్రమానికి ప్రభుత్వ మాజీ చీఫ్ విప్, బీఆర్ఎస్ పార్టీ హనుమకొండ జిల్లా అధ్యక్షులు దాస్యం వినయ్ భాస్కర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఐఏఎస్ అధికారి పరికిపండ్ల నరహరిని శాలువాతో ఘనంగా సత్కరించి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వినయ్ భాస్కర్ మాట్లాడుతూ.. చైతన్యవంతులైన బీసీలందరూ ఏకం కావాల్సిన అవసరం ఎంతైనా ఉందని బీసీలందరూ ఏకమైనప్పుడే రాజ్యాధికారం సాధ్యమవుతుందని బీసీలకు రాజ్యాధికారం వచ్చినప్పుడే సమాజంలోని అన్ని వర్గాలకు సమన్యాయం జరుగుతుందని స్పష్టం చేశారు. పార్టీలకతీతంగా సంఘాలకతీతంగా బీసీ ఉద్యమం ఎక్కడ జరిగిన అక్కడ వినయ్ భాస్కర్ ఉంటాడని, ఎల్లప్పుడూ బీసీలకు అండగా ఉంటారని తెలిపారు. బీసీ ఉద్యమాల్లో నేను ఎప్పుడూ ముందుంటానని ఆయన తెలిపారు. నరహరి రాసిన ఓబీసీ ల పోరుబాట పుస్తకం బీసీలకు ఒక దిక్సూచిగా పనిచేస్తుందని అన్నారు. వ్యక్తిగతంగా బీసీ ఉద్యమాలలో పాల్గొంటూ హనుమకొండ లోని కాకతీయ యూనివర్సిటీ, ములుగు రోడ్డు ప్రాంతాల్లో పూలే విగ్రహ స్థాపనకు కృషి చేయడం జరిగిందని గుర్తు చేశారు. బీసీ ఉద్యమాన్ని బలోపేతం చేస్తూ అందరం కలిసి కట్టుగా పోరాడుదామని పిలుపునిచ్చారు.

# ప్రభుత్వ పనులలో అవినీతి రహిత అభివృద్ధికి కృషి

## రాష్ట్ర కార్మిక, ఉపాధి కల్పన, భూగర్భ గనుల శాఖ మంత్రి గడ్డం వివేకానంద



**మంచిర్యాల, మహా :** ప్రభుత్వ పనులలో అవినీతి రహిత అభివృద్ధికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని రాష్ట్ర కార్మిక, ఉపాధి కల్పన, భూగర్భ గనుల శాఖ మంత్రి గడ్డం వివేకానంద వాక్యానించారు. ఆదివారం జిల్లా చెన్నూర్ మండలం, కిష్టంపేట గ్రామంలో ఏర్పాటు చేసిన ఇందిరా మహిళా శక్తి సంబరాలలో జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి కిషన్ లతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రి మాట్లాడుతూ ప్రభుత్వ అభివృద్ధి పనులను నిష్పక్షపాతంగా, పారదర్శకంగా నిర్వహించి అర్హత గల ప్రతి లబ్ధిదారుడికి సంక్షేమ పథకాలు అందిస్తామని తెలిపారు. రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమంలో భాగంగా ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలలో ఎలాంటి అవినీతి లేకుండా గ్రామాలను అభివృద్ధి చేస్తామని తెలిపారు. ప్రభుత్వం మహిళల ఆర్థిక అభివృద్ధికి అధిక ప్రాధాన్యతనిస్తూ అనేక మార్గాల ద్వారా ఆర్థిక స్వావలంబన పొందే విధంగా చర్యలు తీసుకుంటుందని అన్నారు. స్వయం సహాయక సంఘాలకు వడ్డీ లేని రుణాలను అందించి ప్రోత్సహించడం జరుగుతుందని వివరించారు. మహిళా సంఘాలు తాము పొందిన రుణాలను సకాలంలో తిరిగి చెల్లించినట్లయితే తిరిగి రుణ సదుపాయం కల్పించేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేస్తున్నామని, మహిళలను అన్ని రంగాలలో అభివృద్ధి చేసే దిశగా చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. ప్రభుత్వం మహిళలకు అందిస్తున్న వడ్డీ లేని రుణాలను సద్వినియోగం చేసుకొని మహిళలు ఆర్థికంగా ఎదగాలని తెలిపారు. అర్హులైన నిరుపేదలకు గూడు కల్పించే ఉద్దేశంతో ఇందిరమ్మ ఇండ్ల పథకం ద్వారా ఇల్లు మంజూరు చేయడం జరుగుతుందని వెల్లడించారు. ప్రతి నియోజకవర్గానికి 3 వేల 500 ఇందిరమ్మ ఇల్లు కేటాయించడం జరిగిందని తెలిపారు. లబ్ధిదారులు ప్రభుత్వ నిబంధనల ప్రకారం 600 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఇల్లు నిర్మించుకోవాలని, బిల్లులు సకాలంలో అందించేందుకు అవకాశం ఉంటుందని అన్నారు. మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించి రాష్ట్రమంతా ప్రయాణించేందుకు అవకాశం కల్పించడం జరిగిందని తెలిపారు. అర్హత గల లబ్ధిదారులకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ అందిస్తున్నామని తెలిపారు. గ్రామాలలో అంతర్గత రహదారులను అభివృద్ధి చేసి మండల కేంద్రాలకు అనుసంధానం చేయడం ద్వారా రవాణా వ్యవస్థను మెరుగుపరచడం జరిగిందని తెలిపారు. చెన్నూర్ నుండి 5 నూతన బస్సు సర్వీసులను ప్రారంభించడం జరిగిందని, చెన్నూరు పట్టణంలో ఆర్ టి సి బస్ డిపో కొరకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు అందించామని తెలిపారు. సోమనపల్లి గ్రామంలో 200 కోట్ల రూపాయల నిధులతో ఇంటిగ్రేటెడ్ స్కూల్ ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు. ప్రభుత్వం విద్య, వైద్య రంగాలకు అధిక ప్రాధాన్యతనిస్తూ ప్రజలకు వైద్య సేవలు అందుబాటులో ఉండేందుకు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను నూతనంగా నిర్మించడంతో పాటు గత ఆరోగ్య కేంద్రాలలో వసతులను మెరుగుపరచడం జరుగుతుందని తెలిపారు. 18 నెలల కాలంలో సుమారు 500 మందికి ముఖ్యమంత్రి సహాయ నిధి మంజూరు చేయడం జరిగిందని, రేషన్ కార్డు కలిగిన లబ్ధిదారులకు మూడు నెలల సన్న బియ్యం ఉచితంగా అందించడం జరిగిందని తెలిపారు. చెన్నూర్ నియోజకవర్గంలో దాదాపు 8 వేల నూతన రేషన్ కార్డులు జారీకి ఆదేశాలు ఇచ్చినట్లు తెలిపారు. అనంతరం సుమారు 256 స్వయం సహాయక మహిళా సంఘాలకు 25 కోట్ల రూపాయల వడ్డీలేని రుణాల చెక్కులను అర్హులైన మహిళలకు అందించారు. చెన్నూర్, కోటపల్లి, భీమారం మండలాలలో నూతన రేషన్ కార్డు పొందిన లబ్ధిదారులకు రేషన్ కార్డులు అందజేశారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, సంబంధిత అధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# మల్లెపూల నర్సయ్యకు సన్మానం




**ఆదిలాబాద్, మహా:** ఆదిలాబాద్ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ గా నియమితులైన మల్లెపూల నర్సయ్యకు కాంగ్రెస్ పార్టీ ఆదిలాబాద్ అసెంబ్లీ నియోజకవర్గ ఇంచార్జి కంది శ్రీనివాస రెడ్డి సత్కరించారు. ఆదివారం కంది శ్రీనివాస రెడ్డి క్యాంపు కార్యాలయం ప్రజాసేవా భవన్ లో పుష్పగుచ్ఛం అందించి శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా కంది శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ మల్లెపూల నర్సయ్యకు ఈ పదవి రావడం చాలా సంతోషంగా ఉందని తెలిపారు. నిరంతర కష్టజీవి అని ఉన్నత విద్యావంతుడైన వ్యక్తి కి పదవి వరించిందని పేర్కొన్నారు. రెండు సార్లు జడ్పీటీసీ గా పనిచేసి కాంగ్రెస్ పార్టీకి సేవలందించారని గుర్తు చేశారు. పార్టీ కష్ట కాలంలో అండగా నిలిచారని చెప్పారు. మంచి వ్యక్తిత్వం కలిగిన నర్సయ్య పదవికి వంద శాతం వన్నె తీసుకొస్తారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గిరిజన కార్పొరేషన్ చైర్మన్ కొట్నాక్ తిరుపతి, డీసిసిబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, టీపీసీసీ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు ఆత్రం సుగుణ తదితరులు పాల్గొన్నారు.

# వైభవంగా ఆషాడ మాసం బోనాల జాతర...

## అఖిల గాండ్ల తెలికుల సంఘం ఆధ్వర్యంలో సాముహిక శోభాయాత్ర ...

**ఆకట్టుకున్న మహంకాళిఅమ్మవారు... పోతరాజుల విన్యాసం..**



**ఆదిలాబాద్, మహా:** తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీక నిలిచే ఆషాడ మాసం బోనాల జాతర ఉత్సవాలు జిల్లా వ్యాప్తంగా వైభవంగా సాగుతున్నాయి. జిల్లా కేంద్రంలో అఖిల గాండ్ల తెలికుల సంఘం ఆధ్వర్యంలో సాముహిక బోనాల శోభాయాత్ర ను ఆదివారం ఉత్సాహంగా నిర్వహించారు. స్థానిక మార్వాడి ధర్మశాల వెంకటేశ్వర స్వామి ఆలయం వద్ద ముందుగా గాండ్ల కులస్తులు కుండలకు ప్రత్యేక పూజలు చేసి, బోనం కుండను తలపై ఎత్తుకొని శోభ యాత్రలో పాల్గొన్నారు. బోనాల జాతర సందర్భంగా మహంకాళి అమ్మవారు, పోతరాజులు, పెద్దపులి వేషధారణలో చేపట్టిన విన్యాసాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. మార్వాడి ధర్మశాల నుండి పట్టణ పుర వీధుల గుండా అశోక్ రోడ్ లోని పెద్ద పోచమ్మ వరకు శోభాయాత్ర ఉత్సాహంగా సాగింది. అనంతరం మహిళలు అమ్మవారికి బోనాలను సమర్పించి, మొక్కలను తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో గాండ్ల కుల సంఘం నాయకులు, కులస్తులు, మహిళలు, యువకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేసిన కంది శ్రీనివాస రెడ్డి




**ఆదిలాబాద్, మహా :** పేద బడుగు బలహీన వర్గాల సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం పని చేస్తుందని ఆదిలాబాద్ కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ ఇంచార్జి కంది శ్రీనివాస రెడ్డి అన్నారు. పేదల వైద్యఖర్చుల నిమిత్తం ముఖ్య మంత్రి సహాయ నిధినుండి వచ్చిన చెక్కులను ఆదివారం తన క్యాంపు కార్యాలయం ప్రజా సేవభన్ లో అందించారు. జైనథ్ మండలం కంఠ గ్రామానికి కు చెందిన గడ్డం అమ్మక్క రూ.60వేలు, బేల మండలం సాంగ్డి కి చెందిన బేదొడ్కర్ అనిత రూ.60వేలు, సాంగ్డి కి చెందిన జిట్టావార్ లింగమ్మ రూ.60వేలు, బేల మండలకేంద్రానికి చెందిన కండెవార్ రవీందర్ రూ. 60వేలు , పలాయ్ తాండ కు చెందిన చవాన్ సరాబాయ్ రూ.60వేలు,దస్నాపూర్ కు చెందిన చింతల స్వరాజ్ గౌడ్ రూ.60వేలు,బేల మండలం అవాల్ పూర్ కు చెందిన జక్కుల యోగేష్ రూ. 60వేలు, జైనథ్ మండలం కన్ప కు చెందిన క్యాత పద్మ రూ. 60 వేలు , భోరజ్ మండలం గూడ కు చెందిన సూరం రజిత రూ.22వేల 5వందలు, భోరజ్ మండలం కాప్రి కి చెందిన ఏనుగు లచ్చరెడ్డి రూ. 25వేల విలువ గల చెక్కు లను అందించారు. మొత్తం 5లక్షల 27వేల 5వందల విలువ గల పది చెక్కులను పంపిణీ చేసారు. సీయంఆర్ ఎఫ్ సహాయం కోసం తన క్యాంపు కార్యాలయం లో ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేసామని ఆసుపత్రుల్లో డబ్బుల పెట్టి వైద్యం చేయించుకున్నవారికి ముఖ్య మంత్రి సహాయ నిధినుండి ఆర్థిక సాయంకోసం దరఖాస్తు పెట్టుకోవచ్చన్నారు. ఇప్పటివరకు దాదాపు 41లక్షల విలువ గల చెక్కలను పంపిణీ చేసినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో జీసీసీ చైర్మన్ కొట్నాక తిరుపతి, డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లెపూల నర్సయ్య,టీపీసీసీ వైస్ ప్రెసిడెంట్ ఆత్రం సుగుణ,సెడ్మకె ఆనంద రావు, భూపల్లి శ్రీధర్ , గుడిపల్లి నగేష్, గిమ్మసంతోష్ ,సామ రూపేష్ రెడ్డి, కలాల శ్రీనివాస్, మునిగెల విఠల్, ఎంఏ షకీల్, రామ్ కుమార్, ఫైజుల్లా ఖాన్, రాందాసం నాక్లే, దాసరి ఆశన్న, శ్రీలేఖ తదితరులు హాజరయ్యారు.

# టీపీడీఏ నూతన కమిటీ ఎన్నిక...



**తలమడుగు మహా న్యూస్:** తెలంగాణ పవర్ డిప్లమో ఇంజనీర్స్ అసోసియేషన్ (టిపిడిఏ) అదిలాబాద్ జిల్లా నూతన కార్యవర్గాన్ని నిర్మల్ జిల్లాలోని ఆదివారం రోజు ఓ ఫంక్షన్ హాల్ లో,అదిలాబాద్, నిర్మల్, మంచిర్యాల, కొమ్రం భీమ్ ఆసిఫాబాద్ జిల్లాల మరియు డివిజన్ కార్యవర్గాలను టీపీడీఈఏ వరంగల్ జిల్లా అధ్యక్షులు ఇంద్రసేన రెడ్డి ప్రధాన కార్యదర్శి నాల్ల సుబ్రహ్మణ్యం ఎన్నికల ప్రధాన అధికారులు గోవర్ధన్ రెడ్డి నరేందర్ ల సమక్షంలో ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగినది. నూతన కమిటీలో ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షుడిగా గోవర్ధన సతీష్ కుమార్ , జిల్లా ప్రధాన కార్యదర్శిగా గన్ను జనార్ధన్ రెడ్డి కోశాధికారిగా భూ షణవేణి వెంకటేష్,అదిలాబాద్ డివిజన్ కార్యదర్శిగా కొమ్మటి మోహన్ ప్రసాద్, కోశాధికారిగా వినయ్ కుమార్ , ఉట్నూర్ కార్యదర్శిగా జాదవ్ రోహిదాస్ కార్యదర్శిగా రాథోడ్ పృథ్వీరాజ్ ఎం ఆర్ టి ఆదిలాబాద్ కార్యదర్శిగా షిండే సాయికిరణ్ కోశాధికారిగా సుశాంత్, జిల్లా కార్యాలయ కార్యదర్శిగా కాటం తిరుపతి రెడ్డి జిల్లా సలహాదారుడిగా దేవుళ్ళ శ్రీనివాస్, మహిళా ప్రతినిధిగా శ్రీమతి గోమాస అలివేణి, లను ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. ఈ సందర్భంగా నూతనంగా నియమితులైన కమిటీ సభ్యులు మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యలను నెరవేరుస్తూ వినియోగదారులకు సత్వర సేవలను అందించుటకు పాటు పడతామని తెలిపినారు. ఈ కార్యక్రమంలో టిపిడిఏ సభ్యులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

### అతిథి అధ్యాపకుల నియామకాలకై

# దరఖాస్తుల ఆహ్వానం

## ఇబ్రహీంపట్నం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్

**రంగారెడ్డి జిల్లా మహా:** స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఇబ్రహీంపట్నం నందు 202526 విద్యా సంవత్సరానికి గాను వివిధ సబ్జెక్టుల వారిగా అతిథి అధ్యాపకుల నియామకాల కోసం ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్. రాధిక గారు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తు ప్రకటన విడుదల చేశారు. కంప్యూటర్ సైన్స్/ అప్లికేషన్స్2, ఇంగ్లీషు1, డెయిరీ సైన్స్1, క్రాప్ ప్రొడక్షన్1 మొత్తం 05 ఖాళీలు ఉన్నట్లు ప్రిన్సిపాల్ తెలియజేశారు. అభ్యర్థులు తమ పీజీ సబ్జెక్టులలో జనరల్ వారు 55 శాతం, ఎస్సీ,ఎస్టీ అభ్యర్థులు 50 శాతం మార్కులు కలిగి ఉండాలి. పీహెచ్.డీ, నెట్, సెట్, కలిగిన వారికి మరియు బోధన అనుభవం కలిగిన వారికి ప్రాధాన్యత ఇవ్వబడును. ఎంపికైన అభ్యర్థులకు బయోమెట్రిక్ అటెండెన్స్ ప్రకారం గంటల ప్రాతిపదికన (గరిష్టంగా నెలకు 72 గంటలు) గౌరవ వేతనం లభిస్తుంది. అర్హత మరియు ఆసక్తి గల అభ్యర్థులు తమ దరఖాస్తులను తేది 23.07.2025 సాయంత్రం 4.00 గంటల లోపు కళాశాల కార్యాలయంలో ఇవ్వాలి.

# అటవీ అధికారులపై రాళ్ల దాడి.. పలువురు అధికారులకు గాయాలు

**ఆదిలాబాద్, మహా:** ఆదిలాబాద్ జిల్లా ఇచ్చోడ మండలం కేశవపట్నంలో ఉద్రిక్తత చోటు చేసుకుంది. ప్లాంటేషన్ కు వెళ్ళిన అటవీ శాఖ అధికారులపై ముల్తానీ, పోడు రైతులు రాళ్ళ దాడి జరపడం కలకలం రేపింది.దీంతో అక్కడి నుండి ఫారెస్ట్ సిబ్బంది పరుగులు పెట్టగా...గాయపడిన వారిని హుటాహుటిన రిమ్స్ కు తరలించారు. వివరాల్లోకి వెళ్తే... కవ్వాల్ రిజర్వ్ పరిదిలోని 71, 72 కంపార్ట్మెంట్ లో అటవీ అధికారులు మొక్కలు నాటేందుకు వెళ్ళారు. వీరిని స్థానిక పోడు రైతులు, ముల్తానీలు అడ్డుకోవడంతో ఉద్రిక్తత నెలకొంది. అటవీ భూములంటూ సిబ్బంది నచ్చచెప్పే ప్రయత్నం చేసినా... పోడు భూములు తమవే అంటూ స్థానికులు పట్టుపట్టారు. గత కొన్ని రోజులుగా ఈ విషయమై చర్చలు జరుగుతున్నా... ఇదే సమయంలో సిబ్బంది మొక్కలు నాటేందుకు వెళ్ళడంతో స్థానికులు అడ్డుకున్నారు. ఇదే క్రమంలో అటవీ, పోలిసు సిబ్బందిపై గ్రామస్తులు రాళ్ళ దాడి జరపడంతో పరిస్థితులు అదుపు తప్పాయి. పోలిసు వాహనాలు సైతం ఈ ఘటనలో ధ్వంసమయ్యాయి. స్థానికుల దాడిలో ముగ్గురు తీవ్రంగా గాయపడగా... వారిని జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆసుపత్రికి తరలించారు. తీవ్రంగా గాయపడిన అటవీ, పోలిసు సిబ్బంది షేకు, విక్రం, ప్రశాంత్ లను వైద్యులు పరిశీలించి అవసరమైన చికిత్సలు అందించారు. రిమ్స్ డైరెక్టర్ డాక్టర్ జై సింగ్ రాథోడ్ ఆసుపత్రికి చేరుకొని పరిస్థితిని సమీక్షించారు. తీవ్ర గాయాలతో వచ్చిన వారికి మెరుగైన వైద్యం అందిస్తున్నట్లు తెలిపారు. ఒకరికి తలకు గాయం కాగా.. మరొకరికి చాతీ భాగంలో గాయాలు అయ్యాయని పేర్కొన్నారు. వారికి అవసరమైన అన్ని వైద్య పరిక్షలు పూర్తి చేసి మెరుగైన వైద్యం అందిస్తామని వివరించారు. తమను చుట్టుముట్టి రాళ్ళతో దాడి చేశారని గాయపడిన సిబ్బంది ఆవేదన వ్యక్తం చేశారు. మొక్కలు నాటేందుకు వెళ్ళిన తమపై ఒక్కసారిగా దాడి చేయడంతో అక్కడి నుండి వచ్చేసినట్లు తెలిపారు.

# నిరుద్యోగులను మోసం చేసిన కృష్ణపై చర్యలు తీసుకోవాలి

**ఆదిలాబాద్, మహా:** ఉట్నూర్ కేంద్రంగా డిజిటల్ మైక్రో సంస్థ పేరుతో ఆదివాసీ ఇతర పేద నిరుద్యోగులకు ఉద్యోగాల ఎరవేసి డబ్బులు తీసుకొని మోసం చేసిన ఆ సంస్థ యజమాని కృష్ణ పై చర్యలు తీసుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి దర్శనాల మల్లేష్ ఒక ప్రకటన లో తెలిపారు. ఒకొక్కరి దగ్గర రూ.20 వేల చొప్పున సుమారుగా 400 మంది నిరుద్యోగుల నుండీ డబ్బులు వాసులు చేసి బోర్డు తిప్పేసి పారిపోయాడని పేర్కొన్నారు. ఇలా ప్రజలను నమ్మించి బురిడీ కొట్టించారని వివరించారు. సంస్థ వెనుకాల రాజకీయ నాయకుల హస్తం ఏమైనా ఉన్నదా అనే కోణంలోనూ పోలీసు అధికారులు దర్యాప్తు చేయాలని ఒక వేల ఉంటే వారు ఎంతటి వారైనా సరే వదిలిపెట్టవద్దని కోరారు.మోస పోయిన నిరుద్యోగులకు సంస్థ ద్వారా తిరిగి డబ్బులు ఇప్పించాలని తెలిపారు.



## భక్తిశ్రద్ధలతో పోచమ్మ తల్లి బోనాలు

- అమ్మవారి ఆశీస్సులతో ప్రజలందరూ క్షేమంగా ఉండాలి
- చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య

**రంగారెడ్డి జిల్లా మహా:** ఆదివారం చేవెళ్ల పట్టణంలో పోచమ్మ బోనాల పండుగలో పాల్గొని, అమ్మ వారిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు నిర్వహించిన చేవెళ్ల శాసనసభ్యులు *"కాలే యాదయ్య". ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... అమ్మవారి ఆశీస్సులతో ప్రజలందరూ ఆయురారోగ్యాలతో ఉండాలని, వర్షాలు సమృద్ధిగా కురిసి పాడి పంటలతో సంతోషంగా ఉండాలని కోరుకున్నారు. పట్టణంలోని వివిధ కాలనీలో పట్టణవాసులు పోచమ్మ ఆలయం వద్ద బోనాలు సమర్పించి మొక్కులను తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు భక్తులు, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.



## బంగారు పోచమ్మను దర్శించుకున్నా ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ , కార్తీక్ రెడ్డి

**రాజేంద్రనగర్ మహా ;** ఆషాడ మాసం బోనాల జాతర సందర్భంగా మైలార్ దేవ్ పల్లి డివిజన్ పరిధిలోని ప్రేమావతి పేట లోని శ్రీ బంగారు పోచమ్మ దేవాలయంలోని అమ్మవారిని ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్, బిఆర్ఎస్ నియోజకవర్గ ఇన్చార్జ్ కార్తీక్ రెడ్డి, యూనివర్సిటీ వీసీ జానయ్యలు దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అమ్మవారి ఊరేగింపులో పాల్గొన్నారు. ఈ కారిక్రమములో ఆలయ కమిటీ సభ్యులు కాంగ్రెస్ పార్టీ డివిజన్ అధ్యక్షులు ధనంజయ్, సరికొండ వెంకటేష్, ఉపేందర్, బిఆర్ఎస్ యువ నాయకులు రఘు యాదవ్, రమేష్ ముదిరాజ్, రాజేష్ యాదవ్, గుమ్మడి కుమార్, వెంకటేష్, బిఆర్ఎస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



## అమ్మవారిని దర్శించుకున్న వివిధ పార్టీల నాయకులు

**రాజేంద్రనగర్ మహా ;** మణికొండ మున్సిపాలిటీ పరిధిలో ఆషాడ మాసం బోనాల పండుగ సందర్భంగా పలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించి బోనాలు అమ్మవారికి సమర్పించారు. ఆషాడ మాస బోనాల ఉత్సవాలు కోలాహలంగా అంగరంగ వైభవంగాజరిగాయి. మణికొండ మున్సిపల్ మాజీ చైర్మన్ కస్తూరి నరేందర్, మాజీఫ్లోర్‌లీడర్ రామకృష్ణారెడ్డి శ్రీనల్లపోచమ్మఅమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ నరేందర్ రెడ్డి, నార్సింగ్ మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ బుదోళ్లు శ్రీరాములు, మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఏర్పుల కుమార్, జితేందర్, నాయకులు శ్రావణ్ కుమార్,గంగాధర్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.



## అమ్మవారి ఆశీర్వచనాలు ప్రజలపై ఉండాలి

నియోజకవర్గ బిజెపి ఇన్చార్జ్ తోకల శ్రీనివాస్ రెడ్డి

**రాజేంద్రనగర్ మహా ;** రాజేంద్రనగర్ నియోజకవర్గంలో ఆషాడ మాసం బోనాల ఉత్సవాలలో భాగంగా బిజెపి నియోజకవర్గ ఇన్చార్జ్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి అత్తాపూర్ లోని పలు దేవాలయాలలో కమిటీ సభ్యులతో కలిసి ఆదివారం అమ్మవారి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రజలందరికీ బోనాల పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. అమ్మవారి చల్లని ఆశీస్సులు దీవెనలు ప్రజలందరికీ ఉండాలి. నియోజకవర్గ పరిధిలోని ప్రజలు సుఖసంతోషాలతో ఆయురారోగ్యాలతో అష్టైశ్వర్యాలతో పాడిపంటలతో ఆనందంగా జీవించాలని అమ్మవారిని వేడుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు కొమురయ్య గంగాల అమర్నాథ్ రెడ్డి, స్టార్ చిన్న ముదిరాజ్, వెంకటేష్ రెడ్డి, పుచ్చిరెడ్డి శస్కాంత్ శర్మ, విజయ్, వెంకటేష్, లక్ష్మీకాంత్, చిన్న, దేవాలయ కమిటీ సభ్యులు స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

# ఇరుకుగా మారిన ఆటోనగర్ రహదారి

- రహదారికి ఇరువైపులా భారీ వాహనాల పార్కింగ్
- తీవ్ర ఇబ్బందులు పడుతున్న వాహనదారులు
- రహదారి పైనే భారీ వాహనాలకు మరమ్మత్తులు
- ప్రమాదకరంగా మారిన హనుమాన్ జంక్షన్ రహదారులు



**వరంగల్ మహా;** వరంగల్ పోచమ్మ మైదాన్ నుంచి 80 ఫీట్ రోడ్డు ఆటోనగర్ మీదుగా హనుమాన్ జంక్షన్ కు వెళ్లే ప్రధాన రహదారి ప్రస్తుతం భారీ వాహనాల అక్రమ పార్కింగ్‌కు నిలయంగా మారింది. నగరంలో నిత్యం రద్దీగా ఉండే ఈ మార్గంతో పాటు, ఇతర అంతర్గత రహదారుల వెంబడి కూడా లారీలు, క్రేన్లు, ట్రక్కులు, బస్సులు వంటి భారీ వాహనాలను నిలిపి ఉంచడంతో అటుగా వెళ్లే వాహనదారులు, స్థానిక వ్యాపారులు, పాదచారులు నిత్యం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ సమస్య పై సంబంధిత పోలీసులు, మున్సిపల్ అధికారులు తగిన చర్యలు తీసుకోవడం లేదన్న విమర్శలు ప్రజల నుంచి బలంగా వినిపిస్తున్నాయి.

**ప్రమాదాలకు దారి తీస్తున్న పరిస్థితి**

ఈ రహదారి పై భారీ వాహనాలు రోజుల తరబడి విచ్చలవిడిగా నిలపడం వల్ల ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలుగుతోంది. ఉదయం నుంచి రాత్రి వరకు ఈ రోడ్డు పై నిత్యం భారీ వాహనాల రద్దీ ఉంటుంది. సాయంత్రం వేళల్లో ముఖ్యంగా రాత్రి సమయాల్లో తగినంత విద్యుత్ దీపాలు లేకపోవడం, రోడ్డుపై అస్తవ్యస్తంగా నిలిపిన భారీ వాహనాలు సరిగా కనిపించకపోవడం వల్ల ప్రమాదాలు జరిగే అవకాశం గణనీయంగా పెరుగుతోందని వాహనదారులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వేగంగా వచ్చే వాహనదారులు ముఖ్యంగా ద్విచక్ర వాహనదారులు, ఆటోలు హఠాత్తుగా కనిపించే ఈ వాహనాలను తప్పించుకోవడానికి పక్కకు వెళ్లాల్సి వస్తోందని దీనివల్ల ఒకరికొకరు ఢీకొనే ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు చెబుతున్నారు. మరోవైపు, రోడ్డు పక్కన పాడైపోయిన వాహనాలను కూడా నెలల తరబడి వదిలేయడం వల్ల అవి శిథిలావస్థకు చేరుకుంటున్నాయి. ఈ వాహనాలు కేవలం పార్కింగ్‌కు మాత్రమే కాకుండా రోడ్డు భద్రతకు కూడా ముప్పుగా మారుతున్నాయి. అంతేకాకుండా కొన్ని చోట్ల ఈ రోడ్డుపైనే జెసిబి లకు, భారీ వాహనాలకు మరమ్మతులు, సర్వీసింగ్ పనులు చేస్తుండటంతో మరమ్మతుల సామాగ్రి, పనిముట్లు రోడ్డుపైనే ఉండిపోయి, ట్రాఫిక్ మరింత అంతరాయం ఏర్పడుతోంది. ఇది ట్రాఫిక్ కు తీవ్ర ఆటంకం కలిగిస్తూ, నిత్యం చిన్నపాటి ప్రమాదాలకు దారితీస్తోంది.

**సంబంధిత అధికారుల నిర్లక్ష్యం?**

ఆటోనగర్ లోని భారీ వాహనాల డీలర్లు, విడిభాగాల దుకాణాలు, సర్వీసింగ్ సెంటర్లు, ఇతర చిన్న వ్యాపార సముదాయాల యజమానులు ఈ అక్రమ పార్కింగ్ కు ప్రోత్సహిస్తున్నారని వాహనదారులు, స్థానిక ప్రజలు వాపోతున్నారు. కొన్ని భారీ వాహనాలు దుకాణాల ప్రవేశ ద్వారాలను సైతం అడ్డగించడంతో వ్యాపారం చేసుకోవడమే కష్టంగా మారిందని చెబుతున్నారు. రోడ్డుపై నిలిపిన ఈ వాహనాలకు సరైన సర్వీస్ లైసెన్సులు ఉన్నాయా లేదా అనే సందేహాలు కూడా ప్రజల నుంచి వ్యక్తమవుతున్నాయి. ప్రజలకు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు కలుగుతున్న నిత్యం ప్రమాదాలకు గురవుతున్న సంబంధిత పోలీసులు, మున్సిపల్ అధికారులు ఈ సమస్యను పట్టించుకోవడం లేదన్న విమర్శలు గత కొంతకాలంగా బలంగా వినిపిస్తున్నాయి. ఇంత జరుగుతున్నా, సంబంధిత అధికారులు కేవలం చోద్యం చూస్తున్నారని, ఇది ఏ మాత్రం ఆమోదయోగ్యం కాదని ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

**తక్షణ చర్యలు అనివార్యం**

ప్రమాదాలు జరగకుండా ట్రాఫిక్ సమస్యను పరిష్కరించేందుకు ఉన్నతాధికారులు తక్షణమే స్పందించాలని స్థానిక ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ఆటోనగర్ ప్రధాన రహదారిపై అక్రమంగా నిలిపిన భారీ వాహనాలను యుద్ధప్రాతిపదికన తొలగించి, చట్టవిరుద్ధ పార్కింగ్‌లకు అడ్డుకట్ట వేయాలని, ట్రాఫిక్ నిబంధనలను పటిష్టంగా అమలు చేయాలని, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న యజమానుల పై చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు. ఏదో ఒక రోజు పెను ప్రమాదాలు జరిగి అమాయకుల ప్రాణాలు బలిగొంటే అందుకు బాధ్యత ఎవరు వహిస్తారన్న ప్రశ్న తలెత్తుతోంది. అధికారులు ఇప్పటికైనా కళ్లు తెరిచి ప్రజల భద్రతకు భరోసా కల్పించాలని వాహనదారుల తో పాటు ఆటో నగర్ ప్రజలు వేడుకుంటున్నారు.

## నిర్మాణంలో ఉన్న భవనం కట్టెల అంచున నిలబడి యువకుడి హంగామా



**రాజేంద్రనగర్, మహా ;** హైదర్ గూడ సిరిమల్లె నగర్ లో నిర్మాణం లో ఉన్న భవనం కట్టెల అంచున నిలబడి యువకుడు ఆదివారం కిందకు దూకేస్తానంటూ బెదిరిస్తు హంగామా చేశాడు. స్థానికులు 100 కాల్ చేసి సమాచారం చేరవేయడంతో హుటాహుటిన ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు. నా దెగ్గరికి ఎవ్వరూ రావద్దూ దెగ్గరికి వస్తే కిందకు దూకేస్తానంటూ బెదిరింపులు చేశాడు. మూడ గంటల పాటు పోలీసులను, స్థానికులను ముప్ప తిప్పలు పెట్టిన యువకుడు. రాజేంద్రనగర్ ఎస్ఐ రఘు తన సిబ్బందితో కలిసి అతన్ని మాటల్లో పెట్టి పట్టుకొని కిందకు దింపి పోలీస్ స్టేషన్ కు తరలించారు. ఘన్సీమియాగూడ లో వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నా యువకుడు, శంషాబాద్ కు చెందిన ఎల్లయ్య గా పోలీసులు గుర్తించారు. శంషాబాద్ నుండి అత్తాపూర్ కు వచ్చి సుసైడ్ అటెంప్ట్ చేశాడు. చాకచక్యంగా వ్యవహరించి ఎల్లయ్యను కాపాడిన పెట్రోలింగ్ కానిస్టేబుల్ రాఘవేంద్ర, అంజలయ్య, మహిళ కానిస్టేబుల్.

## అమ్మవారి అనుగ్రహం అందరిపై ఉండాలి

బోనాల సందర్భంగా పోచమ్మ ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలలో పాల్గొన్న ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి



**షాద్ నగర్, మహా** అమ్మ వారి అనుగ్రహం అందరిపై ఉండాలని ప్రజలందరు అమ్మవారి ఆశీస్సులతో సుఖ శాంతులతో ఉండేలా దీవించమ్మ అని వేడుకున్నారు ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి.షాద్ నగర్ పట్టణంలోని 6వ వార్డ్ లో జరుగుతున్న పోచమ్మ బోనాలలో బాగంగా పోచమ్మ ఆలయంలో ప్రత్యేక పూజ కార్యక్రమాలలో పాల్గొని అమ్మవారి ఆశీర్వాదం తీసుకున్న ఎమ్మెల్సి నాగర కుంట నవీన్ రెడ్డి.ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్స్ లత శ్రీశైలం గౌడ్,విజయ్ కుమార్ రెడ్డి,కమిటీ ప్రెసిడెంట్ మంగ శంకర్,భాను శర్మ,సెక్రెటరీ శ్రీను,క్యాషియర్ షాప్ శ్రీశైలం,కాలనీ పెద్దలు అమర్నాథ్ రెడ్డి బ్యాంకు వెంకటయ్య, చంద్రశేఖర్ రెడ్డి, ఆంజనేయులు గౌడ్ , శివ, వెంకన్న బాబు ,కిరణ్,బబ్లు రెడ్డి,విష్ణు వర్ధన్ రెడ్డి,అనిల్,దినేష్ సాగర్,సుధీర్,మధు,గుట్ట రాజు, శబరిష్,అన్మరి రాజు,నరసింహ,జిజో జాన్సన్,తదితరులు పాల్గొన్నారు..

## గోరింటాకు చేతినిండా మురిపెం

ఆర్యవైశ్య మహిళా సంఘం ఆధ్వర్యంలో గోరింటాకు వేడుకలు



**కాటారం, మహా :** జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారం మండల కేంద్రంలో ఆదివారం అయ్యప్ప దేవాలయంలో మహిళలు గోరింటాకు వేడుకలు నిర్వహించారు. మండల ఆర్యవైశ్య మహిళా సంఘం ఆధ్వర్యంలో అమ్మవారికి పూజలు చేశారు.మహిళలందరూ సమావేశంలో ఇంటి నుండి తెచ్చుకున్న గోరింటాకు మహిళలు తమ చేతులకు అందంగా అలంకరించుకున్నారు. చేతులకు అలంకరించిన గోరింటాకును ఒకరికొకరు చూపించుకుంటూ బాగున్నవారికి ప్రశంసలు ఇచ్చారు. మహిళలకు ఆధ్యాత్మికతతో పాటు ఆనందం పంచే మాసం ఆషాడం ఈ మాసంలో లభించే గోరింటాకు అంటే మహిళలు ఎంతో మాకు చూపుతారు గోరింటాకు పెట్టుకోవడం వెనుక పలు శాస్త్రీయ ప్రయోజనాలు కూడా ఉన్నాయి. వర్షాకాలంలో గోరింటాకు పెట్టుకుంటే చర్మవ్యాధుల నుంచి రక్షణ పొందవచ్చని అభిప్రాయం ఉంది గోరింటాకు మందారం లా పండితే మంచి భర్త దొరుకుతాడని అదే వివాహితలైతే వారి కడుపు పండుతుందని కాపురం చక్కగా ఉంటుందని పెద్దవాళ్లు అంటుంటారు ఈ నమ్మకాలు ఎలా ఉన్నా గోరింటాకును శుభానికి చిహ్నంగా భావిస్తారు గోరింటాకుతో ఎర్రగా పండిన చేతులను భర్తకు చూపిస్తూ మహిళలు మురిసిపోతుంటారు. గ్రామాల్లో సామూహికంగా మహిళలు గోరింటాకును గ్రైండ్ చేసి అందరూ ఒకే చోట సమావేశమై పాటలు పాడుతూ ముచ్చట్లు పెడుతూ ఒకరికొకరు పెట్టుకున్నారు.

**మండలం మహిళా సంఘం నూతన కమిటీ ఎన్నిక**

కాటారం మండల ఆర్యవైశ్య మహిళా సంఘం నూతన కమిటీని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షురాలుగా మద్ది నీరజ, ప్రధాన కార్యదర్శిగా చందా శోభరాణి , కోశాధికారిగా బీరెల్లి పావని లు ఎన్నికైనట్లు మండల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు మద్ది నవీన్ కుమార్ తెలిపారు. నూతనంగా ఎన్నికైన కార్యవర్గానికి మహిళలు శుభాకాంక్షలు తెలిపారు. శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో మద్ది నీరజ, చందా శోభారాణి, పవిత్రం నిర్మల,బచ్చు మధుమతి, మద్ది శ్రీదేవి, కలికోట కల్పన, బచ్చు ప్రేమలత, వోల్లాల మాధవి, సామ స్వరూప,దారం రమాదేవి భీమారపు పద్మ, తోట శైలజ, నరిసిన రాజశ్రీ, పుల్లూరి రాధిక పాల్గొన్నారు.



## శుద్ధ జలాలతో ఆరోగ్య పరిరక్షణ సాధ్యం

**ఆమనగల్లు, మహా:** శుద్ధ జలాల్లోనే ఆరోగ్య పరిరక్షణ సాధ్యమని టాస్క్ సీఓఓ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి చెప్పారు. ఆదివారం కల్వకుర్తి లోని కాకులగుట్ట తండాలో సొంత నిధులు రూ.3 లక్షలు వెచ్చించి నిర్మించిన శుద్ధ జలాల వాటర్ ప్లాంట్ను ఆయన ప్రారంభించారు. గిరిజనతండాలలో శుద్ధ జలాలు అందించేందుకు తన వంతు కృషి చేస్తానని చెప్పారు. కలుషిత క్లోరైడ్ నీరు త్యాగంతో ప్రజలు అనారోగ్యాలపాలవుతున్నారన్నారు.

## భక్తి భావానికి ప్రతీకగా నిలిచే ఆషాఢ మాస బోనాలు

షాద్ నగర్ మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్ రెడ్డి



**షాద్ నగర్, మహా:** షాద్ నగర్ మున్సిపల్ 6వ వార్డు. సాయి బాబా కాలనీలో పోచమ్మ తల్లి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన షాద్ నగర్ మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్ రెడ్డి. తెలంగాణ ప్రజల ఆత్మగౌరవానికి, సంస్కృతిక విలువలకు, మరియు భక్తి భావానికి ప్రతీకగా నిలిచే ఆషాఢ మాస బోనాల పండుగను ఘనంగా జరుపుకుంటున్న ఈ సందర్భంగా, షాద్ నగర్ మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్ రెడ్డి షాద్ నగర్ మున్సిపాలిటీ 6 వార్డు సాయి బాబా కాలనీ లో పోచమ్మ తల్లిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారి ఆశీస్సులు ప్రజలపై ఎల్లప్పుడూ ఉండాలని, ప్రజలు సుఖ సంతోషాలతో, ఆరోగ్యంగా, అభివృద్ధి బాటలో ముందుకు సాగాలని తల్లిని ప్రార్థించిన మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్ రెడ్డి "బోనాల పండుగ మాకు ఒక ఆధ్యాత్మిక ఉత్సవమే కాదు – ఇది మన ఐక్యత, మన గొప్ప సంస్కృతి, మన విలువలకు నిదర్శనం. ఈ సందర్భం ప్రజలకు శుభం కలగాలని, అన్నివిధాలా అభివృద్ధి చెందాలని కోరుకుంటున్నాను," అని మాజీ ఎమ్మెల్యే చౌలపల్లి ప్రతాప్ రెడ్డి అన్నారు.ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు కొంకళ్ళ చెన్నయ్య, మాజీ కౌన్సిలర్ విజయ్ కుమార్ రెడ్డి, శ్రీశైలం గౌడ్, మురళీ మోహన్(అప్పి),కాలనీ వాసులు అమర్నాథ్ రెడ్డి, వెంకన్న బాబు, భాను శర్మ, మంగ శంకర్ ,శ్రీను, శ్రీశైలం, చంద్రశేఖర్ రెడ్డి, ఆంజనేయులు గౌడ్ ,కిరణ్,బబ్లు రెడ్డి,విష్ణు వర్ధన్ రెడ్డి,నీరటి వాసు, రాజేష్, తదితరులు పాల్గొన్నారు..

## సీఎం రేవంత్ రెడ్డిని కలిసిన ఎమ్మెల్యేల బృందం



**వరంగల్ మహా;** హైదరాబాద్ జూబ్లీహిల్స్ లోని ముఖ్యమంత్రి నివాసంలో మాజీ ఉప ముఖ్యమంత్రి, స్టేషన్ ఘనపూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి సారథ్యంలో ఉమ్మడి వరంగల్ జిల్లా ఎమ్మెల్యేలు రేవూరి ప్రకాష్ రెడ్డి, నాయిని రాజేందర్ రెడ్డి, మామిడాల యశస్విని రెడ్డి, కేఆర్. నాగరాజు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ని మర్యాదపూర్వకంగా కలిసి ఉమ్మడి వరంగల్ జిల్లా అభివృద్ధి పై సీఎం తో చర్చించారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్రంలో యంగ్ ఇండియా ఇంటర్నేషనల్ రెసిడెన్షియల్ స్కూల్స్, తెలంగాణ రాష్ట్ర క్రీడా పాఠశాలలను స్థాపించడం ద్వారా రాష్ట్రంలో నాణ్యమైన విద్యను అందించడానికి క్రీడలను ప్రోత్సహించడానికి విశేష కృషి చేస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి అభినందనలు తెలిపారు. ఉమ్మడి వరంగల్ జిల్లా నుండి అంతర్జాతీయ, జాతీయ, రాష్ట్ర స్థాయి క్రీడలలో ప్రాతినిధ్యం వహించిన అనేక మంది క్రీడా దిగ్గజాలు ఉన్నారని, వారిలో చాలా మందికి కేంద్ర ప్రభుత్వం నుండి అర్జున, ద్రోణాచార్య అవార్డులు కూడా లభించాయని సీఎం కు వెల్లడించారు. ప్రస్తుతం వరంగల్ జిల్లాలో జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియం ఒక్కటే ఉందని, ఇందులో జిల్లా క్రీడా అథారిటీ ఆధ్వర్యంలో వివిధ క్రీడలు, ఆటలకు సేవలు అందిస్తోందని తెలిపారు. ఈ స్టేడియం రాష్ట్ర జిల్లా స్థాయి విద్యార్థులు/ ప్రాంతీయ క్రీడాకారులు వారి సాధారణ శిక్షణ కోసం ఉపయోగించబడుతుందని తెలిపారు. ప్రస్తుతం వరంగల్ మహా నగరం అన్ని వైపులా విస్తరిస్తూ జనాభా పెరుగుతోందని, కావున ప్రస్తుత స్టేడియం క్రీడాకారుల అవసరాలను తీర్చలేకపోతుందని వివరించారు.



## నేడు జిల్లా గ్రంథాలయ చైర్మన్ గా కోట రాజబాబు ప్రమాణస్వీకారోత్సవం

**కాటారం, మహా :** జయశంకర్ భూపాలపల్లి జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్గా కోట రాజబాబు సోమవారం పదవీ ప్రమాణ స్వీకారం చేస్తున్నట్లు తెలిపారు. భూపాలపల్లి జిల్లా గ్రంథాలయం కార్యాలయంలో 21 వ తేదీ ఉదయం 11:30 గంటలకు ప్రమాణ స్వీకార కార్యక్రమం జరుగుతుంది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర ఐటీ,పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు,రాష్ట్ర రెవెన్యూ గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్,భూపాలపల్లి శాసన సభ్యులు గండ్ర సత్యనారాయణ రావు , రాష్ట్ర టిపీసీసి ప్రధాన కార్యదర్శి దుద్దిళ్ళ శ్రీను బాబు,రాష్ట్ర ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్, డి సీ సి అధ్యక్షులు ఐత ప్రకాష్ రెడ్డిలు పాల్గొంటున్నారు. ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ నాయకులు, మండల ప్రెసిడెంట్లు,మాజీ ఎంపీపీ లు ,జడ్పీటీసీలు,ఎంపీటీసీలు,డైరెక్టర్లు,చైర్మన్లు,మాజీ సర్పంచ్ లు, మహిళ,యూత్ నాయకులు,కార్యకర్తలు,ప్రజలు, మిత్రులు ప్రతి ప్రమాణ స్వీకారానికి రావాలని జయశంకర్ భూపాలపల్లి జిల్లా గ్రంథాలయ చైర్మన్ కోట రాజబాపు విజ్ఞప్తి చేశారు.

## యువత చిన్న వ్యాపారాలతో పెద్దస్థాయిలో విజయాలు సొంతం : సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి



**ఆమనగల్లు, మహా:** యువత చిన్న వ్యాపారాలు కూడా ఆత్మవిశ్వాసంతో మొదలుపెట్టి ముందుకు వెళ్లేనే పెద్దస్థాయిలో విజయాలు సొంతమవుతాయని ఐక్యత ఫౌండేషన్ చైర్మన్ టాస్క్ సిఓఓ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి అన్నారు.ఆమనగల్లు పట్టణ కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు కాలే మల్లయ్య కుమారుడు నూతనంగా ఏర్పాటు చేసిన MR.JAGGERY టీ పాయింట్ ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా రాఘవేందర్ రెడ్డి మాట్లాడుతూ ప్రస్తుత కాలంలో యువత ఉద్యోగాల కోసం ఎదురు చూడకుండా,స్వయం ఉపాధి మార్గాన్ని ఎంచుకుని వ్యాపారాన్ని ప్రారంభించడం అభిందనీయమని,చిన్న స్థాయి వ్యాపారాలు కూడా ఆత్మవిశ్వాసంతో చేస్తే పెద్ద స్థాయిలో విజయాలకు నాంది అవుతాయని,యువత స్వయంగా ఉపాధి అవకాశాలు వెతుక్కుని ముందుకు సాగితేనే వారి భవిష్యత్ ఉజ్వలంగా ఉంటుందన్నారు ఉద్యోగ అన్వేషణతో పాటు స్వయం మార్గాలను కూడా యువత దృష్టిలో ఉంచుకొని వారి కెరీర్ని నిర్మించుకోవాలన్నారు.ఈ కార్యక్రమంలో పాటు మాజీ మండల అధ్యక్షులు మండ్లి రాములు,సీనియర్ నాయకులు మల్లేష్ నాయక్,కొండల్ యాదవ్,గుండ్రాతి కుమార్ గౌడ్ లతో పాటు తదితరులు పాల్గొన్నారు.

## కరచాలనం వద్దు నమస్కారమే శ్రేయస్కరం

ఎవరికీ షేక్ హ్యాండ్స్ ఇవ్వొద్దు.. తెలంగాణ ప్రభుత్వం సంచలన హెచ్చరిక

**వరంగల్ మహా;** తెలంగాణలో రానున్న ఐదు రోజులపాటు భారీ వర్షాలు ఉన్నాయని ఇప్పటికే వాతావరణ శాఖ హెచ్చరించింది. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆదేశాలు జారీ చేసింది. ఇంటి ఆవరణలో నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపింది. దోమల వ్యాప్తి నివారణకు ఇంట్లోని తలుపులు, కిటికీలను దోమ తెరలతో కప్పి వేయాలని సూచించింది. దోమల ద్వారా వ్యాప్తి చెందే డెంగ్యూ, మలేరియా వంటి వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని తెలిపింది. ఆహారం, నీటి విషయంలోనూ ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని వైద్య శాఖ పేర్కొంది. రాష్ట్రంలో రానున్న ఐదు రోజుల పాటు భారీ వర్షాలు కురిసే ప్రమాదం ఉందని ఇప్పటికే వాతావరణ శాఖ ఆదేశాలు జారీ చేసిన నేపథ్యంలో తెలంగాణ వైద్య ఆరోగ్య శాఖ కీలక హెచ్చరికలు జారీ చేసింది. దోమల వ్యాప్తి నివారణకు ఇంట్లోని తలుపులు, కిటికీలను దోమ తెరలతో కప్పి వేయాలని సూచించింది. దోమల ద్వారా వ్యాప్తి చెందే డెంగ్యూ, మలేరియా వంటి వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని తెలిపింది. ఆహారం, నీటి విషయంలోనూ ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని వైద్య శాఖ పేర్కొంది. కాచి చల్లార్చిన నీటినే తాగాలని, పరిశుభ్రమైన ఆహారం తీసుకోవాలని సూచించింది. జలుబు, దగ్గు, జ్వరం లక్షణాలు కనిపిస్తే వెంటనే దగ్గర్లో ఉన్న వైద్యుడిని సంప్రదించాలని ఆరోగ్యశాఖ సూచించింది. ముఖ్యంగా దోమల వ్యాప్తి నివారణకు తగు జాగ్రత్తలు తీసుకోవాలని పేర్కొంది. దోమల కారణంగా డెంగ్యూ, మలేరియా వంటి వ్యాధులు సంక్రమిస్తాయని వైద్య శాఖ పేర్కొంది. ఇంటి పరిసరాల్లోని సెప్టిక్ ట్యాంకులు, ఇతర నీరు నిల్వ ఉండే ప్రదేశాల్లో దోమలు సంతానోత్పత్తి చేసే అవకాశం ఉన్న నేపథ్యంలో ఆయా ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచాలని సూచించింది. వర్షాకాలంలో సాధారణంగా ప్రజలు జలుబు, జ్వరం, దగ్గు వంటి లక్షణాలు ఇబ్బందులు పడుతుంటారని ఒక్కోసారి ఇవి తీవ్రమైన అంటువ్యాధుల లక్షణాలు కూడా మారొచ్చునని ఇందుకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పేర్కొంది. అలాగే వ్యక్తిగత పరిశుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని పేర్కొంది. బయటి వ్యక్తులతో కరచాలనం (హ్యాండ్ షేక్) వీలైనంతవరకు తగ్గించాలని శానిటైజర్ తో చేతులను పరిశుభ్రంగా ఉంచుకోవాలని వైద్యారోగ్య శాఖ సూచనలు చేసింది.

## ప్రిన్సిపల్ సెక్రెటరీ కి జ్ఞాపికను బహుకరించిన ఎర్రబెల్లి ప్రదీప్ రావు

**వరంగల్ మహా;** వరంగల్ నగరానికి విచ్చేసిన మధ్యప్రదేశ్ రాష్ట్ర ప్రిన్సిపల్ సెక్రెటరీ పరికిపండ్ల నరహరి ఐఏఎస్ ఆదివారం మాజీ ఎమ్మెల్యే ఆరూరి రమేష్ నివాసానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా బిజెపి రాష్ట్ర నాయకులు వరంగల్ అర్బన్ కోఆపరేటివ్ బ్యాంక్ చైర్మన్ ఎర్రబెల్లి ప్రదీప్ రావు వారిని మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి జ్ఞాపికను బహుకరించారు. వీరితోపాటు బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వన్నాల వెంకటరమణ, బిజెపి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## యువత స్వయం ఉపాధిని ఎంచుకోవాలి:ఎమ్మెల్యే



**ఆమనగల్లు, మహా:** నిరుద్యోగ యువత ప్రభుత్వ ఉద్యోగాల కొరకు ఎదురు చూడకుండ తమకు నైపుణ్యత కలిగిన స్వయం ఉపాధిరంగంలో రాణించి మరో పదిమందికి ఉపాధినివ్వాలని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి సూచించారు. ఆమనగల్లు మున్సిపాలిటీకి చెందిన కాంగ్రెస్ నాయకులు కాలే మల్లయ్య కుమారుడు నూతనంగా ఏర్పాటుచేసిన మిస్టర్ జంజర్ టి పాయింట్ ను ఆదివారం ఎమ్మెల్యే లాంఛనంగా రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా స్వయం ఉపాధిని ఎంచుకొన్న కాలే మల్లయ్య కుమారుడిని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అభినందించారు. ఈ కార్యక్రమంలో... అమనగల్లు కాంగ్రెస్ నాయకులు మానయ్య జగన్,మండ్లి రాములు,కృష్ణ నాయక్,ఫరీద్, ప్రసాద్,కొండల్ రెడ్డి,శ్రీనివాస్ రెడ్డి ,విజయ్ రాథోడ్,సురేష్ నాయక్,గుర్రంకేశవులు, మెకానిక్ బాబా, సురేందర్ రెడ్డి,వెంకటేశ్వరరావు,శీను నాయక్,బద్ది వెంకటేష్, శ్రీశైలం పాల్గొన్నారు.

# నేడు నీటి సరఫరా బంద్

లీకేజీ పైప్‌లైన్ కు కొనసాగుతున్న మరమత్తు పనులు

**వరంగల్ మహా ;** వరంగల్ నగరంలోని పోతన నగర్ ప్రాంతం లో పైప్‌లైన్‌కు లీకేజీ మరమత్తు పనులు కొనసాగుతున్నందున దేశాయిపేట ఫిల్టర్ బెడ్ పరిధి లోని పలు ప్రాంతాల్లో నేడు నీటి సరఫరా ను నిలిపి వేస్తున్నట్లు బల్దియా ఈ ఈ శ్రీ రామోజు శ్రీనివాస్ నేడోక ప్రకటన లో తెలిపారు.ఈ కారణం గా ఫిల్టర్ బెడ్ పరిధి లోని ప్రాంతాలైన కొత్తవాడ,రంగంపేట,శ్రీనివాస కాలనీ, పోతన నగర్, రాజీవ్ కాలనీ, పాపయ్య పేట, రామన్నపేట, తీగల గుట్ట, గాయత్రి కాలనీ, వాసవి కాలనీ,దుర్గాదేవి కాలనీ దత్త క్షేత్రం ప్రాంతం, రఘునాథ కాలనీ, ఓ.ఎస్ నగర్, పొరక్ మహేశా,షేర్ పుర,ఎల్లంబజార్, బీట్ బజార్ ప్రాంతాల్లో ఒక రోజు (సోమవారం) నీటి సరఫరా జరగదని అట్టి ప్రాంత వాసులు గమనించి సహకరించాలని విజ్ఞప్తి చేశారు.



# చిటికెలో సినిమా.. ఫోన్‌తోనే!

స్మార్ట్ ఫోన్ ఉందా? ఈ లెన్స్ తగిలించండి. మీ రూమ్ ఒక సెట్, మీరే డైరెక్టర్! ఆశ్చర్యపోతున్నారా! నిజం, ఈ చిన్న 1.33 ఎక్స్ అనామార్ఫిక్ లెన్స్ సాయంతో, మీ స్మార్ట్‌ఫోన్‌తోనే సినిమా తీయొచ్చు. పెద్ద కెమెరాలు, లైట్లు, సెటప్‌లు ఏవీ అవసరం లేదు. బెడ్‌రూమ్, హాల్, టెర్రస్... ఎక్కడైనా సినిమా లెవెల్ షాట్ తీయవచ్చు. ఇది రెండు రకాల లైటింగ్ ఎఫెక్ట్స్‌తో పనిచేస్తుంది. అందులో బ్లూ ఫ్లేర్ పెడితే ఇంట్లోనే స్పేస్ సినిమా ఫీల్, గోల్డ్ ఫ్లేర్ పెడితే శ్రావణ మాసం గుడిలో వచ్చే డివోషనల్ ఫీల్ కనిపిస్తుంది. ఒక్కసారి ఇది తీసిన వీడియో చూస్తూ 'ఇది నిజంగా ఫోన్‌తో తీయగలరా?' అని అశ్చర్యపోతారు. ఒక్కసారి వాడాక, మామూలు కెమెరా తెరవాలని కూడా అనిపించదు. ఇంకా ప్రత్యేకంగా డబ్బింగ్ చేయాల్సిన అవసరం లేదు. వీడియోలో సౌండ్ కూడా అద్భుతంగా రికార్డ్ అవుతుంది. ధర రూ.13,999 మాత్రమే!

**జేబులో దీపావళి!**

చుట్టూ చీకటి ఉన్నా, మీ ఇల్లు దీపావళి నాటి ఆకాశంలా మెరవాలంటే, మీ దగ్గర ఈ 'డిజి టెక్ పోర్టబుల్ ఎల్ఈడీ లైట్' ఉండాల్సిందే! చేతిలో పట్టేంత చిన్నదే, కాని ఆన్ చేస్తే మాత్రం మీ ముఖం, చుట్టూ ఉన్న వాతావరణం అంతా బ్రైట్‌గా మెరిసిపోతుంది. ఈ లైట్ సుమారు మూడు వేల నుంచి ఆరువేల కెల్విన్ వరకు వెలుతురును అందిస్తుంది. లైట్ బ్రైట్‌నెస్, రంగులను అవసరానికి అనుగుణంగా మార్చుకోవచ్చు. అలా చిత్రీకరణకు కావాల్సిన వాతావరణాన్ని సులభంగా సృష్టించవచ్చు. ఒక్కసారి చార్జ్ చేస్తే, నిర్విరామంగా సుమారు రెండు గంటలపాటు పని చేస్తుంది. ధర కేవలం రూ.1,299 మాత్రమే!

**స్టూడియో బాక్స్!**

చిన్న వస్తువులను ఫొటో తీయడం అంటే, 'ప్యాన్ ఇండియా' సినిమా తీసినంత ఈజీ కాదు. హోల్ లైట్, టేబుల్, షీట్, లో ఫ్యాన్ ... ఇలా చాలానే ప్లానింగ్ చేసి తీయాలి. అయితే, ఇప్పుడు ఈ హిఫిన్ ఫోల్డబుల్ లైట్ బాక్స్ ఉంటే చాలు, ఇంట్లోనే ఓ చిన్న సినిమాటిక్ ఫొటో స్టూడియో సెట్ రెడీ అవుతుంది. చూసేందుకు క్యూబ్‌లా ఉంటుంది. కాని, ఒక్కసారి తెరిస్తే, అంతా మాయలా మారిపోతుంది. ఫుల్ బ్రైట్ ఎల్ఈడీ లైట్లు మెరిసిపోతాయి. వాడటం కూడా చాలా సులభం- యూఎస్‌బీకి పెట్టండి, ఎంత చిన్నవస్తువునైనా మధ్యలో పెట్టండి, ఫోటో తీయండి... అంతే! పైగా ఈ బాక్స్‌ను మడిచి పెట్టుకోవచ్చు, ఎక్కడికైనా తేలికగా తీసుకెళ్లవచ్చు. ఇందులో పెట్టి ఫొటో తీస్తే తెలుపు, నలుపు రంగుల బ్యాక్‌డ్రాప్‌లతో ఫొటోలకు పూర్తిగా ప్రొఫెషనల్ టచ్ ఇస్తుంది. ధర రూ.499 మాత్రమే!

**తిరిగే ఎలక్ట్రిక్ స్టాండ్!**

వస్తువుల ఫొటో తీయాలంటే చేతితో తిప్పుతూ తిప్పుతూ మీ తల తిరగాల్సిన అవసరం లేదు. ఒక్కసారి ఈ తిరిగే ఎలక్ట్రిక్ స్టాండ్‌పై వస్తువును పెట్టి ఫొటో తీయండి. మెల్లగా 360 డిగ్రీలుగా తిరుగుతూ, ఏ కోణంలో చూసినా వస్తువును అందంగా చూపిస్తుంది. కావాల్సిన రీతిలో వస్తువు యాంగిల్, దిశ, వేగాన్ని సులభంగా నియంత్రించవచ్చు. ఇది బంగారు వస్తువులు, గడియారాలు, చిన్న కేకులు, ప్రదర్శన వస్తువుల ఫొటోగ్రఫీకి అద్భుతంగా ఉపయోగపడుతుంది. సుమారు ఎనిమిది కిలోల బరువు వరకు కోరుకున్న దిశలో తిప్పగలదు. దీనిని ఉపయోగించడం చాలా సులువు. ధర రూ. 1,699 మాత్రమే!

# రోజూ 2జీబీ హైస్పీడ్ డేటాతో జియో కొత్త ప్లాన్

ప్రముఖ ప్రైవేట్ టెలికాం ఆపరేటర్ రిలయన్స్ జియో రోజూ 2జీబీ హైస్పీడ్ డేటాతో రూ .1049 ప్రత్యేక ప్రీపెయిడ్ ప్లాన్‌ను ప్రవేశపెట్టింది. రోజువారీ హైస్పీడ్ డేటా, అపరిమిత కాలింగ్, టాప్ ఓటీటీ ప్లాట్‌ఫామ్‌లకు ఉచిత యాక్సెస్ అందించే ప్రీపెయిడ్ ప్లాన్ కోసం చూస్తున్నట్లయితే ఈ జియో ప్లాన్ మీకు సరిగ్గా సరిపోతుంది. ఈ ప్లాన్ ప్రయోజనాలేంటో ఇక్కడ వివరంగా తెలుసుకోండి..

**ప్లాన్ వాలిడిటీ.. ప్రధాన ప్రయోజనాలు**

ఈ రూ .1049 జియో ప్లాన్ మొత్తం 84 రోజులు చెల్లుబాటు అవుతుంది. ఇందులో ప్రతిరోజూ 2 జీబీ హైస్పీడ్ డేటా లభిస్తుంది. అంటే మొత్తం 84 రోజుల్లో మొత్తం 168 జిబి డేటా ఆనందించవచ్చు. దీంతోపాటు అపరిమిత వాయిస్ కాలింగ్, రోజుకు 100 ఎస్ఎంఎస్‌లు కూడా లభిస్తాయి. ఈ ప్లాన్ అతిపెద్ద ఫీచర్ ఇది అందించే ఉచిత ఓటీటీ యాక్సెస్. వినియోగదారులు ఎటువంటి అదనపు రుసుము చెల్లించకుండా అనేక ప్రసిద్ధ స్ట్రీమింగ్ సర్వీసులకు యాక్సెస్ పొందుతారు. వీటిలో అమెజాన్ ప్రైమ్ లైట్ (84 రోజులు చెల్లుబాటు అవుతుంది), సోనీలివ్, జీ5, జియోటీవీ, జియో హాట్‌స్టార్ (90 రోజులు, ఒకసారి చెల్లుబాటు అవుతుంది) వంటివి ఉన్నాయి. ఈ రీఛార్జ్ ప్లాన్ 50 జీబీ జియోఏఐక్లౌడ్ స్టోరేజ్, ఉచిత 5జీ డేటా (5జీ ఫోన్ అయి ఉండి 5జీ నెట్‌వర్క్ అందుబాటులో ఉంటే మాత్రమే) వంటి జియో నుండి కొన్ని ఇతర ప్రత్యేక ప్రయోజనాలను కూడా అందిస్తుంది.




# మీ పాన్‌కార్డుతో ఎవరైనా లోన్ తీసుకున్నారేమో..

కొందరికి అప్పు అంటే మహా చెడ్డ భయం. దాని జోలికి కూడా వెళ్లరు. మీరు తీసుకోరు సరే.. మరి ఎవరైనా మీ పేరుతో అదేనండి మీకు తెలియకుండా మీ పాన్ కార్డు వివరాలతో లోన్ తీసుకుని ఉంటే.. అమ్మో ఇది ఫ్రాడ్. అవును ఫ్రాడే మరి. డౌట్‌గా ఉందా? మీ పాన్ కార్డును ఎవరైనా దుర్వినియోగం చేశారేమో తెలుసుకోవాలనుకుంటున్నారా? ఎలాగో ఈ కథనంలో చదివేయండి వెంటనే..

రుణ మోసాలు, సున్నితమైన, ఆర్థికపరమైన డాక్యుమెంట్ల దుర్వినియోగం వంటివి ఇటీవల ఎక్కువయ్యాయి. ఈ క్రమంలో మీ కార్డులేమైనా దుర్వినియోగానికి గురయ్యాయా అని తెలుసుకోవాల్సిన అవసరం ఉంది. ఎందుకంటే మీ పాన్ కార్డు మీ క్రెడిట్ రిపోర్ట్ తో లింక్ అయి ఉంటుంది. దానిని ఉపయోగించి తీసుకున్న ఏదైనా రుణం (మీ సమ్మతితో లేదా సమ్మతి లేకుండా) మీ క్రెడిట్ రేటింగ్, మీ రుణ సామర్థ్యంపై ప్రభావం చూపుతుంది. కాబట్టి మీ పాన్ కార్డు దుర్వినియోగం అయ్యిందో లేదో తెలుసుకోండిలా..

**మీ క్రెడిట్ రిపోర్టును క్రమం తప్పకుండా చెక్ చేయండి**

మీ పాన్ కార్డును ఉపయోగించి ఏదైనా రుణం తీసుకున్నారో లేదో తెలుసుకోవడానికి సులభమైన మార్గం మీ క్రెడిట్ రిపోర్ట్ చూడటం. సిబిల్, ఎక్స్ పీరియన్, ఈక్విఫాక్స్, సీఆర్ఐఎఫ్ హై మార్క్ వంటి క్రెడిట్ బ్యూరోలు మీ పేరిట తీసుకున్న అన్ని రుణాలు, క్రెడిట్ కార్డుల రికార్డును నిర్వహిస్తాయి. ఆయా సైట్లకు వెళ్లి మీ పాన్, మొబైల్ నంబరు ఇచ్చి క్రెడిట్ రిపోర్ట్ తీసుకోవచ్చు. అది కూడా ఉచితంగా.

**మీ క్రెడిట్ రిపోర్టులో ఇవి గమనించండి**

మీరు క్రెడిట్ రిపోర్టును సమీక్షిస్తున్నప్పుడు, మీరు దరఖాస్తు చేయని రుణాలు లేదా క్రెడిట్ కార్డులు, తప్పు ఖాతా నంబర్లు, పరిచయం లేని రుణ సంస్థల పేర్లు లేదా మీరు ఆమోదించని కొత్త హార్డ్ ఎంక్వైరీలు ఏమైనా ఉన్నాయేమో చూడండి. మీ పాన్ కార్డును ఎవరైనా దుర్వినియోగం చేశారనడానికి ఇవి సంకేతాలు. మీరు ఇటువంటి అనేక ఎంట్రీలను చూసినట్లయితే, మీ క్రెడిట్ మరింత క్షీణించకుండా వెంటనే చర్యలు తీసుకోండి.




**ఫేక్ లోన్ బయటపడితే ఏం చేయాలి?**

మీరు మోసపూరిత రుణాన్ని ఎదుర్కొన్నట్లయితే, దానిని రుణ సంస్థ దృష్టికి తీసుకురండి. అలాగే దానిని నివేదించిన క్రెడిట్ బ్యూరోతో చర్చించండి. చాలా వివాదాలను క్రెడిట్ బ్యూరోలు ఆన్‌లైన్లో దాఖలు చేయవచ్చు. ఐడీ ప్రూఫ్, లోన్‌కు సంబంధించిన వాస్తవాలు, సంతకం చేసిన అఫిడవిట్ ఇవ్వాల్సి ఉంటుంది. అదనంగా, మీ స్థానిక పోలీసు సైబర్ క్రైమ్ సెల్లో ఫిర్యాదు చేయండి. పాన్ దుర్వినియోగం అయినట్లు ఆధారాలను సమర్పించండి.

అసురక్షిత సైట్లు, యాప్‌లు లేదా వాట్సాప్ ఫార్వార్డ్‌లలో మీ పాన్ కార్డు నంబర్‌ను ఎప్పుడూ పంచుకోవద్దు. బహిరంగంగా షేర్ చేయడం, అనవసరంగా ఎవరికైనా అప్పగించడం చేయొద్దు. మీ పాన్ కార్డు పోతే, రీప్రింట్ కోసం దరఖాస్తు చేయండి. ఆ సమయంలో కొన్ని నెలలు మీ క్రెడిట్ రిపోర్ట్‌ను సమీక్షించండి. ఫైనాన్షియల్ అకౌంట్లకు బలమైన పాస్ వర్డ్ లను సెట్ చేసుకోండి. మీ పాన్ తో లింక్ చేసిన లోన్ లేదా క్రెడిట్ అప్లికేషన్ ల కోసం ఎస్ఎంఎస్/ఈమెయిల్ నోటిఫికేషన్ లను ఎనేబుల్ చేయండి.

# బిజినెస్ స్కూల్లో ఓరియంటేషన్ ప్రోగ్రామ్



**హైదరాబాద్:** అశోక స్కూల్ ఆఫ్ బిజినెస్ క్యాంపస్‌లో ఓరియంటేషన్ ప్రోగ్రామ్ అత్యంత సందడిగా జరిగింది. పీజీడీఎం 2025-27 బ్యాచ్‌కు స్వాగతం పలుకుతూ ఈ కార్యక్రమం సాగింది. అశోక స్కూల్ ఆఫ్ బిజినెస్ డైరెక్టర్ డాక్టర్ వై లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ ఆసక్తి, నైతికత, అభ్యాసం వంటి గుణాలను అలవర్చుకోవాలని విద్యార్థులను కోరారు. అశోక స్కూల్ ఆఫ్ బిజినెస్ వివిధ సంస్థలతో వ్యూహాత్మక ఒప్పందాలు చేసుకుంది. అవగాహన ఒప్పందాలు చేసుకున్న సంస్థలు డిప్లమేటిక్ క్లబ్, మీస్కూల్, ట్రిగునిటా ఎడ్టెక్, ఏఐఈఎస్ఈసీ ఉన్నాయి. ఇవి విద్యార్థులకు సాంస్కృతిక మార్పిడి, ప్రయోగాత్మక స్టార్టప్ అనుభవం, సృజనాత్మక వృత్తి మార్గాల తలుపులు తెరవనున్నాయి. ఈ సందర్భంగా అశోక్ స్కూల్ ఆఫ్ బిజినెస్ అకడమిక్ హ్యాండ్‌బుక్, అరోహన్ 2025 పేరుతో 30 రోజుల ఓరియంటేషన్ ప్రోగ్రామ్‌ను ప్రారంభించారు. ఏహబ్ యాక్టివిటీలను డాక్టర్ సబిత (సీఐఓ) పరిచయం చేశారు. టీమ్ పరిచయాన్ని డీన్ డాక్టర్ స్వాతి చేశారు. ఈ కార్యక్రమంలో చైర్మన్ అశోక్ నొముల తదితరులు పాల్గొన్నారు.



## దేశం-విదేశం NATIONAL-INTERNATIONAL





# సౌదీ స్లీపింగ్ ప్రిన్స్ కన్నుమూత

సౌదీ అరేబియా ప్రిన్స్ అల్‌వలీద్ బిన్ ఖలెద్(36) ఇక లేరు. గత 20 ఏళ్లుగా కోమాలో ఉన్న ఆయన.. శనివారం కన్నుమూశారు. ఈ కారణంగానే సౌదీ అరేబియా స్లీపింగ్ ప్రిన్స్‌గా ఈయనకంటూ ఓ పేరు ముద్రపడిపోయింది. ప్రిన్స్ అల్‌వలీద్ బిన్ ఖలెద్ సౌదీ అరేబియా రాజ కుటుంబానికి చెందినవారు. ఆయన ప్రిన్స్ ఖలెద్ బిన్ తలాల్ అల్ సౌద్ పెద్ద కుమారుడు. 2005లో లండన్‌లోని మిలిటరీ అకాడమీలో చదువుకుంటున్న టైంలో ఖలెద్ కారు ప్రమాదంలో గాయపడ్డాడు. మెదడులో రక్తస్రావం జరిగి.. వెంటిలేటర్‌పై కోమాలో ఉంటూ ఓ ప్రముఖ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఖలెద్ కోసం అమెరికా, స్పెయిన్ నుండి నిపుణులు కూడా చికిత్స అందించారు. అయినప్పటికీ ఫలితం లేకుండా పోయింది. జూలై 20న రియాద్‌లో అంత్యక్రియలు నిర్వహించే అవకాశం ఉంది.

# పాక్‌లో వర్ష బీభత్సం.. 200 మంది మృతి

**ఇస్లామాబాద్:** పొరుగుదేశం పాకిస్తాన్‌లో వర్ష బీభత్సం కొనసాగుతోంది. వర్షాకాలంలో ముఖ్యంగా జూన్ నుండి సెప్టెంబర్ మధ్యకాలంలో పాక్‌లో భారీ వరదలు సంభవిస్తుంటాయి. ఫలితంగా కొండచరియలు విరిగి పడుతూ, అపారనష్టం వాటిల్లుతుంటుంది.ఇటువంటి విపత్తుల కారణంగా ఇటీవలి కాలంలో 100 మంది పిల్లలతో సహా 200 మందికి పైగా జనం ప్రాణాలను కోల్పోయారని, 500 మందికి పైగా జనం గాయపడ్డారని పాకిస్తాన్ జాతీయ విపత్తు నిర్వహణ అథారిటీ (ఎన్ఎండీఏ) తెలిపింది. అధికారిక డేటా ప్రకారం పాకిస్తాన్‌లోని పంజాబ్ ప్రావిన్స్ అత్యధికంగా 123 మంది మృత్యువాత పడ్డారు. అలాగే ఖైబర్ పఖ్తుంఖ్వాలో 40, సింధ్‌లో 21, బలూచిస్తాన్‌లో 16,ఇస్లామాబాద్, పాకిస్తాన్ ఆక్రమిత జమ్ముకశ్మీర్‌లో ఒక్కొక్కరు చొప్పున మృతి చెందారు. ఫైసలాబాద్‌లో వర్షాల కారణంగా గణనీయమైన నష్టం వాటిల్లింది. రెండు రోజుల్లో చోటుచేసుకున్న 33 ఘటనలలో 11 మంది మృతి చెందారు. 450 మి.మీ కంటే అధిక వర్షపాతం నమోదైన చక్వాల్‌లో 32 రోడ్లు కొట్టుకుపోయాయి. మౌలిక సదుపాయాల నష్టంతో పాటు, కమ్యూనికేషన్ సంబంధాలు తెగిపోయాయి. అనేక ప్రాంతాలలో విద్యుత్ సరఫరా పునరుద్ధరణ జరగలేదు.



# కుటుంబాన్ని బలిగొన్న రూ. ఐదువేల ఈఎంఐ?

గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో హృదయవిదారక ఘటన చోటుచేసుకుంది. శనివారం (జూలై 19) రాత్రి బాగోద్ర గ్రామంలో ఒకే కుటుంబానికి ఐదుగురు ఆత్మహత్య చేసుకున్నారు. అద్దె ఇంట్లో నివసిస్తున్న వీరు విషం తాగారనే అనుమానాలున్నాయి. మృతుల్లో భర్త, భార్య వారి ముగ్గురు పిల్లలు ఉన్నారు. సంఘటనా స్థలంలో ఎటువంటి సూసైడ్ నోట్ లభ్యం కాలేదు. కుటుంబసభ్యులు ఆత్మహత్య చేసుకునేందుకు దారితీసిన కారణాలను తెలుసుకునేందుకు పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. మృతులను విపుల్ కాంజి వాఘేలా (34), అతని భార్య సోనాల్ (26), వారి ఇద్దరు ఆడపిల్లలు, ఒక మగపిల్లవానిగా పోలీసులు గుర్తించారు. వీరి కుటుంబం మొదట గుజరాత్‌లోని ధోల్కాలో ఉండేది. విపుల్ వాఘేలా ఆటో రిక్షా నడుపుతూ కుటుంబాన్ని పోషిస్తూ వస్తున్నాడు. ఈ ఘటనకు సంబంధించిన సమాచారం అందిన వెంటనే, బాగోద్ర పోలీసులు, 108 అంబులెన్స్ బృందం, అహ్మదాబాద్ రూరల్ ఎస్పీ తదితరులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. ఆర్థిక ఒత్తిడి కారణంగానే కాంజి వాఘేలా కుటుంబం



ఆత్మహత్యకు పాల్పడివుండవచ్చని పోలీసులు భావిస్తున్నారు. విపుల్ బావమరిది ఈ ఘటన గురించి మాట్లాడుతూ విపుల్ రుణం తీసుకుని ఆటోరిక్షాను కొనుగోలు చేశాడని, ప్రతీనెలా రూ. ఐదువేల ఈఎంఐ కట్టలేక ఇబ్బంది పడుతున్నాడని తెలిపారు. ఆ భారమే అతన్ని ఆత్మహత్యకు పురిగొల్పి ఉండవచ్చని అన్నారు. కాగా ఈ ఐదు మృతదేహాలను పోలీసులు పోస్ట్‌మార్టం కోసం బాగోద్ర కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు తరలించారు. దర్యాప్తులో భాగంగా పోలీసులు విపుల్ బంధువులను, పొరుగవారిని, పరిచయస్తులను విచారిస్తున్నారు.

# కిస్ కిస్ కిస్సిక్.. కొంపముంచిన కోల్డ్‌ప్లే

ప్రముఖ మ్యూజిక్ కాన్సర్ట్ 'కోల్డ్ ప్లే' ఆ కంపెనీ సీఈవో కొంపముంచింది. తన సహోద్యోగినితో సన్నిహితంగా మెలుగుతూ.. ముద్దు పెట్టుకొన్న వీడియో వైరల్ కావడం తెలిసిందే. ఈ ఎపిసోడ్ ఇప్పుడు కీలక మలుపు తిరిగింది. ఆయన ఏకంగా తన పదవికి రాజీనామా చేయాల్సి వచ్చింది. మరోవైపు.. నాలుగు రోజుల తర్వాత కూడా ఆ వీడియో విపరీతంగా నెట్టింట చక్కర్లు కొడుతోంది. దీంతో ప్రముఖ కంపెనీలు సైతం తమ ప్రచారాలకు ఆ వీడియోను వాడేసుకుంటున్నాయి. ఆస్ట్రానమర్ సీఈవో ఆండీ బైరోన్ తన ఉద్యోగానికి రాజీనామా చేశారు. తాను కంపెనీ వీడుతున్నట్లు శనివారం ఆయన ప్రకటించారు. ఆ కంపెనీలో హెచ్ఆర్ డిపార్ట్‌మెంట్‌లో చీఫ్ పీపుల్ ఆఫీసర్ క్రిస్టిన్ క్యాబెట్‌ను కౌగలించుకుని.. ముద్దాడుతున్న వీడియో ఒకటి వైరల్ అయిన సంగతి తెలిసిందే. బుధవారం మాసెచూసెట్స్ స్టేట్ బోస్టన్‌లోని గిల్లెట్ స్టేడియంలో జరిగిన కోల్డ్ ప్లే కాన్సర్ట్‌లో వీళ్లిద్దరి ఇలా కెమెరా కంటపడ్డారు. ఆ వెంటనే నాలుక్కరుచుకొని ఇద్దరు విడిపోయి దాక్కొన్నారు. దీంతో కోల్డ్‌ప్లే క్రిస్ మార్టిన్ ''వారు అఫైర్‌లో అయినా ఉండి ఉండాలి.. లేదా సిగ్గుతో దాక్కొని ఉండాలి'' అంటూ కామెంట్ చేయడంతో అది మరింత వైరల్ అయ్యింది. మరోవైపు.. ఈ వ్యవహారం కంపెనీకి తలవంపులుగా



మారింది. దీంతో సీఈవో ఆండీ బైరోన్‌ను సస్పెండ్ చేస్తున్నట్లు కంపెనీ సామాజిక మాధ్యమం ఎక్స్‌లో ప్రకటించింది. ఈ విషయం వైరల్ కావడంతో ఆస్ట్రానమర్ కంపెనీ అంతర్గత దర్యాప్తు చేపట్టింది. ఈ క్రమంలో ఆండీ తన పదవికి రాజీనామా చేసినట్లు తెలుస్తోంది. ఈ విషయాన్ని లింక్డిన్‌లో ఆ కంపెనీ ఒక పోస్టు ద్వారా తెలియజేసింది. ''మా కంపెనీ లీడర్లు నడవడిక, బాధ్యత విషయంలో అత్యున్నత స్థాయి ప్రమాణాలు పాటిస్తారని ఆశిస్తాం. ఇటీవల ఆ స్థాయి ప్రమాణాలను నిలబెట్టుకోలేదు. ఆండీ తన రాజీనామా సమర్పించారు. దీనిని బోర్డ్‌ఆఫ్ డైరెక్టర్స్ ఆమోదించారు'' అని కంపెనీ ఓ ప్రకటనలో పేర్కొంది. ఆస్ట్రానమర్ అనేది న్యూయార్క్ కేంద్రంగా నడుస్తున్న ఒక టెక్నాలజీ కంపెనీ. క్రిస్ట్రిన్ క్యాబెట్‌కు గతంలో వివాహం.. విడాకులు అయ్యాయి. ఆండీ బైరోన్‌కు వివాహం అయ్యింది. ఆయన భార్య మేగన్ కెరిగన్ బైరోన్.. ఓ ప్రముఖ విద్యాసంస్థకు అసోషియేట్ డైరెక్టర్‌గా పని చేస్తున్నారు. ఈ జంటకు ఇద్దరు పిల్లలు. అయితే ఆండీ వీడియో వైరల్ కావడంతో ఆ కాపురంలోనూ కలతలు చెలరేగినట్లు కథనాలు వెలువడుతున్నాయి.

## రష్యాలో భారీ భూకంపం..
# సునామీ హెచ్చరికలు

రష్యా తీరంలో భారీ భూకంపం సంభవించింది. ప్రకంపనల తీవ్రత రిక్టర్ స్కేల్‌పై 7.4గా నమోదైంది. రష్యాలోని కమ్చట్కా ద్వీపకల్పంతో పాటు హవాయిలోని కొన్ని ప్రాంతాలకు పసిఫిక్ సునామీ హెచ్చరికల కేంద్రం సునామీ హెచ్చరికలను జారీ చేసింది. అయితే ఇప్పటివరకు ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టానికి సంబంధించిన వివరాలు తెలియరాలేదు. ముందు జాగ్రత్తగా పౌరులు సురక్షిత ప్రాంతాలకు తరలివెళ్లాలని అధికారులు అప్రమత్తం చేశారు. పెట్రోపావ్లోవ్స్కకామ్చాట్కా నగరానికి తూర్పున 143 కిలోమీటర్ల దూరంలో పసిఫిక్ మహా సముద్రంలో భూకంప కేంద్రం ఉన్నట్లు అధికారులు గుర్తించారు. దీనికి ముందు దాదాపు గంట సమయంలోనే ఈ ప్రాంతంలో ఐదు భూకంపాలు నమోదైనట్లు యూఎస్‌జీఎస్ తెలిపింది. ఈ భారీ భూకంపాలు.. స్థానిక కాలమానం ప్రకారం మధ్యాహ్నం 3:28 నుంచి 3:49 గంటల మధ్య సంభవించాయి. ఈ భూకంపాల కారణంగా కొన్ని భవనాలు దెబ్బతిన్నాయని, అయితే ప్రాణ నష్టం గురించి ఇప్పటి వరకు స్పష్టమైన సమాచారం వెల్లడికాలేదు. ఈ భూకంపం వల్ల సునామీ వచ్చే అవకాశం ఉన్నట్లు అధికారులు హెచ్చరించారు.

# చచ్చేలా కొట్టి.. మూత్రం తాగించి..



**ముంబై:** మూత్రం తాగితే.. దీర్ఘకాలిక అనారోగ్య సమస్యలు పోతాయి. షూతో మొహ పగలగొడితే కలిసొస్తుంది. చెట్లు ఆకులు తింటే కోరుకున్న సంస్థలో కోరుకున్నంత జీతం. ఇలా ఒకటేమిటి.. నేను చెప్పిన పని చేస్తే.. ఇక మీ జీవితంలో తిరుగుతుండదంటూ బాబా ప్రచారం.. అమాయకుల పట్ల అమానుషంగా ప్రవర్తిస్తున్న తీరు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. మహరాష్ట్రలోని ఛత్రపతి శంభాజినగర్ జిల్లా శివూర్ గ్రామంలో బాబా,అఘోరీ బాబా అలియాస్ సంజయ్ పాగారే అమాయకులైన గ్రామస్తులపై దారుణానికి ఒడిగట్టాడు. ఇప్పటికే జిల్లాలోని తనని నమ్మిన వారికి ఆయురారోగ్యాలు, అష్టఐశ్వర్యాలు ప్రసాదించానని, మీకు కూడా అలాగే స్వాంతన చేకూర్చుతానంటూ గ్రామంలో తిష్టవేశాడు. పలు సమస్యలతో బాధపడుతున్న గ్రామస్తులకు తన మూత్రం తాగితే అనారోగ్య సమస్యలు తీరుతాయని నమ్మించాడు. దీంతో మోసపోయిన బాధితులు అతని మూత్రం తాగాల్సి వచ్చింది. అంతే కాదు ,మహిళలు,పురుషుల్ని దండలతో దండించాడు. షూతో మొహం మీద దాడి చేశాడు. అంతటితో ఆగలేదు. స్థానికంగా ఉన్న ప్రార్థినా మందిరం చూట్టూ ప్రదిక్షణలు చేయమన్నాడు. అక్కడి చెట్ల ఆకులు తినమన్నాడు. బాధితుల్ని పడుకోబెట్టి వారి ముఖంపై నడవడం, పసుపు పొడి చల్లడం, షూ వాసన చూపించడం వంటి వికృత చేష్టలకు పాల్పడ్డారు. ఈ క్రమంలో దొంగబాబాల్ని ఆటకట్టించే ఓ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు స్ట్రింగ్ ఆపరేషన్ చేపట్టి సంజయ్‌ను పోలీసులకు పట్టించింది. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. నిందితుడిపై కఠిన చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు డిమాండ్ చేస్తున్నారు.



# టీనేజ్‌లోకి సితార పాప

## నా ప్రపంచాన్ని మార్చింది నీవే!

సూపర్‌స్టార్ మహేశ్‌బాబు గారాలపట్టి సితార బర్త్‌డే నేడు (జూలై 20). కూతురి పుట్టినరోజు పురస్కరించుకుని మహేశ్‌నమ్రత దంపతులు సోషల్ మీడియాలో ఎమోషనల్ పోస్టులు పెట్టారు. క్రిస్మస్ సెలబ్రేషన్స్‌లో తీసుకున్న ఫోటోను ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేసిన మహేశ్.. 'తనిప్పుడు టీనేజర్.. హ్యాపీ బర్త్‌డే సితార. నువ్వు నా జీవితంలో ఎప్పుడూ వెలుగులు నింపుతూనే ఉంటావు. లవ్యూ సో మచ్..' అని క్యాప్షన్ జోడించాడు.

**నా ప్రపంచాన్ని మార్చేసిన చిన్నారి**

నమ్రత.. సితార చిన్నప్పటి ఫోటోలతో పాటు ఇటీవలి కాలంలో తనతో దిగిన పిక్‌ను సైతం షేర్ చేసింది. 'నువ్వు ఎంత పెద్దదానివైనా.. నా ప్రపంచాన్ని పూర్తిగా మార్చేసిన చిన్నారివి నీవే! హ్యాపీ బర్త్‌డే సితార.. ఐ లవ్యూ' అని రాసుకొచ్చింది. సితార అన్న గౌతమ్ కూడా చెల్లెలికి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపాడు. జీవితాన్ని మరింత సంతోషదాయకంగా మార్చే సితారకు హ్యాపీ బర్త్‌డే.. లవ్యూ అని రాసుకొచ్చాడు. ఈ పోస్ట్‌కు చిన్నప్పటి ఫోటోను జత చేశాడు.

**సితార వెరీ పాపులర్**

కాగా సితార.. చిన్నప్పటి నుంచే సోషల్ మీడియాలో చాలా పాపులర్. పలు పాటలకు డ్యాన్సులు చేసి అలరించేది. ఇటీవలి కాలంలో తండ్రితో కలిసి వాణిజ్య ప్రకటనల్లోనూ కనిపిస్తోంది. ఓ జ్యువెలరీ బ్రాండ్‌కు అంబాసిడర్‌గానూ వ్యవహరిస్తోంది. ఈ జ్యువెలరీ యాడ్ అమెరికాలోని న్యూయార్క్‌లో టైమ్ స్క్వేర్ బోర్డ్‌పై ప్రత్యక్షం కావడంతో సితార పేరు తెగ మార్మోగిపోయింది. తన ఫస్ట్ రెమ్యునరేషన్ ఓ ఛారిటీకి విరాళంగా ఇచ్చేసి తండ్రి లాగే తనది కూడా గొప్ప మనసని నిరూపించుకుంది.



# ఎక్కడికి వెళ్లినా అనుష్క వెంట

## ఇది కచ్చితంగా ఉండాల్సిందే!

అనుష్క శెట్టి నవంబర్ 7న పుట్టింది. అదే రోజున మహానటుడు కమల్ హాసన్ పుట్టిన రోజు. అందుకే కొందరు 'నటనకి పుట్టిన రోజు' అని కామెంట్ చేస్తుంటారు. నటన మీద ఆసక్తి లేకపోయినా, అనుకోకుండా హీరోయిన్‌గా అవకాశం వచ్చింది. ముంబైలో భరత్ ఠాకూర్ వద్ద యోగా టీచర్‌గా పనిచేస్తుండగా, బాలీవుడ్ డైరెక్టర్ ఇ.నివాస్ ద్వారా తెలుగు దర్శక నిర్మాత పూరీ జగన్నాథ్ పరిచయమయ్యారు.

**అరుంధతితో స్టార్‌డమ్**

రామ్ చరణ్ మొదటి సినిమా 'చిరుత'.. మొదట పూరీ జగన్నాథ్ తమ్ముడు సాయిరామ్ శంకర్‌తో 'సాగర్' పేరుతో మెహర్ రమేష్ డైరెక్షన్‌లో తీద్దామనుకున్నారు. ఆ సినిమా కోసం అనుష్కను మొదట ఫొటోషూట్ చేశారు. కానీ అనుకున్నవేవీ జరగలేదు. 'సూపర్' సినిమాతో హీరోయిన్‌గా పరిచయమైంది. 'అరుంధతి'తో వెనక్కి తిరిగి చూసుకోవాల్సిన అవసరం లేకుండా పోయింది. 'బాహుబలి', 'రుద్రమదేవి', 'భాగమతి' మొదలైన సినిమాలు ఆమె స్టార్‌డమ్‌ను పెంచాయి.

**అర్జున్‌రెడ్డిలో..**

కర్ణాటకలోని మంగళూరు ప్రాంతానికి చెందిన కుటుంబం అనుష్క శెట్టిది. అందుకే విజయ్ దేవరకొండ 'అర్జున్ రెడ్డి'లో హీరోయిన్ మంగళూరు ఏరియాకు చెందిన అమ్మాయి అని చూపించగానే, అనుష్క బాగా కనెక్ట్ అయి, ఆ విషయం హైలైట్ చేస్తూ ట్వీట్ కూడా చేసింది. క్రిష్ డైరెక్షన్‌లో గతంలో 'వేదం' సినిమా చేసిన అనుష్క శెట్టి ఇప్పుడు 'ఘాటీ' మూవీ చేస్తోంది.

**హారర్ సినిమాలంటే భయం**

మలయాళంలో ఫస్ట్ టైమ్ యాక్ట్ చేస్తోంది. ఆ సినిమా పేరు 'ఘటన'. కార్తీ నటించిన 'ఖైదీ' సినిమా ఎంతటి సెన్సేషనల్ హిట్టో అందరికీ తెలిసిందే. ఆ సినిమా సీక్వెల్‌కి అనుష్కని హీరోయిన్‌గా డైరెక్టర్ లోకేష్ కనగరాజ్ సెలెక్ట్ చేసినట్లు ప్రచారం జరుగుతోంది. ఇదెంత నిజమో చూడాలి. 'అరుంధతి', 'పంచాక్షరి', 'భాగమతి', 'నిశ్శబ్దం' లాంటి హారర్, క్రైమ్ థ్రిల్లర్స్‌లో యాక్ట్ చేసిన అనుష్కకి పర్సనల్‌గా హారర్ సినిమాలు చూడటం అంటే మాత్రం చాలా భయం!

# మాఫియా డాన్‌తో ప్రేమాయణం..

## బాలీవుడ్‌ని వణించిన పాకిస్తాన్ నటి

బాలీవుడ్‌లో 80-90లలో హిందీ సినిమా ప్రపంచం, అండర్ వరల్డ్ గ్యాంగ్‌ల మధ్య సంబంధాలపై ఎన్నో రకాల వార్తలు, కథనాలు, విశ్లేషణలు, చర్చలు సాగాయి. మరీ ముఖ్యంగా ఆ సమయంలో సినీ కథానాయికలు, మాఫియా డాన్‌లతో సంబంధాలు పెట్టుకున్నట్టు పలు రహస్యాలు సైతం బయటికి వచ్చాయి. అందులో చాలా మందికి తెలిసిన ఒక బహిరంగ రహస్యం దావూద్-మందాకినిల ఎఫైర్ అయితే, అతి కొద్ది మందికే తెలిసిన మరో కథలో అనితా అయూబ్ అనే హీరోయిన్ ప్రధాన పాత్రధారిణి.

**అనితా ఎవరు?**

పాకిస్థాన్‌లో పుట్టిన కరాచీ కు చెందిన అనితా అయూబ్ ఆంగ్ల భాషలో మాస్టర్స్ చేసింది. ఆ తర్వాత మన దేశంలో అడుగుపెట్టి రోషన్ తనేజా యాక్టింగ్ స్కూల్‌లో శిక్షణ తీసుకుంది. చిన్న చిన్నగా అవకాశాలు అందిపుచ్చుకుంటూ మొదట మోడల్‌గా, ప్రకటనల్లో నటించి, 1993లో హిందీ చిత్ర పరిశ్రమలోకి అడుగు పెట్టారు. ఆమె దేవ్ ఆనంద్ దర్శకత్వంలో వచ్చిన ప్యార్ కా తరానా చిత్రంలో హీరోయిన్‌గా పరిచయమయ్యారు. ఆ తరువాత 1994లో వచ్చిన గ్యాంగ్ స్టర్ చిత్రంలో కూడా నటించింది. బహుశా అందరు హీరోయిన్లలాగే అయితే ఆమె మరిన్ని చిత్రాల్లో నటించి ఇప్పటికీ కొనసాగుతూనే ఉండేదేమో.. కానీ ఆమె ఒకటి తలిస్తే..అప్పటి బాలీవుడ్‌ని శాసించిన నేర సామ్రాజ్య చక్రవర్తి మరొకటి తలచాడు.



**మాఫియా పడగ నీడలో...**

అందం, అభినయం ఉన్న అనితాపై నాటి మాఫియా డాన్ దావూద్ ఇబ్రాహీమ్ మనసు పడ్డాడు. దాంతో ఆమె జీవితం మారిపోయింది. తరచుగా దావూద్‌తో ఆయన సహచరులతో కలిసి అనితా కనిపిస్తుండడంతో వీరిద్దరి మధ్య సంబంధాలు ఏర్పడాయంటూ వార్తలు హల్‌చల్ చేశాయి. అయితే ఆమె ఎప్పుడూ ఈ వివాదాన్ని బహిరంగంగా ఒప్పుకోలేదు, కానీ సినీ పరిశ్రమ మాత్రం పూర్తిగా నమ్మింది. దానికి బలమైన కారణాలు కూడా లేకపోలేదు. అందులో ఒక ప్రధాన కారణం అప్పట్లో జరిగిన ఓ బాలీవుడ్ నిర్మాత హత్య. 1995లో నిర్మాత జావేద్ సిద్ధీక్ ఓ చిత్రాన్ని నిర్మించ తలపెట్టారు.

# సగం పారితోషికమే తీసుకున్న హీరో..

## నిర్మాతకు అండగా..



**చెన్నై:** నటుడు, సంగీత దర్శకుడు జీవీ ప్రకాశ్ కుమార్ కథానాయకుడిగా నటించిన తాజా చిత్రం బ్లాక్‌మెయిల్. తేజు అశ్విని, బిందు మాధవి కథానాయికలుగా నటించారు. మిస్సెస్ జేడీఎస్ ఫిలిమ్ ఫ్యాక్టరీ పతాకంపై అమల్ రాజ్ నిర్మించిన మొదటి చిత్రం ఇది. ఎం.మారం కథా, దర్శకత్వం వహించగా శ్యామ్ సీఎస్ సంగీతాన్ని అందించారు. నిర్మాణ కార్యక్రమం పూర్తి చేసుకున్న ఈ చిత్రం ఆగస్టు 1వ తేదీన విడుదలకు సిద్ధమవుతోంది.

**చివర్లో..**

ఈ సందర్భంగా చిత్ర ఆడియో ఆవిష్కరణ కార్యక్రమాన్ని శనివారం ఉదయం స్థానిక వడపళనిలోని కమలా థియేటర్‌లో నిర్వహించారు. దర్శక సంఘం అధ్యక్షుడు ఆర్వీ ఉదయ్ కుమార్, వసంత బాలన్, అధిక్ రవిచంద్రన్, నిర్మాత కదిరేసన్, ధనుంజయన్ సహా పలువురు సినీ ప్రముఖులు హాజరయ్యారు. ఈ సందర్భంగా చిత్ర నిర్మాత అమల్ రాజ్.. జీవీ ప్రకాశ్‌కు ధన్యవాదాలు తెలుపుకుంటున్నానన్నారు. చివర్లో 8 రోజుల షూటింగ్‌ను పూర్తి చేయలేని సమయంలో జీవీ ప్రకాష్ తనకు అండగా నిలబడ్డారన్నారు.

**రుణపడి ఉంటా**

ఏమీ ఆశించకుండా సగం పారితోషికం మాత్రమే తీసుకొన్నారని పేర్కొన్నారు. షూటింగ్ పూర్తి చేయడంతో పాటు ఆడియో రిలీజ్ ఫంక్షన్ చేసే వరకు హీరోనే కారకుడయ్యారన్నారు. ఆయనకు ఎప్పటికీ రుణపడి ఉంటానన్నారు. నటుడు జీవీ ప్రకాష్ కుమార్ మాట్లాడుతూ.. మారం ప్రతిభావంతుడైన దర్శకుడని ప్రశంసించారు. ఈ చిత్రం ద్వారా నిర్మాతగా పరిచయం అవుతున్న అమల్ రాజ్‌కు శుభాకాంక్షలు తెలిపారు. నటి తేజుతో ఇంతకుముందు ఒక వీడియో సాంగ్ కోసం నటించానని అది బాగా వైరల్ అయిందని, ఆ విధంగా ఆమె ఈ చిత్రంలో కథానాయికగా ఎంపిక అయ్యారని జీవీ ప్రకాష్ కుమార్ పేర్కొన్నారు.

# రెమ్యునరేషన్ పెంచేసిన జాన్వీ..



అలనాటి అందాల తార శ్రీదేవి నట వారసురాలుగా ఏడేళ్ల క్రితం సినిమా పరిశ్రమలోకి అడుగుపెట్టింది జాన్వీ కపూర్ . హిందీలో వరుస సినిమాలు చేస్తున్నప్పటికీ ఇప్పటి వరకు భారీ హిట్ పడిందే లేదు. తెలుగులో మాత్రం దేవర సినిమాతో ఎంట్రీ ఇచ్చి మంచి విజయాన్ని అందుకుంది. ఆ తర్వాత అటు బాలీవుడ్‌లోనూ, ఇటు సౌత్‌లోనూ వరుస సినిమాలతో దూసుకెళ్తోంది. అయినా కూడా ఇప్పటికీ ఈ బ్యూటీకి బాలీవుడ్‌లో సాలిడ్ హిట్ పడలేదు. కానీ రెమ్యునరేషన్ మాత్రం సినిమా సినిమాకి పెంచేస్తుంది. బాలీవుడ్ కంటే సౌత్ సినిమాలకే ఎక్కువ పారితోషికం పుచ్చుకుంటుందట. తొలి టాలీవుడ్ మూవీ దేవరకు రూ. 5 కోట్లు పారితోషికంగా పుచ్చుకుంది ఈ బ్యూటీ. అప్పటి వరకు ఆమెకు అదే అత్యధిక పారితోషికం. ఆ తర్వాత పెద్ది సినిమాలో చాన్స్ వచ్చింది. ఈ సినిమాకు మరో కోటి పెంచేసిందట. ఈ సినిమాకు గాను రూ. 6 కోట్లు పారితోషికంగా తీసుకుంటున్నట్లు టాలీవుడ్‌లో టాక్ నడుస్తోంది. అల్లు అర్జున్-అట్లీ సినిమాలోనూ ఓ పాత్ర కోసం జాన్వీ కపూర్‌ని సంప్రదించారట. ఈ చిత్రానికి మరో కోటి పెంచేసి..మొత్తంగా రూ. 7 కోట్ల పారితోషికం డిమాండ్ చేసిందట. దీంతో చిత్రబృందం ఆమెతో బేరాలు సాగిస్తునారట. కాస్త తగ్గిస్తే ఆమెను తీసుకుందామని అనుకుంటున్నారట. జాన్వీ మాత్రం తగ్గేలా కనిపించడం లేదని ఇండస్ట్రీ టాక్. బాలీవుడ్‌లో తక్కువ తీసుకొని తెలుగు సినిమాలకు ఎక్కువ రెమ్యునరేషన్ తీసుకోవడం సరికాదని, ఇలా అయితే ఆమె కెరీర్‌కు ఇబ్బంది అవుతుందని సినీ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY KANDI RAMACHANDRA REDDY, printed at SRI MATHA PRINTERS, H.NO.1-1-562/1, GANDHI NAGAR, HYDERABAD. Telangana- 500020, PUBLISHED AT 43/A, MLA Colony, Road No. 12, Banjara Hills, Hyderabad. Telangana- 500034. RNI NO : APTEL/2003/09316. PH NO : 7436939999, Email : mahaapatrika@gmail.com